03-08-2026 సోమవారం




ESTD: 1999
www.voodayam.com

# వుదయం

కరీంనగర్ 15-08-2026 శనివారం | సంపుటి : 14 | సంచిక :238 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on




# విద్యతోనే తలరాత మారేది

## ఆత్మగౌరవం సీఎం రేవంత్ రెడ్డి

■ నెక్లెస్ రోడ్‌లో పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ



**హైదరాబాద్, ఆగస్టు 14 (వుదయం) :** మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే చూపిన ఆత్మగౌరవ పోరాట మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని, తెలంగాణ సమాజ మార్పునకు, ప్రగతికి 'విద్యే ఏకైక పరిష్కారం' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నెక్లెస్ రోడ్డు చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే, శ్రీమతి సావిత్రీ బాయి పూలే దంపతుల విగ్రహావిష్కరణ మహోత్సవంలో సీఎం పాల్గొని ప్రసంగించారు.

**ప్రేరణా కేంద్రంగా నెక్లెస్ రోడ్డు చౌరస్తా**

"దేశంలో ఎక్కడ చూసినా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలు కనిపిస్తాయి. కానీ, నేడు మన నెక్లెస్ రోడ్డు చౌరస్తాలో ఒకవైపు అంబేద్కర్, మరోవైపు ఇందిరా గాంధీ, పి.వి. నరసింహారావులతో పాటు జ్యోతిబా పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించుకోవడం చారిత్రాత్మకం. ఈ చౌరస్తా ఇప్పుడు ఒక అద్భుతమైన ప్రేరణా కేంద్రంగా మారింది. 150 ఏళ్ల క్రితమే చదువు ప్రాధాన్యాన్ని గుర్తించి, తన సతీమణిని చదివించి సమాజానికి ఆదర్శంగా నిలిచిన మహనీయుడు పూలే. ఆయన ఆశయ సాధనకు మా ప్రభుత్వం కట్టుబడి

2 లో..

## ఇంతే కదా...!



## కొత్తగా 62 లక్షల
# రేషన్ కార్డుల మంజూరు

**హైదరాబాద్, ఆగస్టు 14 (వుదయం) :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో దాదాపు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన రాష్ట్ర మంత్రివర్గ (క్యాబినెట్) సమావేశం ముగిసింది. ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలను ఆమోదించారు. సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ రఘురామిరెడ్డిలతో కలిసి రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ వివరాలను అధికారికంగా వెల్లడించారు.

డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0'

గత ఏడాది కంటే మరింత ఘనంగా ప్రపంచ స్థాయి పెట్టుబడుల సదస్సును నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ గ్లోబల్ సమ్మిట్‌ను

2 లో..

## వికసిత్ భారత్-2047
# లక్ష్యంగా కదలిరండి



**న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ఎఎంఎస్) :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, 'వికసిత్ భారత్2047' లక్ష్య సాధన దిశగా దేశప్రజలంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా క్లిష్టమైన ఆర్థిక పరిస్థితులు ఉన్నప్పటికీ, భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబడటమే కాకుండా అగ్రగామిగా ఎదుగుతోందని కొనియాడారు. దేశ పాలనకు, ప్రగతికి రాజ్యాంగమే ఏకైక దిక్సూచి అని, దానిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఉద్ఘాటించారు. దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకెళ్తోందని, పారదర్శక పాలన ద్వారా ప్రతి పౌరుడికి ఫలాలు అందుతున్నాయని రాష్ట్రపతి వివరించారు.

2 లో..
































# వికసిత్ భారత్-2047 లక్ష్యంగా కదలిరండి

**మొదటి పేజీ తరువాయి..**
దేశవ్యాప్తంగా 59 కోట్ల మందికి బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చాం. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా 80 కోట్ల మందికి ఉచిత రేషన్ సరుకులను అందజేస్తున్నాం. వైద్య, రైతు సంక్షేమం: 'ఆయుష్మాన్ భారత్' ద్వారా 60 కోట్ల మందికి ఉచిత వైద్య సేవలు లభిస్తుండగా, 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు రూపురేఖలు మార్చుకున్నాయి. డిజిటల్ లావాదేవీల్లో భారత్ ప్రపంచ రికార్డు, ప్రపంచంలోనే అత్యంత భారీ, సురక్షితమైన డిజిటల్ మౌలిక సదుపాయాలను భారత్ స్వయంగా నిర్మించుకుందని ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ఈ సాంకేతిక విప్లవం మూలంగా నేడు మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం సామాన్యులు కూడా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారని, ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు జరుగుతున్న ఏకైక దేశంగా భారత్ అగ్రస్థానంలో నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు.

# విద్యతోనే తలరాత మారేది

**మొదటి పేజీ తరువాయి..**
కట్టుబడి ఉంది" అని సీఎం పేర్కొన్నారు. విద్యా వ్యవస్థ ప్రక్షాళన - ఫీజు రీయింబర్స్‌మెంట్ విప్లవం సామాజిక చైతన్యం, కుల నిర్మూలన జరగాలంటే అందరూ కలిసికట్టుగా చదువుకోవడమే మార్గమని, అందుకే తమ ప్రభుత్వం 'ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' రూపుదిద్ది విద్యా వ్యవస్థను స మూలంగా ప్రక్షాళన చేస్తోందని వివరించారు. ముందస్తు ఫీజు రీయింబర్స్‌మెంట్: ప్రతి ఏటా రూ. 2,300 కోట్లను విద్యార్థుల ఖాతాల్లో వేస్తామని, ఈ విద్యా సంవత్సరం నుంచే రూ. 2,400 కోట్లను అడ్వాన్స్‌గా జమ చేస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోనే నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకి నిధులు వెళ్తాయి. సర్టిఫికేట్ల నిలిపివేతకు చెక్: ఫీజులు చెల్లించలేదనే నెపంతో ఏ కళాశాల యాజమాన్యం విద్యార్థుల సర్టిఫికేట్లను ఆపే పరిస్థితి లేకుండా ముందస్తుగానే ప్రభుత్వం నిధులు చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. డిగ్రీలతో పాటు సాంకేతిక నైపుణ్యం కేవలం ఇంజనీరింగ్, డాక్టర్ పట్టాలు ఉంటే సరిపోదని, మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయని సీఎం స్పష్టం చేశారు. నర్సరీ నుండి స్కిల్స్: నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు సాంకేతికనైపుణ్యశిక్షణఅందిస్తున్నాం. టాటా సంస్థతో ఏటీసీలు: 2024 లో టాటా భాగస్వామ్యంతో 119 నియోజకవర్గాల్లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను (ATCs) ఏర్పాటు చేశాం.

# కొత్తగా 62 లక్షల రేషన్ కార్డుల మంజూరు

**మొదటి పేజీ తరువాయి..**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో దాదాపు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన రాష్ట్ర మంత్రివర్గ (క్యాబినెట్) సమావేశం ముగిసింది. ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలను ఆమోదించారు. సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ రఘురామి రెడ్డిలతో కలిసి రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ వివరాలను అధికారికంగా వెల్లడించారు. డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' గత ఏడాది కంటే మరింత ఘనంగా ప్రపంచ స్థాయి పెట్టుబడుల సదస్సును నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. సదస్సు పర్యవేక్షణకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి నేతృత్వంలో సబ్ కమిటీతో పాటు నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. సదస్సు థీమ్: ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సును నిర్వహించనుండగా, ప్రధానంగా డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో రాష్ట్రానికి ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పనున్నారు. ఫ్యూచర్ సిటీ ప్లాన్: ఈ సదస్సు వేదికగా ప్రతిష్టాత్మక 'ఫ్యూచర్ సిటీ ప్లాన్'ను ఆవిష్కరించనున్నారు.




# హర్ ఘర్ తిరంగా ర్యాలీ
# దేశభక్తిని చాటిన విద్యార్థులు

**అయిజ ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి)**
దేశభక్తి, జాతీయ జెండాపై గౌరవం పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా న్యూ గీతాంజలి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐజ మున్సిపాలిటీలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కె. వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ కొత్త బస్టాండ్ నుంచి ప్రారంభమై పాత బస్టాప్, అంబేద్కర్ చౌక్ మీదుగా సాగింది.
విద్యార్థులు చేతుల్లో త్రివర్ణ పతాకాలు పట్టుకుని "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" అంటూ దేశభక్తి నినాదాలు చేశారు. జాతీయ జెండాను గౌరవించాలని, దేశాన్ని ప్రేమించాలని ప్రజలకు సందేశం ఇచ్చారు.
"హర్ ఘర్ తిరంగా అంటే ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి. మన జెండా మన దేశానికి గర్వకారణం" అని విద్యార్థులు తెలియజేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు.
దేశం పట్ల ప్రేమ, అందరితో కలిసి ఉండటం, మన జాతీయ జెండాను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సింగారంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ
# గ్రామ పంచాయతీ ప్రారంభం

- ఎమ్మెల్యేలు, డీఎస్పీకి ఆహ్వాన పత్రాల అందజేత

**అచ్చంపేట, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**
మండల పరిధిలోని సింగారం గ్రామంలో ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నూతన డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ, నూతన గ్రామ పంచాయతీ ప్రారంభోత్సవం జరుగుతాయి.ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కూచుకుళ్ల రాజేశ్ రెడ్డిలకు సర్పంచ్ నీలం శేఖర్ యాదవ్, గ్రామ యువకులతో కలిసి క్యాంప్ కార్యాలయంలో ఆహ్వాన పత్రాలు అందజేశారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్‌కు కూడా ఆహ్వానం అందించారు.ఈ కార్యక్రమంలో జర్పుల నరేందర్ నాయక్, కొండెమోని బక్కయ్య, సల్వాది వెంకటేష్, పానుగంటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# తాండూరులో విరాజిల్లిన దేశభక్తి.. ఘనంగా 'తిరంగా ర్యాలీ'

- హాజరైన రాబల్ ఆర్ బి వో ఎల్సీఈఓ , కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి

**తాండూరు, ఆగస్టు 14 వుదయం ప్రతినిధి:**
స్వాతంత్ర్య దినోత్సవ శుభసందర్భాన్ని పురస్కరించుకుని తాండూరు పట్టణంలో 'తిరంగా ర్యాలీ' అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆర్ బి ఓ ఎల్ సీఈఓ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, జాతీయ జెండాను చేతబూని ర్యాలీని ముందుండి నడిపించారు.స్థానిక నెహ్రూ గంజ్ నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా వైభవంగా సాగింది. ర్యాలీ పొడవునా యువత, ప్రజలు మిన్నంటేలా చేసిన దేశభక్తి నినాదాలతో తాండూరు వీధులు మారుమోగాయి.

**దేశ ఐక్యతకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి:**
ఈ సందర్భంగా బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... "దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల త్యాగాలు వెలకట్టలేనివి. వారి త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యత, సమగ్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్క పౌరుడూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. మన జాతీయ జెండా మనందరిలో దేశభక్తిని, ఐక్యతను మరియు గర్వభావాన్ని నింపే మహోన్నత ప్రతీక" అని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో పట్టణ పుర ప్రముఖులు, వర్తకవ్యాపారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువత మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని, జాతీయ స్ఫూర్తిని చాటుతూ తిరంగా ర్యాలీని మహోజ్జ్వలంగా విజయవంతం చేశారు.




# 24 గంటల్లో ఇచ్చిన మాట అమలు



- విద్యార్థులకు షూస్ అందించిన బి.ఆర్.ఎస్ నాయకుడు తోట కమలాకర్ రెడ్డి
- తన వంతుగా పాఠశాలకు సహకరిస్తానని వెల్లడి
- విద్యార్థులకు స్వయంగా షూ తొడిగిన తోట కమలాకర్ రెడ్డి
- మాట ఇచ్చిన వెంటనే స్పందించిన నాయకుడికి ఘన సన్మానం

**మిరుదొడ్డి, ఆగస్టు 14, వుదయం:**
మానవత్వంతో స్పందించి ఇచ్చిన మాటకు కట్టుబడి విద్యార్థులకు 24 గంటల్లోనే షూస్ ను బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి అందజేశారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన సందర్భంగా విద్యార్థులు తమకు షూస్ కావాలని తోట కమలాకర్ రెడ్డికి విన్నవించిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన ఆయన 24 గంటల్లోపే విద్యార్థులకు శుక్రవారం షూస్ ను స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ ఆధ్వర్యంలో అందజేసి విద్యార్థుల కోరికను నెరవేర్చారు. కొంతమంది విద్యార్థులు షూస్ వేసుకోరాదని తెలపడంతో స్వయంగా తానే షూస్ వేసి విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రేపటి సమాజ నిర్మాణానికి నేటి బాలలను తయారు చేయాలని సూచించారు. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే శక్తివంచన లేకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు అడిగిన వెంటనే షూస్ అందించిన తోట కమలాకర్ రెడ్డికి స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ తో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలరాజు, పంచాయతీ కార్యదర్శి రాజేష్, గ్రామ యువకులు యాదగిరి, పరుశరాములు, బాల్ రెడ్డి, కృష్ణ, నర్సింలు, స్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మృతునికుటుంబాన్ని పరామర్శించి
# ఆర్థిక సహాయం అందజేత



- బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య

**వెల్దండ న్యూస్ ఆగస్టు 14 వుదయం ప్రతినిధి**
వెల్దండ మండల కేంద్రానికి చెందిన వాన రాసి రాములు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్ వార్డు సభ్యులు సిర్సనగండ్ల శేఖర్ బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కొమ్ము నాగయ్య, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మంగళగిరి సత్యం,బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు జంగిలి ప్రవీణ్,గోపాల్, బిట్టి సైదులు,వానరాశి రాములు, శివరాజ్, మహేష్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గైరన్ తండా రోడ్డు నిర్మాణానికి భూమి పూజలో ఎమ్మెల్యే, ఖేడ్ సబ్ కలెక్టర్

- రోడ్డు భూమి పూజతో
- మా తాండాకు ఇప్పుడు స్వాతంత్రం వచ్చింది. తాండవాసులు.

**నారాయణఖేడ్ ఆగస్టు 14(వుదయం)**
నారాయణఖేడ్ నియోజకవర్గంపరిధిలో నిసిర్గాపూర్ మండలం వాంగ్దల్ గైరన్ తండా( డబ్బు )కు రహదారి నిర్మాణం కోసం సోమవారం శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమ హారతి భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ట్రాక్టర్‌పై తండాకు వెళ్లి, అక్కడ చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణ పనులు, రహదారి నిర్మాణంపై అధికారులతో కలిసి చర్చించారు.
అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ
గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అనేక రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో రహదారికి మరమ్మతులు చేపడుతూ, నియోజకవర్గంలోని అన్ని రహదారులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. గైరన్ తండాలో విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ నిధుల నుంచి కేవలం రూ.4,000 డీడీ చెల్లిస్తే, తండాకు అవసరమైన 10 విద్యుత్ స్తంభాలతో పాటు విద్యుత్ సామగ్రిని అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.
రోడ్డుకు భూములు ఇచ్చిన రైతులకు సన్మానం చేశారు. తమ భూములను అందించిన రైతులను ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనులకు రైతులు సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు.

**మా తాండాకు నిజమైన స్వాతంత్రం ఈరోజు వచ్చింది.**
**తండావాసులు మాట్లాడుతూ....**
"మా తండాకు నిజమైన స్వాతంత్ర్యం ఈరోజు వచ్చిందనీ వర్షం వ్యక్తం చేశారు.రోడ్డు నిర్మాణానికి భూమిపూజ జరగడంతో గైరన్ తండావాసులు ఆనందం వ్యక్తం చేశారు. "దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడిచినా మా తండాకు మాత్రం రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డాం ఎన్నో రోజుల నుంచి ఉన్న సమస్యను ఎమ్మెల్యే సంజీవరెడ్డి మా తండాకు రోడ్డు మంజూరు చేయించి, నిర్మాణ పనులకు భూమిపూజ చేయడంతో మాకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లుగా ఉంది" అని తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.70 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న తమ తండా రోడ్డు కలను సాకారం చేస్తున్న ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డికి తండావాసుల తరఫున జీవితాంతం రుణపడి ఉంటామని వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో తమ తండాకు రహదారి, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తుండటం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిర్గాపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,వాంగ్దాల్ గ్రామం, గైరన్ తండా ప్రజలు ముఖ్య కార్యకర్తలు, మహిళలు యువకులు సర్పంచులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మిరుదొడ్డిలో "హర్ ఘర్ తీరంగా" ర్యాలీ



- 100 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల జోష్

**మిరుదొడ్డి, ఆగస్టు 14, వుదయం:**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం మిరుదొడ్డిలో "హర్ ఘర్ తీరంగా" ర్యాలీ అంగరంగ వైభవంగా నిర్వహించారు.ర్యాలీలో విద్యార్థులు 100 మీటర్ల భారీ జాతీయ జెండాను ఊరేగించి అందరి దృష్టిని ఆకర్షించారు. "భారత్ మాతా కీ జై" నినాదాలతో ప్రధాన రహదారుల గుండా సాగిన ర్యాలీలో విద్యార్థులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్ రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుని, వారి స్ఫూర్తిని విద్యార్థులకు తెలియజేశారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, రేపటి పౌరులుగా ఎదుగుతున్న విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు, ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి రాణించాలని కమలాకర్ రెడ్డి సూచించారు. దేశ అభ్యున్నతికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ కార్యాలయాల ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన ఎమ్మెల్యే



**అక్బర్‌పేట-భూంపల్లి, ఆగస్ట్ 14, వుదయం:**
అక్బర్‌పేటభూంపల్లి మండలంలో నూతనంగా నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనాల కోసం ప్రతిపాదించిన స్థలాలను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్.సి, ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండల ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు తహసీల్దార్ కార్యాలయ భవనం, ఎంపీడీవో కార్యాలయం ఎంతో అవసరమని అన్నారు. ప్రతిపాదిత స్థలం అనుకూలంగా ఉందని, సంబంధిత ప్రభుత్వ అనుమతులు పొందిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల ప్రజలకు కార్యాలయాలకు రావడం సులభంగా ఉండేలా, అన్ని వసతులతో కూడిన ఆధునిక భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, గ్రామ గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా యాత్ర

**నారాయణఖేడ్: ఆగస్ట్ 14(వుదయం)**
భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల్లో దేశభక్తి భావనను నింపేందుకు నారాయణఖేడ్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర ఘనంగా, విద్యార్థులతో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. బీజేపీ నారాయణఖేడ్ పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, మండల అధ్యక్షులు సిందోల్ దశరథ్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప విచ్చేసి, జాతీయ పతాకాలతో శోభితుడైన యాత్రను ప్రారంభించి ముందుకు నడిపించారు. నారాయణఖేడ్ పురవీధుల గుండా సాగిన ఈ ప్రదర్శనలో వందలాది మంది విద్యార్థులు, యువకులు మరియు స్థానిక ప్రజలు జాతీయ జెండాలను చేతబూని భారత్ మాతాకీ జై వందేమాతరం అనే దేశభక్తి నినాదాలతో పట్టణాన్ని మార్మోగించారు. మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది కోట్లాది మంది భారతీయుల ఆత్మగౌరవానికి, సార్వభౌమాధికారానికి మరియు త్యాగానికి నిలువెత్తు రూపమని అన్నారు. మన త్రివర్ణ పతాకం కింద మేధావులు, యువకులు, విద్యార్థులందరూ ఒక్కటై దేశాభివృద్ధికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప మాట్లాడుతూ గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ తీసుకొచ్చిన హర్ ఘర్ తిరంగా పిలుపు దేశ సరిహద్దుల నుండి పల్లెల వరకు ప్రతి ఒక్కరిలో జాతీయ భావాన్ని రగిలించిందన్నారు. నరేంద్ర మోదీ సమర్థవంతమైన నాయకత్వంలో భారతదేశం ఆర్థికంగా, సాంకేతికంగా ప్రపంచ దేశాల సరసన అగ్రగామిగా ఎదుగుతోందని,భారత్ మాత ప్రపంచ గురువుగా మారే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు.దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందనే విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, దేశభక్తి, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని నాయకులు విద్యార్థులకు హితవు పలికారు. చదువుతో పాటు సామాజిక బాధ్యతను కూడా పెంపొందించుకోవాలని కోరారు.జిల్లా ఉపాధ్యక్షులు పత్రీ రామకృష్ణ, ఓబీసీ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కోణం విఠల్ జిల్లా నాయకులు విలాస్ రావు, మారుతీ రెడ్డి, యువమోర్చ జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్, రవి సుధాకర్, సగుణాకర్,పట్నం మాణిక్, సాయి,నాగేష్ యాదవ్ సాయిరాం నారాయణఖేడ్ పట్టణ కార్యదర్శి వెంకట్ రెడ్డి,గౌడ దశరథ్,ఉపాధ్యక్షులు అశోక్, లోకేష్, అశోక్, విష్ణు,ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యజమానులు మరియు వేలాది మంది విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పాల్గొని తిరంగా యాత్రను దిగ్విజయం చేశారు.



# ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పుస్తకాల
# పంపిణీ చేసిన శాసనసభ్యుల




- డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**వుదయం మనూరు తేదీ**
మానూర్,మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో నారాయణఖేడ్,శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా.కళాశాలలో నూతనంగా చేరిన.విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విద్యార్థులకు 12 లాంగ్ నోట్ పుస్తకాలను ఉచితంగా ఎమ్మెల్యే గారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో. విద్య అత్యంత కీలకమని అన్నారు. పేద, మధ్య తరగతి. కుటుంబాలకు చెందిన.విద్యార్థులకు చదువు విషయంలో.ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని.తెలిపారు విద్యార్థులు.ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను. సద్వినియోగం చేసుకుని.కష్టపడి చదివి. ఉన్నత స్థాయికి.ఎదగాలని. ఎమ్మెల్యే సూచించారు.చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడి. సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని.విద్యార్థులకు పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్ తదుపరి ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- బీఎల్ఓ ట్రైనర్లకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శిక్షణ

**నాగర్ కర్నూల్, ఆగస్టు 14 (వుదయం బ్యూరో):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తదుపరి కార్యాచరణను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు.జిల్లా సమీకృత అధికారుల కార్యాలయం (ఐడీఓసీ)లో శుక్రవారం మండల స్థాయి ట్రైనర్లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ అదనపు కలెక్టర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో బూత్ స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చే 18 మంది మండల స్థాయి ట్రైనర్లకు ఎస్ఐఆర్ తదుపరి దశలపై అవగాహన కల్పించారు. నోటీసుల జారీ, పత్రాల స్వీకరణ, ధ్రువీకరణ, ఆన్‌లైన్ అప్‌లోడ్, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, వివరాల సవరణ, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకూడదని, అదే సమయంలో
అనర్హత నమోదులకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు.జిల్లాలో ఇప్పటివరకు 84 శాతం మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. తల్లిదండ్రుల పేర్లు, వయసు, ఇతర వివరాల్లో లోపాలున్న 1.02 లక్షల మంది ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సరిచేయాలన్నారు. మ్యాపింగ్ కాని వారు ప్రభుత్వం సూచించిన 12 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించాలని తెలిపారు.కొత్త ఓటర్ల నమోదుకు ఫారం6, తొలగింపునకు ఫారం7, సవరణలకు ఫారం8 వినియోగించాలని వివరించారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ట్రైనర్లు మండలాల్లో బీఎల్ఓలకు బీఎల్ఓ యాప్‌పై ప్రాయోగిక శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల, రెవెన్యూ అధికారులు, ట్రైనర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# ఇన్సూరెన్స్ అవగాహన కార్యక్రమం



**కోహీర్ ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి )**
కోహీర్ మండలం పిచ్చరాగాడి గ్రామంలో శుక్రవారం నాడు బ్యాంకింగ్ సేవలు, పొదుపు, డిజిటల్ బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ధన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఖాతాల వినియోగం, డిజిటల్ బ్యాంకింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ మోసాల పట్ల అప్రమత్తత, అలాగే PMSBY, PMJJBY వంటి బీమా పథకాల ప్రయోజనాల గురించి వివరించారు.ప్రజలు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, బీమా పథకాల ద్వారా తమ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమాన్ని ధన్ ఫౌండేషన్ సదాశివపేట CFL కోఆర్డినేటర్ సంపూర్ణ మేడమ్ మరియు అసోసియేట్ స్వప్న నిర్వహించి, ప్రజలకు బ్యాంకింగ్ మరియు ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు.



# గ్రేటర్ హైదరాబాద్



## గర్భగుడి స్లాబ్ పనులు ప్రారంభం



**అమీనుపూర్ ఆగస్టు 13,**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీనాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణ పనులలో భాగంగా శుక్రవారం గర్భ గుడి స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభించిన పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు. హాజరైన అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు మల్లేష్, గోపాల్, చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు.

## లైసెన్స్ లేకుంటే కఠిన చర్యలు!



- బిడియల్ క్రాస్‌రోడ్‌లో పోలీసుల స్పెషల్ డ్రైవ్.. వాహనాల తనిఖీ

**శంకర్‌పల్లి ఆగస్టు 14 (వుదయం)**

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని శంకర్‌పల్లి పోలీసులు హెచ్చరించారు. పట్టణ పరిధిలోని బిడియల్ క్రాస్‌రోడ్‌లో శుక్రవారం పోలీసులు ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారిపై ప్రయాణిస్తున్న పలు వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌తో వాహనదారుల్లో అవగాహన పెరిగింది. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ తదితర అవసరమైన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు కోరారు. రహదారులపై నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో ఎస్సైలు దేవేందర్, మంజుల, శ్రీశైలం తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను తనిఖీల సమయంలో చూపించాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లను కొనసాగిస్తామని పోలీసులు పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై ఎలాంటి మినహాయింపులు ఉండవని, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## తిరంగా యాత్ర ద్వారా దేశభక్తి భావన పెంపొందిద్దాం



**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్**

**అమీన్‌పూర్ (వుదయం):**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడంతో పాటు తిరంగా యాత్రలు నిర్వహించడం ద్వారా దేశభక్తిని చాటుకోవడం గొప్ప విషయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ పేర్కొన్నారు.అమీన్‌పూర్ పరిధిలోని హెచ్‌ఎంటీ కాలనీ, వేదిరి కాలనీ, స్వర్ణపురి కాలనీలలో బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆగరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో వందలాది మంది విద్యార్థులు, యువత, మహిళలు, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు మరియు స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని "భారత్ మాతాకీ జై", "వందే మాతరం", "జై హింద్" నినాదాలతో యాత్రను విజయవంతం చేశారు.

హెచ్‌ఎంటీ కాలనీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ గీతం ఆలపించి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా అదెల్లి రవీందర్ మాట్లాడుతూ, భారతదేశ స్వాతంత్ర్యం కోసం అనేక మంది మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను యువత గుర్తుంచుకోవాలని సూచించారు. దేశభక్తి ప్రతి భారతీయుడి గుండెల్లో ఉండాలని, జాతీయ పండుగలను ఉత్సాహంగా జరుపుకోవడం ద్వారా దేశ ఐక్యత, సమగ్రత మరింత బలోపేతం అవుతుందని అన్నారు. మాజీ కౌన్సిలర్ మాధురి మాట్లాడుతూ, విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయతా భావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. దేశ అభివృద్ధికి యువత తమ వంతు బాధ్యతను గుర్తించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం అనంతరం "చాయ్ పే చర్చ" నిర్వహించి దేశాభివృద్ధి, యువత పాత్ర, స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యత వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు మరియు ప్రజలకు నాయకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ కౌన్సిలర్ మాధురి, శంషాబాద్ రాజు, పట్టణ అధ్యక్షులు ఆగరెడ్డి, ప్రధాన కార్యదర్శులు రమేష్ రెడ్డి, కొత్తపల్లి రమేష్, శ్రవణ్, మహేష్, శ్రీకాంత్ రెడ్డి, ఆనంద్, లక్ష్మణ్ గుప్తా, విద్యాసాగర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత కిట్ల పంపిణీ

- బాలికల ఆరోగ్యం.. విద్యాభివృద్ధికి పెద్దపీట
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు
- ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్య

**శంకర్‌పల్లి, ఆగస్టు 14 (వుదయం)**



శంకర్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు శానిటరీ ప్యాడ్స్, యూనిఫార్మ్స్, షూస్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేదశ్రీ మేడం, పాఠశాల జిల్లా చైర్మన్ చేతుల మీదుగా విద్యార్థులకు వీటిని అందజేశారు. బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులకు యూనిఫార్మ్స్, షూస్ అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. శానిటరీ ప్యాడ్స్ పంపిణీ ద్వారా బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వం, పాఠశాల ద్వారా అందుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు వేదశ్రీ మేడం మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల పాఠశాలల్లో అందిస్తున్న అల్పాహారం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించగలరని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల అవసరాలను గుర్తించి వివిధ రకాల సౌకర్యాలను అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యతో పాటు విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు, ప్రయోజనాలు అందుతున్నాయని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సౌకర్యాలు, సంక్షేమ కార్యక్రమాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అనేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పాఠశాల నిర్వాహకులు ఆకాంక్షించారు. బాలికల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను పాఠశాల స్థాయిలో మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులకు యూనిఫార్మ్స్, షూస్ అందడంతో పాటు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేయడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ఉచిత విద్యా సౌకర్యాలపై అవగాహన పెంచుకుని తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించిన వ్యక్తికి 10,000 జరిమానా...




**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండలం మద్యం సేవించి డీసీఎం వాహనం నడిపిన వ్యక్తికి రూ 10,000 జరిమానా గౌరవ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి విధించారు. వివరాల్లోకి వెళితే.. రామ సుబ్బా నాయుడు అనే వ్యక్తి మద్యం సేవించి డీసీఎం వాహనాన్ని నడుపుతూ నిజాంపేట పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ మేరకు నిజాంపేట ఎస్ఐ రాజేష్ సదరు వ్యక్తిని గౌరవ న్యాయస్థానంలో హాజరుపరచగా, గౌరవ మేజిస్ట్రేట్ శ్రీ సాయి ప్రభాకర్ కేసును విచారించి సదరు వ్యక్తికి ₹10,000/ జరిమానా విధించారు .ఈ సందర్భంగా నిజాంపేట ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారులతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, మద్యం సేవించి వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## మోకిల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్

**శంకర్‌పల్లి ఆగస్టు 14 (వుదయం)**



శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శంకర్‌పల్లి మండల ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ హాజరై విద్యార్థులకు ఏకరూప దుస్తులను స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఎంపీడీవోకు స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేసి వారి విద్యాభ్యాసం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. విద్యార్థుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను విద్యార్థులకు అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఏకరూప దుస్తుల పంపిణీ ద్వారా విద్యార్థుల్లో సమానత్వ భావన పెంపొందుతుందని, పాఠశాలపై మరింత ఆసక్తి కలుగుతుందని అన్నారు.ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య అందుతోందని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎంతో బాధ్యతతో విద్యాబోధన చేస్తున్నారని ప్రశంసించారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, వసతులు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేవలం కార్పొరేట్ పాఠశాలల్లోనే మంచి విద్య లభిస్తుందనే భావనను తల్లిదండ్రులు విడనాడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి ఉన్నత విద్యకు ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేసి వారి విద్యాభ్యాసం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్, నాయకులు గౌండ్ర సత్యం, వెంకటేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది.

## పెన్షన్లకు దరఖాస్తులు గ్రామపంచాయతీ కార్యాలయంలోనే ఇవ్వాలి

- ఆగస్టు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ
- అర్హులైన వారు అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి

**శంకర్‌పల్లి ఆగస్టు 14 (వుదయం)**



కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే వారు సాధ్యమైనంత వరకు తమ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలోనే దరఖాస్తులు సమర్పించాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు అందించాలని సూచించారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు సహకరించాలని కోరారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురైతే మండల పరిషత్ కార్యాలయంలో కూడా దరఖాస్తులు సమర్పించే అవకాశం ఉందని తెలిపారు.ఆసరా పెన్షన్లకు వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, బోదకాలు వ్యాధితో బాధపడుతున్నవారు, ఎయిడ్స్ బాధితులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు తదితర అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో తెలిపారు. అర్హతకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలను దరఖాస్తుతో పాటు జత చేసి సమర్పించాలని సూచించారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ విషయం తెలిసేలా ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు అవగాహన కల్పించాలని కోరారు.కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ ఈనెల 31వ తేదీ వరకు కొనసాగుతుందని వి. ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించేలా సంబంధిత కార్యదర్శులకు సూచనలు చేసినట్లు తెలిపారు. పెన్షన్ పొందేందుకు అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

## సీఎం సభ విజయవంతానికి కాట పిలుపు

**రామచంద్రపురం ఆగస్టు 14**



సంగారెడ్డిలో శనివారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.ఈ మేరకు శుక్రవారం తన నివాసంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సీఎం సభకు పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి ప్రజలను సభకు తరలించేలా కృషి చేయాలని సూచించారు.అర్హులైన పేదలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కాట శ్రీనివాస్ గౌడ్ కోరారు.

## స్వచ్ఛతతో పాటు దేశభక్తి, జాతీయ సమైక్యతపై అవగాహన



- స్వచ్ఛ పఖ్వాడా, హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహణ

**సంగారెడ్డి ఆగస్టు 14(వుదయం)**

స్వచ్ఛ పఖ్వాడా (స్వచ్ఛ పక్కవాడ), హర్ ఘర్ తిరంగా (హరి ఘర్ తిరంగా ) కార్యక్రమాలను పురస్కరించుకుని కళాశాలలో పలు అవగాహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, జాతీయ జెండా ప్రాధాన్యత, దేశభక్తి, జాతీయ సమైక్యతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా Dr. Vaidyanath గారు (ప్రెసిడెంట్ అఫ్ TGO) హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ Dr. R.swamy ,NSS ఆఫీసర్ Dr. P. రమేష్, Dr. Ch. బాలచందర్ తదితరులు పాల్గొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను తమ బాధ్యతగా భావించి పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని తెలిపారు. విద్యార్థులు స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజలకు ఆదర్శంగా నిలవాలని కోరారు.అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి పరిరక్షణకు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని వివరించారు.హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను ఎగురవేయడం ద్వారా దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ సమైక్యత, దేశభక్తి భావాలను చాటాలని సూచించారు. జాతీయ జెండా మన దేశ గౌరవానికి ప్రతీక అని, దాని ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత భావాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, దేశభక్తి మరియు జాతీయ సమైక్యతకు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కళాశాల పరిసరాల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, జాతీయ జెండా గౌరవం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలో మార్పు తీసుకురావడంలో విద్యార్థుల పాత్ర కీలకమని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులు తమ ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో కూడా స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని సూచించారు.కార్యక్రమం ద్వారా స్వచ్ఛతతో పాటు దేశభక్తి, జాతీయ సమైక్యతకు సంబంధించిన సందేశాన్ని విద్యార్థులకు అందించారు. స్వచ్ఛమైన పరిసరాలు, పచ్చని వాతావరణం, దేశభక్తి భావనతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, NSS సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా నిర్వాహకులు కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు, అధ్యాపకులు మరియు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

**IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT: AT: L.B. NAGAR**

**O.S. No. 502 of 2026**

**Between:**

Mrs. V. Bharathi & others **...Plaintiff**

**AND**

The Tahsildar, L.B. Nagar Mandal & another **...Defendants**

To
All Concerned
**(Defendant No. 2)**

WHEREAS the above-named plaintiffs filed the above suit seeking declaration to declare the plaintiffs as the legal heirs of late Venugula Komraiah. The said suit stands posted to 07-09-2026 for all concerned. Therefore, you are hereby directed to appear before the above said Court on the above said date at 10-30 AM in person or by Pleader duly instructed by you, positively, failing which the matter will be heard and determined ex-parte.

*(By Order Of the Court)*

**Sd/-
K. SHASHIDAHR
Advocate
H.No. 1-10-122/26, 1st Floor Street No. 8, Ashok Nagar, Hyderabad-500020,
Email ID shashiattorney@yahoo.com.
Cell. No 9848051273,**

**IN THE COURT OF THE HONE'BLE SPECIAL JUDICIAL MAGISTRATE OF FIREST CLASS(EXCISE)-CUM-V ADDL. JUNIOR CIVIL JUDGE-V ADDL.MM, RANGA REDDY, AT.L.B. NAGAR**

**O.S.NO. 570 OF 2026**

**Between:**

**1. Sri Ananthula Venkata Krishna,** S/o Late A. Peda Anthaiah, Aged 64 years, Occupation: Professor in Government Medical College.
2. Sri. Ananthula Vikranth, S/o.Ananthula Venkata Krishna
Aged 34 years,Occupation: Business.
**3. Smt. Ananthula Vinisha, D/o.Ananthula Venkata Krishna,** Aged 33 years, Occupation: Software, R/o. # 868, Kelsey Ct, Crystal Lake, Illinois-60014, America.
4. Ananthula Vikhitha,
**D/o.Ananthula Venkata Krishna,** Aged 27 years, Occupation: seeking employment, R/o. # 15 RUE SAINT ROCH, PARIS, FRANCE-75001. Plaintiffs 1 to 4 are Permanent residing at H.No. 21-41, Vivekananda
Nagar, Dilsukhnagar, Ranga Reddy District- 500060.
**...Plaintiff**

**AND**

**1. All consent**
**...Defendants**

**ALL CONCERNED**

The above-named Petitioners have filed Declaration being legal heir of Late Ananthula Nagamani @ A.Nagamani, which is posted on 25-03-2025 for appearance. If any person or persons having any objection or claim may appear
through person or with pleader with relevant documents if any before the above court at 10:30 A.M. on 01-09-2026 or else the matter will be decided exparty.

*(By Order Of the Court)*

**Sd/-
M.ANILKUMAR
Advocate
H.No.2-237/1,Plot No. 111,
Opp.Samrat cold Storage,
Shiva Shankar Colony,Kuntloor,
Hayath Nagar,
R.R.Dist-501505.
Mob:- 9949467233.
Mail ID:-
maramanilkumar.law@gmail.com**



## సైబర్ నేరాలను అరికట్టటం ప్రతీ ఒక్కరి బాధ్యత

"ప్రతి ఒక్కరూ డిజిటల్ భద్రతా నియమాలు పాటించాలి. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండటం, వాటిని అరికట్టడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత. నేనైతే ముందు జాగ్రత్తగా వారానికి ఒకసారి మొబైల్ పాస్‌వర్డ్, నెలకు ఒకసారి వైఫై పాస్‌వర్డ్ మారుస్తాను. నా మొబైల్‌లో కనీసం ఫోటోలు కూడా స్టోర్ చేయను. అంతర్జాతీయ స్థాయిలో సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు ఇతర దేశాలకు వెళ్లి మరీ అరెస్టులు చేసిన ఘనత తెలంగాణ పోలీసులకే దక్కుతుంది. అలాగే తెలుగు సినీ రంగంలో పైరసీని అరికట్టడంలో ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, సజ్జనార్ ఎంతో కృషి చేశారు."

—అక్కినేని నాగార్జున, ప్రముఖ సినీ నటుడు

## వేమన పద్యం

నీళ్ళమీదనోడ తిన్నగాబ్రాకు
బైట మూరుడై బారలేదు
నెలవు దప్పుచోట నేర్పరి కొఱగాడు
విశ్వదాభిరామ! వినుర వేమ



## సంపాదకీయం

# దక్షిణాది అంటే అంత అలుసా...?

రాజ్యసభలో కేరళకు చెందిన సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్‌ను బిజెపి ఎంపి సుస్మితా దేవ్ 'లుంగీవాలా' అని సంబోధించడం తీవ్ర స్థాయిలో కలకలం రేపింది. తనను ఉద్దేశించి పదేపదే ఈ వ్యాఖ్యలు చేశారని, ఇది దక్షిణాది సంస్కృతిని అవమాన పర్చడమేనంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బ్రిట్టాస్ ఆ మేరకు సభా హక్కుల నోటీసు కూడా ఇచ్చారు. బ్రిట్టాస్ చర్య పూర్తిగా సముచితమే! కేరళంతో పాటు, తమిళనాడులో లుంగీ లేదా పంచెను ధరించే అలవాటు విస్తృతంగా ఉన్న సంగతి తెలిసిందే. ఒక విధంగా ఆ రెండు రాష్ట్రాల సంస్కృతికి ఈ వస్త్రధారణ ఒక ప్రత్యేక గుర్తింపుగా మారింది. ఆ స్థాయిలో కాకపోయినా, కర్ణాటకతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలోనూ లుంగీ లేదా పంచెను ధరించే వారు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు.

అందుకే, 'దక్షిణాది సంస్కృతిని అవమాన పర్చడం' అన్న బ్రిట్టాస్ విమర్శ కూడా సబబే! ఏమైనప్పటికీ సుస్మితా దేవ్ వ్యాఖ్యలు మరోసారి ప్రాంతీయ గుర్తింపు, సాంస్కృతిక గౌరవంపై ప్రశ్నలు లేవనెత్తింది. ఆర్టికల్ 29 భాషా, సాంస్కృతిక ప్రత్యేకతలను పరిరక్షించే రాజ్యాంగ దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు కూడా ప్రజల మధ్య అందువల్ల పార్లమెంటులో ఒక సభ్యుడి ప్రాంతీయ లేదా సాంస్కృతిక గుర్తింపును కించపరిచే వ్యాఖ్య ఏ పార్టీకి చెందిన సభ్యుడు చేసినా సమర్థించడానికి అవకాశం ఉండకూడదు. 2008లో అమెరికాతో సహా పలు అగ్ర దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నం అయినప్పుడు, సరళీకరణ విధానాల ఆర్థిక నమూనాలోని డొల్లతనమేమిటో స్పష్టంగా బయటపడింది. విద్యా, వైద్యం అత్యంత ఖరీదయ్యాయి. ఫలితంగా ప్రజలకు అవి శాపంగా మారాయి.ప్రపంచీకరణ, ఆధిపత్యం పెరిగాయి. అనైతిక పద్ధతుల్లో పలువురు నేరగాళ్లు, బడా కోటీశ్వరులు నేరుగా చట్టసభల్లోకి ప్రవేశిస్తున్నారు. రైతులు, విద్యార్థుల న్యాయబద్ధమైన పోరాటాలను ఖాతరు చేయక పోవటం, సామాన్య మహిళలకు రక్షణ కొరవడటం వంటి ముఖ్య సమస్యలు మన ప్రజాస్వామ్య వ్యవస్థను పరిహాసానికి గురి చేస్తున్నాయి. అట్టడుగునున్న కోట్లాదిమంది ప్రజలు కనీస జీవన భద్రత, కనీస జీవన ప్రమాణాలు లేకుండా బ్రతుకుతున్నారు. ఉపాధి కొరత తీవ్రరూపం దాల్చింది. లక్షలాది మంది పనిచేస్తున్న ఐ.టి రంగంలో కూడా పరిస్థితులు సవ్యంగా లేవు. అధిక ధరలు, అత్యధిక శాతం పన్నులు ప్రజల నిజ ఆదాయాలకు విలువ లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికీ సుమారు యాభై శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగం, పర్యావరణం నేటికీ నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నాయి. అయితే దీనికి పరిష్కారం లేదా అంటే ఉంది. మొదటగా జరగాల్సిన మార్పు – ఎన్నికల సంస్కరణలు. సమీకృత, సమగ్ర అభివృద్ధి సాధించే దిశగా ఆర్థిక విధానాలు రూపొందించి, కోట్లాది మందికి మేలు చేకూరేలా వాటిని అమలు చేయాలి. మూడవది : కనీస హక్కులైన విద్య, ఆరోగ్యం, ఉపాధి ప్రతి ఒక్కరికీ దక్కేలా నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామ్య సూత్రాలను పాటిస్తూ, రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను,వాటి స్ఫూర్తిని గౌరవించడమే నిజమైన దేశభక్తి. అదే జాతి యోధులకు, త్యాగధనులకు, దేశ స్వాతంత్ర్య సమరయోధులకు దేశ ప్రజల దీక్షాబద్ధమైన నివాళి.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# సమిష్టి త్యాగమే స్వాతంత్ర్యం

## అమరుల త్యాగాలు & అహింసాత్మక పోరాటాలు

ప్రతి ఏటా ఆగస్టు 15న దేశమంతటా త్రివర్ణ పతాకం సగర్వంగా ఎగురుతుంది, జాతీయ గీతం మార్మోగుతుంది. స్వాతంత్ర్య సమరయోధుల అసమాన త్యాగాలను భారతీయులంతా కృతజ్ఞతతో స్మరించుకుంటారు. అయితే, మన చరిత్ర పుస్తకాల్లో మనం చదువుకున్న కథనం నిజంగా సంపూర్ణమైనదేనా అన్న ప్రశ్న చరిత్ర ప్రేమికుల మదిలో తరచూ తలెత్తుతుంటుంది. చరిత్ర అంటే కేవలం క్యాలెండర్ పుటల్లో ముద్రించిన తేదీల వరుస కాదు, రాజవంశాల మార్పుల జాబితా అంతకంటే కాదు. అదొక గొప్ప జాతి సమిష్టి జ్ఞాపకం. ఆ జ్ఞాపకంలో ప్రతి భూభాగం, ప్రతి భాషా సమూహం, ప్రతి మతం తన వంతు రక్తాన్ని, కన్నీటిని, స్వేచ్ఛా దాహాన్ని ధారపోసింది. ఆ త్యాగాలన్నింటినీ సమగ్రంగా కలుపుకున్నప్పుడే భారత స్వాతంత్ర్య పోరాటానికి సంపూర్ణత్వం చేకూరుతుంది.

కాలగమనంలో చరిత్రలోని కొన్ని అధ్యాయాలు బంగారు అక్షరాలతో ప్రకాశిస్తే, మరికొన్ని పుటలు కాలం పొరల కింద మసకబారిపోయాయి. అలాంటి మరుగునపడిన, సరైన ప్రాధాన్యం లభించని అధ్యాయాల్లో భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు పోషించిన పాత్ర ఒకటి. జాతీయ జీవనస్రవంతి నుంచి వారి పాత్రను పూర్తిగా విస్మరించడం లేదా బాగా తగ్గించి చూపడం వంటి ప్రతికూల దృక్కోణాలు సమాజంలో కనిపిస్తుంటాయి. అయితే చరిత్రకు కావాల్సింది ఉపేక్ష కాదు; ప్రామాణిక ఆధారాలతో కూడిన నిష్పాక్షిక విశ్లేషణ. మన సమరం ఏ ఒక్క వర్గానికో పరిమితమైనది కాదు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, పార్సీలు కలిసి నడిచిన ఉమ్మడి పోరాటం అది. ముస్లిం నాయకులు ప్రధానంగా భారతీయులు, ఆ తర్వాతే ముస్లింలు. వారి రాజకీయ ఆకాంక్షలన్నింటికీ బ్రిటిష్ వలసపాలనకు ముగింపు పలకడమే పరమలక్ష్యంగా ఉండేది.

1857 మహాసంగ్రామం భారత ఆత్మగౌరవం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి బహిరంగంగా సవాలు విసిరిన చారిత్రక క్షణం. బ్రిటిష్ చరిత్రకారులు దీన్ని 'సిపాయిల తిరుగుబాటు'గా చులకన చేసినప్పటికీ, ఇది రైతులు, పాలకులతో సహా సాధారణ పౌరులంతా కలిసి చేసిన తొలి స్వాతంత్ర్య సంగ్రామం. మీరట్‌లో చెలరేగిన తిరుగుబాటు జ్వాలలు ఢిల్లీకి చేరుకున్నప్పుడు, హిందూ, ముస్లిం సైనికులు ఒకే ధ్యేయంతో భుజం భుజం కలిపి నడిచారు. వయోవృద్ధుడైన మొఘల్ చక్రవర్తి బహాదూర్ షా జఫర్‌ను 'షహెన్‌షాయే హింద్'గా ప్రకటించడం పోరాటానికి ఉమ్మడి ప్రతీకను కల్పించే వ్యూహాత్మక నిర్ణయం. సంగ్రామం విఫలమయ్యాక బ్రిటిష్



రాక్షసులు జఫర్ నలుగురు కుమారులనూ చంపేసి, ఆయనను రంగూన్‌కు బహిష్కరించారు. ఒక దేశ చక్రవర్తి పరాయి నేలపై దిక్కులేనివాడిగా మరణించడం చరిత్రలోని అత్యంత విషాదకర ఘట్టం.

ఈ పోరాటంలో అవధ్, రోహిల్ ఖండ్ ప్రాంతాల్లో బ్రిటిష్ పాలనా యంత్రాంగాన్ని పక్షవాతానికి గురిచేసిన మౌల్వీ అహ్మదుల్లా షా నడిపిన విప్లవాగ్ని వీరోచితమైనది. అలాగే అవధ్ పాలకురాలు బేగం హజ్రత్ మహల్ బ్రిటిష్ లొంగుబాటు ప్రతిపాదనలను తిరస్కరించి, లక్నో ప్రాంతంలో విప్లవానికి స్వయంగా నాయకత్వం వహించారు. వేలాది మంది ముస్లిం సైనికులు, రైతులు, ఉలమాలు, చేతివృత్తులవారు ఈ సంగ్రామంలో ప్రాణాలర్పించారు. విప్లవంలో పాల్గొన్నారనే నెపంతో ఢిల్లీ నుంచి అవధ్ వరకు వేలాది మందిని చెట్లకు ఉరితీశారు. ఈ ఐక్యతను చూసి భయపడిన వలసపాలకులు ఆ తర్వాతి దశాబ్దాల్లో 'విభజించి పాలించు' కుట్రపూరిత విధానాన్ని మరింత తీవ్రంగా అమలు చేశారు.

1857 అనంతర కాలంలో ముస్లిం సమాజంపై బ్రిటిష్ ప్రభుత్వం తీవ్రమైన కక్ష సాధింపు చర్యలకు దిగింది. ఆస్తుల జప్తు, పరిపాలనా ఉద్యోగాలకు దూరం చేయడం వంటి చర్యలతో తీవ్ర ఆర్థిక, సామాజిక సంక్షోభం ఏర్పడింది. ఈ సమయంలో సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ నవీన విద్య ద్వారా సమాజాన్ని చైతన్యపరచే అలీఘడ్ ఉద్యమానికి శ్రీకారం చుట్టగా, బ్రిటిష్ పాలనను సంపూర్ణంగా నిరాకరిస్తూ సాంప్రదాయక విద్యా వ్యవస్థ ద్వారా జాతీయ భావాలను రగిలించడానికి 'దేవ్‌బంద్' పాఠశాల ఆవిర్భవించింది. 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించిన తర్వాత, 1887 మద్రాస్ సమావేశానికి అధ్యక్షత వహించిన బద్రుద్దీన్ తయ్యబ్జీ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన మొదటి ముస్లిం నాయకుడిగా నిలిచారు. మాతృభూమి సంక్షేమం కోసం మతపరమైన భేదాలను పక్కనబెట్టి ఒకే వేదికపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

1919లో జలియన్‌వాలాబాగ్ నరమేధం, మొదటి ప్రపంచ యుద్ధం తదనంతర అంతర్జాతీయ పరిణామాలు ఖిలాఫత్, సహాయ నిరాకరణ ఉద్యమాలకు దారితీశాయి. మహాత్మా గాంధీ ఈ సందర్భాన్ని హిందూ – ముస్లిం ఐక్యతను పటిష్టం చేయడానికి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రజా ఉద్యమాన్ని నిర్మించడానికి అపూర్వ అవకాశంగా మలచుకున్నారు. అలీ సోదరులు (మౌలానా మహమ్మద్ అలీ, మౌలానా షౌకత్ అలీ), హస్రత్ మోహానీ, హకీమ్ అజ్మల్ ఖాన్, డాక్టర్ ముఖ్తార్ అహ్మద్ అన్సారీ వంటి నాయకులు ఈ ఉద్యమానికి ముందుండి నాయకత్వం వహించారు. కాంగ్రెస్ వేదికపై నుంచి 'పూర్ణ స్వరాజ్' కావాలని డిమాండ్ చేయడమే కాకుండా, 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదాన్ని ఇచ్చింది హస్రత్ మోహానీనే.ఇదే సమయంలో అసాధారణ మేధావి మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన 'అల్-హిలాల్', 'అల్-బలాఘ్' పత్రికల ద్వారా బ్రిటిష్ నిరంకుశత్వాన్ని నిర్భయంగా ప్రశ్నించారు. సాంస్కృతిక సమ్మేళనమే భారత జాతీయతకు పునాది అని ఆయన నమ్మారు. బ్రిటిష్ విద్యాసంస్థలను బహిష్కరించిన విద్యార్థులకు జాతీయవాద విద్యను అందించడానికి జామియా మిల్లియా ఇస్లామియా వంటి స్వదేశీ సంస్థల స్థాపనలో ఈ నాయకుల పాత్ర కీలకమైనది.

మరోవైపు విప్లవోద్యమంలో మతపరమైన హద్దులను చెరిపివేసి, నిస్వార్థ దేశభక్తికి నిలువెత్తు రూపంగా నిలిచారు అష్ఫాఖుల్లా ఖాన్. హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌లో రామ్‌ప్రసాద్ బిస్మిల్‌తో ఆయనకు ఏర్పడిన గాఢమైన స్నేహం భారత స్వాతంత్ర్య సమర చరిత్రలోనే ఒక అద్భుత ఘట్టం. 1925 కాకోరి రైలు ఘటన తర్వాత అరెస్టయిన అష్ఫాఖుల్లా ఖాన్‌ను సహచరులకు ద్రోహం చేస్తే విడుదల చేస్తామని బ్రిటిష్ అధికారులు ఆశ చూపినా ఆయన అసహ్యంతో తిరస్కరించారు. 1927 డిసెంబర్ 19న ఫైజాబాద్ జైలులో ఉరికంబాన్ని ముద్దాడే ముందు ఆయన ఖురాన్‌ను చేతబట్టుకొని చిరునవ్వుతో ఉరితాడును మెడకు వేసుకున్నారు.అదే సమయంలో సరిహద్దు ప్రాంతంలో ఖాన్ అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్ (సరిహద్దు గాంధీ) స్థాపించిన 'ఖుదాయీ ఖిద్మత్‌గార్' (దైవసేవకులు) అహింసాత్మక మార్గంలో వేలాది మంది పఠాన్లను దేశసేవ దిశగా నడిపింది. బ్రిటిష్ లాఠీ దెబ్బలను, తుపాకీ గుళ్లను వారు అసాధారణ ఓర్పుతో ఎదుర్కొని గాంధేయ మార్గానికి కొండంత బలాన్నిచ్చారు.1940 నుండి 1946 వరకు – అత్యంత కీలకమైన ఆరేళ్ల కాలం మౌలానా ఆజాద్ భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వహించారు. క్రిప్స్ రాయబారం, బ్రిటిష్ ప్రభుత్వంతో చర్చలు, క్విట్ ఇండియా వ్యూహాలలో ఆయన అపారమైన రాజనీతిజ్ఞతను ప్రదర్శించారు. 1928లో 'సైమన్ గో బ్యాక్' నినాదాన్ని, 1942లో గాంధీజీ ప్రతిపాదించిన చారిత్రాత్మక ఉద్యమానికి 'క్విట్ ఇండియా' అనే శక్తివంతమైన నినాదాన్ని అందించిన ఘనత బొంబాయికి చెందిన సోషలిస్ట్ నాయకుడు యూసఫ్ మెహర్ అలీదే. నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలోని ఐఎన్ఏలో 'జై హింద్' నినాదాన్ని సృష్టించిన మన హైదరాబాదీ ముద్దుబిడ్డ అబిద్ హసన్ సఫ్రాని పాత్ర కూడా విస్మరించలేనిది.

> కాలగమనంలో చరిత్రలోని కొన్ని అధ్యాయాలు బంగారు అక్షరాలతో ప్రకాశిస్తే, మరికొన్ని పుటలు కాలం పొరల కింద మసకబారిపోయాయి. అలాంటి మరుగునపడిన, సరైన ప్రాధాన్యం లభించని అధ్యాయాల్లో భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు పోషించిన పాత్ర ఒకటి. జాతీయ జీవనస్రవంతి నుంచి వారి పాత్రను పూర్తిగా విస్మరించడం లేదా బాగా తగ్గించి చూపడం వంటి ప్రతికూల దృక్కోణాలు సమాజంలో కనిపిస్తుంటాయి.

1947 నాటి దేశ విభజన తీవ్ర విషాదకరమైన పరిణామమే అయినప్పటికీ, ఆ సంక్లిష్ట రాజకీయ పరిణామాల సాకుతో దశాబ్దాల పాటు సమిష్టి భారతదేశం కోసం పోరాడి, జైలు శిక్షలు అనుభవించి, ప్రాణాలర్పించిన వేలాది మంది ముస్లిం దేశభక్తుల త్యాగాలను చరిత్ర పుటల మూలలకు నెట్టివేయడం ఎంతమాత్రమూ సమర్థనీయం కాదు. చరిత్రను మనకు కావలసిన కోణంలో మాత్రమే ఎంచుకుని చదివితే అపోహలు పెరుగుతాయి; ప్రామాణిక ఆధారాలతో సమగ్రంగా చదివినప్పుడే సామాజిక సామరస్యం పెంపొందుతుంది. త్రివర్ణ పతాకంలోని ప్రతీ దారం, ప్రతీ రంగు మనకు చాటిచెప్పే సత్యం ఒక్కటే – ఈ భారత దేశం అందరిదీ, ఈ స్వేచ్ఛ సమిష్టి త్యాగఫలం!



యం డి. ఉస్మాన్ ఖాన్

### ఆడకనే ఓడుతున్నాం

కయ్యానికి కాలుదువ్వితే..
అసహన చీకట్లు కమ్ముకొని..
కార్యసాధన కుంటుపడుతుంది..
పనిమంతుడు కాలుదువ్వితే..
ఓటమి తుర్రుమంటూ పారిపోతుంది!

ఆలోచనలతోనే అలసి పోతున్నాం
ఆచరణ భయంతో కుదేలౌతున్నాం
ఒళ్లొంగకపోవడమే సోమరితనం
అలసత్వానికి విశ్రాంతి అనే..
ముసుగులు తొడుగుతూన్నాం!

ఆడక ముందే ఓడిపోతూ..
పని చేయకనే ప్రతిఫలం ఆశిస్తూ..
ఆటంకాల్ని అధికంగా ఊహిస్తున్నాం
అడుగులు వేస్తేనే అడ్డంకులన్నీ తొలుగు..
చేతలతోనే చేతుల్లో గెలుపు ఒదిగిపోవు

పని రాకపోవడం తప్పు కానే కాదు..
పనికిమాలినోడే కదా భూమికి భారం
సద్బుద్ధి పుడితే దారి దొరుకుతుంది
వక్రబుద్ధి సాకులను వెతుకుతుంది
పోరు శరణ్యం అయితేనే విజయం!

మధుపాళీ
9949700037

# విదేశీ విరాళాల నియంత్రణలో సమతుల్యతే కీలకం

> బిల్లులోని ముఖ్యమైన సానుకూల అంశం విదేశీ నిధులతో ఏర్పడిన ఆస్తుల నిర్వహణకు స్పష్టమైన వ్యవస్థను తీసుకురావడం. సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ నమోదును కోల్పోయినప్పుడు ఆస్తులు, మిగిలిన విదేశీ నిధులను ఎలా సంరక్షించాలి, ఎవరు నిర్వహించాలి, తదుపరి వాటి పరిస్థితి ఏమిటన్న విషయంలో గత చట్టంలో స్పష్టమైన కార్యాచరణ విధానం పరిమితంగా ఉండేది. కొత్తగా ప్రతిపాదించిన 'డిజిగ్నేటెడ్ అథారిటీ' ద్వారా ఈ ప్రక్రియకు చట్టబద్ధమైన రూపం ఇవ్వాలన్నది బిల్లు ఉద్దేశం. నమోదు పునరుద్ధరించబడితే ఆస్తులు, వినియోగించని నిధులను తిరిగి ఇవ్వడానికి కూడా నిబంధన ఉంది.మరో ప్రయోజనం జవాబుదారీతనాన్ని పెంచడం. విదేశీ నిధులు అందుకున్న సంస్థలు వాటిని నిర్దేశిత ప్రయోజనాలకు మాత్రమే వినియోగించేలా పర్యవేక్షణ బలోపేతం కావడం ప్రజా విశ్వాసానికి అవసరం.

విదేశీ విరాళాలు ప్రజా సంక్షేమం, విద్య, వైద్యం, పరిశోధన, విపత్తు సహాయం వంటి రంగాలకు విలువైన వనరులు. అదే సమయంలో విదేశాల నుంచి వచ్చే నిధులు పారదర్శకంగా, నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగం కావడం జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరం. ఈ రెండు అవసరాల మధ్య సమతుల్యత సాధించడమే విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లు–2026 ముందుంచుతున్న ప్రధాన ప్రశ్న. మార్చి 25న లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ప్రస్తుతం సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు వెళ్లింది.

బిల్లులోని ముఖ్యమైన సానుకూల అంశం విదేశీ నిధులతో ఏర్పడిన ఆస్తుల నిర్వహణకు స్పష్టమైన వ్యవస్థను తీసుకురావడం. సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ నమోదును కోల్పోయినప్పుడు ఆస్తులు, మిగిలిన విదేశీ నిధులను ఎలా సంరక్షించాలి, ఎవరు నిర్వహించాలి, తదుపరి వాటి పరిస్థితి ఏమిటన్న విషయంలో గత చట్టంలో స్పష్టమైన కార్యాచరణ విధానం పరిమితంగా ఉండేది. కొత్తగా ప్రతిపాదించిన 'డిజిగ్నేటెడ్ అథారిటీ' ద్వారా ఈ ప్రక్రియకు చట్టబద్ధమైన రూపం ఇవ్వాలన్నది బిల్లు ఉద్దేశం. నమోదు పునరుద్ధరించబడితే ఆస్తులు, వినియోగించని నిధులను తిరిగి ఇవ్వడానికి కూడా నిబంధన ఉంది.

మరో ప్రయోజనం జవాబుదారీతనాన్ని పెంచడం. విదేశీ నిధులు అందుకున్న సంస్థలు వాటిని నిర్దేశిత ప్రయోజనాలకు మాత్రమే వినియోగించేలా పర్యవేక్షణ బలోపేతం కావడం ప్రజా విశ్వాసానికి అవసరం. 2019–2022 మధ్య 13,520 సంస్థలు రూ.55,741 కోట్ల విదేశీ విరాళాలు పొందినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో నిధుల ప్రవాహానికి సమర్థమైన పర్యవేక్షణ వ్యవస్థ ఉండటం సహజంగానే అవసరం.అయితే కొన్ని అంశాల్లో జాగ్రత్త అవసరం. ఎఫ్‌సీఆర్‌ఏ నమోదు గడువు ముగియడం లేదా పునరుద్ధరణ జరగకపోవడం కూడా ఆస్తుల తాత్కాలిక స్వాధీనానికి దారితీయవచ్చు. సంస్థ ఉద్దేశపూర్వకంగా నిబంధనలు ఉల్లంఘించిందా, లేక పరిపాలనా కారణాలతో నమోదు పునరుద్ధరణలో సమస్య ఏర్పడిందా అన్న తేడా స్పష్టంగా పరిగణనలోకి రావాలి. పాఠశాలలు, ఆసుపత్రులు, సేవా కేంద్రాలు వంటి ప్రజాప్రయోజన ఆస్తుల విషయంలో మరింత జాగ్రత్త అవసరం.

అలాగే విదేశీ నిధులతో నిర్మించిన ఆస్తుల్లో దేశీయ నిధుల భాగస్వామ్యం ఉంటే వాటి హక్కుల నిర్ణయం ఎలా జరుగుతుందన్న అంశానికీ స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం. శాశ్వతంగా ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లే ముందు సమర్థవంతమైన అప్పీల్, స్వతంత్ర సమీక్ష, నిర్ణీత కాలపరిమితి వంటి రక్షణలు ఉంటే అనవసర వివాదాలకు అవకాశం తగ్గుతుంది.2019–2022 మధ్య 13,520 సంస్థలు రూ.55,741 కోట్ల విదేశీ విరాళాలు పొందినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో నిధుల ప్రవాహానికి సమర్థమైన పర్యవేక్షణ వ్యవస్థ ఉండటం సహజంగానే అవసరం.అప్రభుత్వం వాదన ప్రకారం, విదేశీ విరాళాల దుర్వినియోగాన్ని అరికట్టడం, నిధుల వినియోగంలో పారదర్శకత పెంచడం, జాతీయ ప్రయోజనాలకు విరుద్ధమైన కార్యకలాపాలకు విదేశీ నిధులు చేరకుండా పర్యవేక్షణను బలోపేతం చేయడం బిల్లుకు ప్రధాన ఉద్దేశాలు. విదేశీ నిధులతో ఏర్పడిన ఆస్తుల నిర్వహణలో ప్రస్తుత వ్యవస్థలో ఉన్న స్పష్టతలేమిని తొలగించేందుకు డిజిగ్నేటెడ్ అథారిటీ అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, ప్రతిపక్షాల ప్రధాన ఆందోళన నమోదు పునరుద్ధరణ జరగకపోయినా ఆస్తులపై ప్రభావం పడే అవకాశం, అధికారాల పరిధి విస్తృతంగా ఉండటం, నిర్ణయానికి ముందు తగిన విచారణ–అప్పీల్ అవకాశాల అవసరంపై ఉంది. ఈ భిన్న అభిప్రాయాలను పరస్పర విరోధంగా కాకుండా, నియంత్రణతో పాటు న్యాయబద్ధమైన రక్షణలు కూడా ఉండాలనే సూచనగా పరిగణించడం సముచితం. తాజాగా బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపడం ఈ అంశాలను మరింత లోతుగా పరిశీలించేందుకు అవకాశం కల్పించింది.అలాగే విదేశీ నిధులతో నిర్మించిన ఆస్తుల్లో దేశీయ నిధుల భాగస్వామ్యం ఉంటే వాటి హక్కుల నిర్ణయం ఎలా జరుగుతుందన్న అంశానికీ స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం. అందువల్ల ఈ బిల్లును కేవలం నియంత్రణ చర్యగా కాకుండా పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా ప్రయోజనం, సంస్థల స్వాతంత్ర్యం మధ్య సమతుల్యతను నెలకొల్పే ప్రయత్నంగా చూడాలి. విదేశీ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడం ఎంత అవసరమో, నిజాయితీగా సేవ చేస్తున్న సంస్థలకు అనుకోని ఇబ్బందులు కలగకుండా చూడడం కూడా అంతే ముఖ్యం. సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలన ఈ రెండు లక్ష్యాల మధ్య మెరుగైన సమన్వయానికి ఉపయోగపడితే, సవరణలు మరింత స్పష్టమైనవి, న్యాయసమ్మతమైనవి, అమలులో విశ్వసనీయమైనవిగా రూపుదిద్దుకునే అవకాశం ఉంది.





హెచ్.ప్రతాప్
77998 00773



# జాతీయం-అంతర్జాతీయం



# జనగణన 2027లో మొత్తం 40 ప్రశ్నలు

- దేశంలో తొలిసారిగా కుల గణన
- ఆధార్, మొబైల్ నెంబర్లతో పాటు ఓటర్ ఐడిలు, బ్యాంక్ ఖాతాల వివరాల సేకరణ
- కోవిడ్-19 టీకా ఎక్కడ తీసుకున్నారనే అంశాలు సైతం
- ప్రశ్నావళిలో పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వివరాలు కూడా
- ఆర్‌జి&సిసిఐ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ఎ.ఎం.ఎస్) :**
జన గణన2027లో కులం, కోవిడ్ టీకా, గుర్తింపు పత్రాల వివరాలతో సహా మొత్తం 40 ప్రశ్నలు ఉండనున్నాయి. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వివరాలను మినహాయిస్తే, దేశంలో కులాల గణన చేపట్టడం ఇదే మొదటిసారి. జన గణణ పత్రంలోని 10వ ప్రశ్న షెడ్యూల్ కులం/షెడ్యూల్ తెగ అని ఉంటుంది. అంటే ఆ వ్యక్తి ఏ కులానికి చెందినవారో నమోదు చేయడానికి ఈ ప్రశ్నను అడగనున్నారు. పిఇ దశకు సంబంధించిన రిహార్సల్ లేదా "ప్రీటెస్ట్" జూలై 1 నుండి 20 వరకు 16 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో నిర్వహించబడింది. ఇందులో షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలకు చెందని వారు తమ కులాన్ని ఒక "ఓపెన్ కాలమ్" (ఖాళీ గడి)లో నమోదు చేశారు, లేదా ఎన్యూమరేటర్ (గణనకర్త) ఆ నివాసి స్వయంగా చెప్పిన కులాన్ని నమోదు చేశారు. తుది దశలోనూ ఇదే విధానాన్ని కొనసాగించే అవకాశం ఉంది.




2027 జన గణన సమయంలో అధికారులు అడగాల్సిన ప్రశ్నలను భారత రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ (ఆర్‌జి&సిసిఐ) మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రక్రియలో ఆధార్, మొబైల్ నెంబర్లతో పాటు ఓటర్ ఐడిలు, బ్యాంక్ ఖాతాలు, కోవిడ్19 టీకా ఎక్కడ తీసుకున్నారు అన్న వివరాలను కూడా సేకరించాలని అన్నారు. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో ఫిబ్రవరి 2027లో జనాభా గణన ప్రక్రియ జరగనుండగా, లడఖ్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఆగస్టు 17న దీనికి సంబంధించిన రెండో దశ ప్రారంభం కానుంది. ఈ దశకు కొన్ని రోజుల ముందే ఈ ప్రశ్నల వివరాలను ఆయన వెల్లడించారు. 1948 జనగణన చట్టం కింద హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. ప్రజల నుండి 40 రకాల సమాచారాన్ని సేకరిస్తారు. కుటుంబ వివరాలు, వ్యక్తిగత సమాచారం, కులం, మతం, విద్య, భాషలు, వైకల్యం, ఉపాధి, వలసలు, పిల్లల వివరాలతో పాటు బ్యాంకు ఖాతాలు, మొబైల్, ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వివరాలను కూడా ప్రశ్నావళిలో సేకరించనున్నారు.




ప్రశ్నావళి

1. వ్యక్తి పేరు
2. కుటుంబ పెద్దతో ఉన్న సంబంధం
3. లింగం
4. పుట్టిన తేదీ, వయస్సు
5. ప్రస్తుత వైవాహిక స్థితి
6. వివాహం జరిగినప్పుడు వయస్సు
7. జీవిత భాగస్వామి పేరు
8. ప్రకటించిన జాతీయత
9. మతం
10. ఎస్సీ/ఎస్టీ/కులం
11. తండ్రి వివరాలు
12. తల్లి వివరాలు
13. వైకల్యం ఉందా?
14. మాతృభాష, తెలిసిన ఇతర భాషలు
15. అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత స్థాయి
16. విద్యాసంస్థకు హాజరవుతున్నారా?
17. పొందిన అత్యున్నత విద్య, చదివిన విభాగం/విషయం
18. గత ఏడాదిలో ఎప్పుడైనా పనిచేశారా?
19. చేస్తున్న ఆర్థిక కార్యకలాపం
20. వృత్తి
21. పనిచేస్తున్న పరిశ్రమ, వ్యాపారం లేదా సేవా రంగం
22. ఉద్యోగి/కార్మికుడి వర్గం
23. ఆర్థిక కార్యకలాపాలు చేయకపోతే, చేస్తున్న ఇతర కార్యకలాపాలు
24. ఉద్యోగం కోసం చూస్తున్నారా లేదా ఉద్యోగం చేసేందుకు సిద్ధంగా ఉన్నారా?
25. పని ప్రదేశానికి ఎలా వెళ్తున్నారు?
26. పుట్టిన ప్రదేశం
27. చివరిగా నివసించిన ప్రదేశం
28. వలస రావడానికి కారణం
29. చివరిసారిగా వలస వచ్చినప్పటి నుంచి ఈ గ్రామం/పట్టణంలో నివసిస్తున్న కాలం
30. శాశ్వత నివాస చిరునామా
31. ప్రస్తుతం జీవించి ఉన్న పిల్లల సంఖ్య (ప్రస్తుతం వివాహిత, వితంతువు, విడాకులు తీసుకున్న లేదా విడిపోయిన మహిళలకు మాత్రమే)
32. ఇప్పటివరకు జన్మించిన సజీవ పిల్లల సంఖ్య (అదే వర్గానికి చెందిన మహిళలకు మాత్రమే)
33. గత ఏడాదిలో జన్మించిన సజీవ పిల్లల సంఖ్య (ప్రస్తుతం వివాహిత మహిళలకు మాత్రమే)
34. కోవిడ్19 టీకా ఎక్కడ వేయించుకున్నారు?
35. మొత్తం బ్యాంకు ఖాతాల సంఖ్య
36. మొబైల్ నంబర్ (అందుబాటులో ఉంటే)
37. ఆధార్ నంబర్ (అందుబాటులో ఉంటే)
38. ఓటర్ ఐడీ నంబర్ (అందుబాటులో ఉంటే)
39. పాస్‌పోర్ట్ నంబర్ (భారతీయ పాస్‌పోర్ట్ ఉంటే)
40. డ్రైవింగ్ లైసెన్స్ ఉందా?

# టెక్సాస్‌లో కూలిన హెలికాప్టర్

- ఇద్దరు సైనికుల మృతి

**హ్యూస్టన్, ఆగస్టు 14:**
అమెరికాలోని టెక్సాస్‌లో సైనిక హెలికాప్టర్ కూలిన ఘటనలో ఇద్దరు సైనికులు మృతి చెందారు. సలాడో గ్రామం సమీపంలోని ఓ పొలంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుల్లో హెలికాప్టర్ పైలట్, కోపైలట్ ఉన్నారు. ఫోర్ట్ హుడ్ సమీపంలోని అమెరికా సైనిక స్థావరం నుంచి బయలుదేరిన AH64 అపాచీ దాడి హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో హెలికాప్టర్ కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. హెలికాప్టర్ అదుపు తప్పడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. కూలిన వెంటనే హెలికాప్టర్‌లో మంటలు చెలరేగి సమీపంలోని పొలానికి వ్యాపించాయి. దీంతో దాదాపు 100 ఎకరాల ప్రాంతం అగ్నికి ఆహుతైంది. సాయంత్రం 5 గంటల సమయానికి మంటలను సుమారు 45 శాతం అదుపులోకి తీసుకువచ్చి



నట్లు అధికారులు తెలిపారు. హెలికాప్టర్‌లో ఉన్న ఇద్దరు సైనికులు ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు అమెరికా సైన్యం వెల్లడించింది. వారి వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. మృతదేహాలను కార్ల్ ఆర్. డార్నాల్ ఆర్మీ మెడికల్ సెంటర్‌కు తరలించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను గుర్తించేందుకు అమెరికా సైన్యం దర్యాప్తు ప్రారంభించింది.

# వియత్నాంలో అత్యాధునిక యుద్ధ నౌక నిర్మాణం



**హనోరు, ఆగస్టు 14 :**
దేశీయ పరిజ్ఞానంతో జలాంతర్గాములను ధ్వంసం చేసే అతి పెద్ద, అత్యాధునిక యుద్ధ నౌక నిర్మాణాన్ని వియత్నాం ప్రారంభించింది. దనాంగ్ నగరంలో రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన సాంగ్ థూ నౌకాశ్రయంలో దీనిని నిర్మిస్తున్నారు.

దేశంలో అభివృద్ధి చేసిన ఆయుధాలు, సైనిక సామగ్రి కూడా ఈ నౌకాశ్రయంలోనే ఉంటాయని సైన్యానికి చెందిన వార్తా పత్రిక తెలియజేసింది. చైనా తదితర దేశాలతో వియత్నాంకు జల వివాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయంగా రక్షణ తయారీ సామర్థ్యాలను పెంచుకోవాలని వియత్నాం భావిస్తోంది. అదే సమయంలో రష్యా నుంచి సైనిక హార్డ్‌వేర్ దిగుమతులను తగ్గించుకోవాలని కూడా అనుకుంటోంది.

# కరూర్ బాధిత కుటుంబాలకు సుప్రీంలో ఊరట



**న్యూఢిల్లీ, ఆగస్టు ౧౩ (ఎ.ఎం.ఎస్) :**
తమిళనాడులోని కరూర్ తొక్కిసలాట బాధిత కుటుంబాలకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ సీఎం విజయ్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ గత నెల మద్రాస్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ విజయ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులపై స్టే శుక్రవారం విధించింది. దీంతో బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించే నిర్ణయానికి తాత్కాలికంగా ఊరట లభించింది.



# కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు అస్వస్థత

**న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ఎ.ఎం.ఎస్) :**
కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా అస్వస్థతకు గురయ్యారు. దీంతో గురువారం సాయంత్రం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. వైద్యులు ఆయనకు కరోనరీ యాంజియోగ్రఫీ నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఎయిమ్స్ వెల్లడించింది.

ఎయిమ్స్ కార్డియాలజీ విభాగంలో నడ్డా చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారు. అస్వస్థతకు కారణాలపై వైద్యులు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి తెలిపింది.

# రాహుల్ గాంధీపై క్రిమినల్ కేసు కొట్టివేత



- సమన్లు కూడా రద్దు

**న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ఎ.ఎం.ఎస్) :**
సావర్కర్‌పై వ్యాఖ్యలకు సంబంధించి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై కొనసాగుతున్న క్రిమినల్ పరువునష్టం కేసును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కేసు కొనసాగించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా తీసుకోవాల్సిన అనుమతి పొందలేదని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. అవసరమైన ప్రభుత్వ అనుమతి లేకుండా కేసు కొనసాగించలేమని పేర్కొంటూ రాహుల్ గాంధీ పిటిషన్‌ను అనుమతించింది. దీంతో దిగువ కోర్టు జారీ చేసిన సమన్లను కూడా రద్దు చేసింది.

# టన్నెల్ లోకి భారీగా వచ్చిన వరదనీరు

**డెహ్రాడూన్, ఆగస్టు ౧౩ .**
ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో గురువారం సాయంత్రం విషాద ఘటన చోటుచేసుకుంది. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న టన్నెల్‌లోకి ఒక్కసారిగా భారీగా నీరు, శిథిలాలు దూసుకురావడంతో ఏడుగురు కార్మికులు మృతి చెందారు. మరో ఇద్దరు టన్నెల్‌లో చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. ఘటన సమయంలో ప్రాజెక్టు ప్రాంతంలో 22 మంది పనిచేస్తుండగా, 14 మంది గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స



అందిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు శిథిలాలను తొలగిస్తూ చిక్కుకున్న కార్మికుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. భారీ వర్షాల కారణంగా నదుల్లో నీటి ప్రవాహం పెరిగిన నేపథ్యంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

# ఢిల్లీ హైకోర్టు, ఎయిర్ పోర్టుకు బాంబు బెదిరింపు




**న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ఎ.ఎం.ఎస్) :**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు రోజు ఢిల్లీ హైకోర్టు, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు ఈమెయిళ్లు వచ్చాయి. దీంతో భద్రతా దళాలు అప్రమత్తమై, హైకోర్టు ఆవరణ, విమానాశ్రయ ప్రాంగణాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉన్నప్పటికీ, ఈ బెదిరింపుల నేపథ్యంలో సున్నితమైన ప్రభుత్వ భవనాలు, ఎయిర్‌పోర్ట్, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల వద్ద నిఘాను మరింత పెంచారు.

అన్ని ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో తనిఖీలను తీవ్రతరం చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.

# భారత్ కు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్



**టెహ్రాన్, ఆగస్టు 14 :**
ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సెప్టెంబరులో భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో ఆయన హాజరు కానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన భారత్.. 18వ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సు 'బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ' అనే అజెండాతో సాగనుంది. 2026 ఆరంభంలో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్ నుంచి భారత్ స్వీకరించింది.

# ఒక్కొక్కదిరీ ఒక్కో వ్యథ

- దుర్భర జీవనం
- సముద్రంలోనే తొమ్మిది నెలలుగా జీవనం
- నేలను చూసింది రెండు రోజులే
- ఒత్తిడిని తట్టుకోలేక పరారయ్యేందుకు ప్రయత్నం
- యూఎస్ఎస్ అబ్రహం లింకన్ నావికుల కన్నీటి కథ

**వాషింగ్టన్, ఆగస్టు 14 :**
యూఎస్ఎస్ అబ్రహం లింకన్ నౌకలో నావికులు, సిబ్బంది, వారి కుటుంబాలు నెలల తరబడి గడపాల్సి రావడంతో వారి జీవన పరిస్థితులు ఊిణించాయి. యుద్ధం ఎటూ తేలకపోవడంతో నౌక మోహరింపు కాలాన్ని అధికారులు పదే పదే పొడిగించడంతో వారంతా తీవ్ర మానసిక వేదకను గురయ్యారు. కొందరు ఆత్మహత్యకు ప్రయత్నించారు కూడా.



గత గురువారం శాన్ డియాగోలో భావోద్వేగ పూరితమైన టౌన్‌హాల్ సమావేశం జరిగింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌లో దుర్భరమైన పరిస్థితులను చవిచూస్తున్న నావికుల తరపున సుమారు 200 మంది కుటుంబ సభ్యులు సీనియర్ నౌకాదళ అధికారులను ఈ సమావేశంలో నిలదీశారని తెలుస్తోంది. 'రేపు నేను నిద్ర లేవకూడదని అనుకుంటున్నాను' అని తన భర్త సందేశం పంపాడని ఓ మహిళ తాత్కాలిక నౌకాదళ కార్యదర్శి హంగ్ కావోకు చెప్పారు. సైన్యంపై ఒకప్పుడు తమకు ఎంతో నమ్మకం ఉండేదని, ఇప్పుడు నౌకాదళ నాయకత్వం దానిని దెబ్బతీసిందని మరో మహిళ వాపోయారు. మోహరింపును పదే పదే పొడిగించడంతో తన భర్త సముద్రంలో దూకేందుకు ప్రయత్నించాడని అన్నాబెల్ లోమా 'మిలిటరీ టైమ్స్' పత్రికకు తెలిపారు. తన భర్త చాలా అలసిపోయాడని, కెరీర్ ఏమవుతుందో అని భయపడుతున్నాడని ఆమె చెప్పారు. 'అతను భయపడుతున్నాడు. అలసిపోయిన కారణంగా విధుల నుంచి అవమానకరంగా తొలగిస్తారేమోనని ఆందోళన చెందుతున్నాడు. తన 13 సంవత్సరాల కెరీర్ నాశనమవుతుందని అనుకుంటున్నాడు' అని అన్నారు. సముద్రంలో దూకకుండా తోటి నావికుడిని తన భర్త కాపాడారని ఓ మహిళ తెలిపారు. నౌకలో జరుగుతున్న ఆత్మహత్య ప్రయత్నాలు, సుదీర్ఘ మోహరింపు నావికులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ గత సంవత్సరం నవంబర్ 21న శాన్ డియాగో నుంచి బయలుదేరింది. వాస్తవానికి అది పసిఫిక్ మహా సముద్రానికి వెళ్లాల్సి ఉంది. కానీ ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడంతో దానిని మధ్యప్రాచ్యానికి మళ్లించారు. అప్పటి నుంచి అందులోని నావికులు, సిబ్బంది సముద్ర తీరంలో గడిపిన సమయం చాలా తక్కువ. నౌకలోని ఐదు వేల మంది నావికులు, సిబ్బంది కేవలం రెండు రోజులు మాత్రమే భూమిపై గడిపారు. డిసెంబర్‌లో గ్వామ్‌లో ఒక రోజు, గత నెలలో ఒమన్‌లో మరో రోజు మాత్రమే వారికి నేలపై కాలు పెట్టే అదృష్టం దక్కింది. వాస్తవానికి మే నెలలోనే నౌక మోహరింపు ముగియాల్సి ఉంది. అయితే యుద్ధం కొనసాగుతుండడంతో దానిని ఆ తర్వాత అనేక పర్యాయాలు పొడిగించారు. ఈ విమాన వాహక నౌక ఇప్పుడు ఇరాన్‌పై ఐదో నెల పోరాట కార్యకలాపాలలో నిమగ్నమై ఉంది.

ఐదు వేల మంది నావికులు, సిబ్బంది... సముద్రంలో తొమ్మిది నెలల మకాం... అందులో నేల అనేదే చూడకుండా వరుసగా 250 రోజుల జీవనం.... ఈ మాట వింటుంటే ఎవరికైనా గుండె గుభేలుమంటుంది కదా. మధ్యప్రాచ్యంలో అమెరికా మోహరించిన యూఎస్ఎస్ అబ్రహం లింకన్ నౌకలోని సిబ్బంది ఈ అసాధారణ సుదీర్ఘ మోహరింపుతో విసిగి వేసారిపోయి పారిపోయేందుకు ప్రయత్నించారు. మిలిటరీ టైమ్స్ పత్రిక అందించిన నివేదిక ప్రకారం వివరాలిలా ఉన్నాయి....నౌకాదళం తన ప్రాథమిక బాధ్యతలను సైతం విస్మరిస్తోందని లెవిన్ మండిపడ్డారు. 'ఈ పురుషులు, మహిళలు మన దేశానికి సేవ చేయడానికి సైన్యంలో చేరారు. వేడి నీరు, పనిచేసే టాయిలెట్, కడుపు నిండా భోజనం వంటి సౌకర్యాలు కల్పించడం మన కనీస బాధ్యత. హెగ్‌సేథ్ కనీసం వాటిని కూడా అందించలేక పోతున్నారు. కుటుంబసభ్యుల గోడు ఆయనకు అబద్ధాలుగా కన్పిస్తోంది' అని ధ్వజమెత్తారు.

నౌకలోని సిబ్బంది కేవలం మానసిక ఒత్తిడికే పరిమితమై లేరు.



నౌకలో మౌలిక జీవన పరిస్థితులు కూడా దుర్భరంగా ఉన్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కాలిఫోర్నియాకు చెందిన డెమొక్రటిక్ సభ్యుడు మైక్ లెవిన్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో సిబ్బంది అనుభవిస్తున్న దుర్భర పరిస్థితులను వివరించారు. బూజు పట్టిన షవర్లు, పాడైపోయిన టాయిలెట్లు, వారాల తరబడి పనిచేయని లాండ్రీలు, వేడి నీటి కొరత, అరకప్పు అన్నం...రెండు టోర్టిల్లాలతో ఏ మూలకూ చాలని భోజనం... నౌకలో నెలకొన్న దయనీయ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. సబ్బులు, డియోడరెంట్లు, టూత్‌పేస్టులకూ కొరతగానే ఉంది. రేషన్ పద్ధతిలో నాసిరకం భోజనాన్ని అందిస్తున్న ఫొటోలు ఏప్రిల్‌లోనే బయటికి వచ్చాయి. అయితే ఈ వార్తలలో ఏ మాత్రం నిజం లేదని అప్పుడు రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్ కొట్టిపారేశారు.

# కాస్ట్రో భావజాలానికి పెరుగుతున్న ప్రాధాన్యత

- శత జయంతి ఉత్సవాల వేళ వెల్లివిరుస్తున్న విప్లవ స్ఫూర్తి
- ప్రత్యేక కార్యక్రమాలు, ఉత్సవాలు, చర్చలు
- కాస్ట్రో విధానాలే మార్గదర్శకం

**హవానా, ఆగస్టు 14 :**
క్యూబా విప్లవ యోధుడు ఫైడల్ కాస్ట్రో జ్ఞాపకాలను క్యూబన్లు గుర్తు చేసుకుంటున్నారు. సామ్రాజ్యవాదం విసిరిన అనేక సవాళ్ళను రాజీపడని రీతిలో సోషలిస్టు ప్రతిఘటనతో ఎదుర్కొన్న ఆ వీరోచిత నేత శత జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రజలు ప్రముఖంగా ఆయనను స్మరించుకుంటున్నారు. ఈ సందర్భంగా హవానా కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమాలు, ఉత్సవాలు, అంతర్జాతీయ చర్చలు సాగుతున్నాయి. అమెరికా కొనసాగిస్తున్న ఆంక్షలను, ఇతర సంక్షోభాలను అధిగమించడానికి, దేశ సార్వభౌమాధికారాన్ని, సోషలిస్టు విజయాలను పరిరక్షించుకోవడానికి క్యూబన్లకు అధికంగా శక్తినిచ్చేది ఫైడల్ కాస్ట్రో విప్లవాత్మక ఆలోచనలు, ఆయన అనుసరించిన పంథా, సైద్ధాంతిక భావజాలమే. క్యూబా అత్యంత దారుణమైన, కఠినమైన దిగ్బంధనాన్ని ఎదుర్కొంటోందని, ప్రతిరోజూ ఆర్థిక వేధింపులేనని క్యూబా అధ్యక్షుడు డియాజ్ కానెల్ అన్నారు. ఇటీవల క్యూబాపై ఆర్థిక, వాణిజ్య ఆంక్షలను అమెరికా మరింత ఉధృతం చేసింది. క్యూబాకు చమురును ఎగుమతి చేసే దేశాలపై టారిఫ్‌లు విధిస్తామని జనవరిలో అమెరికా బెదిరించింది. దాంతో ఆంక్షల భయంతో క్యూబాకు చమురును సరఫరా చేయడానికి షిప్పింగ్ సంస్థలు వెనుకాడాయి.

నెలల తరబడి ఒక్క చుక్క కూడా ఇంధనం లేకపోవడంతో దేశంలో తీవ్రమైన ఇంధన సంక్షోభం నెలకొంది. గత 24 మాసాల్లో 12సార్లు జాతీయ స్థాయిలో ఇంధన సంక్షోభాలను క్యూబా ప్రజలు ఎదుర్కొన్నారు. ఆస్పత్రుల్లో విద్యుత్ లేకపోవడంతో ఆపరేషన్ థియేటర్లు మూతపడ్డాయి. ఆపరేషన్ల కోసం వేచి ఉన్నవారి సంఖ్య 1.20లక్షలు దాటిపోయింది. వీరిలో 11వేల మందికి పైగా చిన్నారులే కావడం అత్యంత దయనీయం. డిజిటల్‌ఇంటర్‌నెట్ ప్రాతిపదికన నడిచే విద్యా వేదికల పనితీరుకు తరచూ ఆటంకాలే. రవాణా వ్యవస్థ మొత్తంగా కూలబడింది. ఒకప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థకు మూల స్థంభాల్లో ఒకటిగా వున్న చక్కెర పరిశ్రమ కుప్పకూలింది. గత 67 సంవత్సరాలుగా అమెరికా సాగిస్తున్న ఆర్థిక యుద్ధానికి పరాకాష్టగా ఈ పరిస్థితులు నిలిచాయి. ఈనాడు క్యూబన్లలో 80శాతం మంది ఈ కఠినమైన ఆంక్షల పరిస్థితుల్లోనే పుట్టారు, జీవనం సాగిస్తున్నారు. అదేసమయంలో, అమెరికా బెదిరింపులను, ఆంక్షలను, సవాళ్ళను తట్టుకుని నిలిచిన క్యూబా... ప్రపంచ దేశాలకు ఒక ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సందర్భంలోనే ఫైడల్ కాస్ట్రో, ఆయన భావజాలం ప్రాధాన్యత సంతరించుకుంటుంది. అంతర్జాతీయ సదస్సులో కాస్ట్రో శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా హవానా కన్వెన్షన్ సెంటర్‌లో అంతర్జాతీయ సదస్సు జరుగుతోంది. నాలుగు రోజులకు పైగా సాగుతున్న ఈ సదస్సులో 1500మందికి పైగా ఎంపికచేసిన ప్రతినిధులు పాల్గొన్నారు.



వీరిలో 63 దేశాలకు చెందిన 900మంది విదేశీ ప్రతినిధులు ఉన్నారు. క్యూబా విప్లవ స్ఫూర్తికి అంతర్జాతీయ స్థాయిలో ఉన్న మిత్ర దేశాలు, చరిత్రకారులు, శాస్త్రవేత్తలు, సామాజిక నేతలు పాల్గొని తమ అభిప్రాయాలు పరస్పరం పంచుకున్నారు. క్యూబా అధ్యక్షుడు, క్యూబా కమ్యూనిస్టుపార్టీ ఫస్ట్ సెక్రెటరీ మిగ్వెల్ డియాజ్ కానెల్ ఈ సదస్సను ప్రారంభించారు. వివిధ అంశాలపై 11 సెషన్లలో చర్చలు కొనసాగుతున్నాయి. 'కాస్ట్రో వారసత్వం, ప్రపంచ రాజకీయాలపై ఆయన చారిత్రక ప్రభావం' అనే అంశంపై ప్రధానంగా చర్చ జరిగింది. అమెరికా సాగిస్తున్న కుట్రలను, మోపుతున్న ఆర్థిక ఆంక్షలను అత్యంత ధైర్యంగా ప్రతిఘటించడంలో క్యూబా సాధిస్తున్న విజయాలను ప్రతినిధులు ప్రశంసల్లో ముంచెత్తారు. స్పానిష్ భాషలో నినదించిన సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదాలు ఆ సదస్సు జరుగుతున్న ప్రాంగణంలో ప్రతిధ్వనించాయి. కాస్ట్రో చిత్రం ఉన్న దుస్తులు ధరించి వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్ అరుణ్ కుమార్, విజూ కృష్ణన్ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం భారత్ తరపున ఈ సదస్సులో పాల్గొంది.

కాస్ట్రో విధానాలే ఇప్పటికీ క్యూబాకు మర్గదర్శకాలని ఆ దేశ అధ్యక్షులు డియాజ్ కానెల్ అన్నారు. ఫైడెల్ కాస్ట్రో శత జయంతి సందర్భంగా అంతర్జాతీయ సదస్సు హవానాలో ప్రారంభమైంది.

వరంగల్ | ఖమ్మం | నల్లగొండ – ఉమ్మడి జిల్లాల వార్తలు

# చెక్‌పోస్ట్‌లో బీట్ అధికారుల గైర్హాజరు..

**అధికారుల ఆదేశాలు బేఖాతర్, వేటగాళ్లకు పరోక్షంగా అవకాశం..?**

**రాత్రి డ్యూటీకి హాజరైనట్లు ఫొటోలు.. ఆపై ఇళ్లకు పయనం..?**

**– రేంజ్ అధికారి తనిఖీలో వెలుగులోకి – హెచ్చరించినా మళ్లీ విధుల నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం – డీఎఫ్ఓకు నివేదిక పంపనున్నట్లు రేంజ్ అధికారి వెల్లడి**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం అటవీశాఖ రేంజ్ పరిధిలోని చెక్‌పోస్ట్ వద్ద రాత్రి విధులు నిర్వహించాల్సిన బీట్ అధికారులు విధి సమయంలో అందు బాటులో లేకపోవడం చర్చనీయాం శంగా మారింది. విధులు ప్రారంభించే సమయంలో చెక్‌పోస్ట్ వద్ద ఫొటోలు తీసుకుని, అనంతరం అక్కడి నుంచి వెళ్లి పోవడం విస్మయం.రామవరం రేంజ్ పరిధిలోని చెక్‌పోస్ట్ వద్ద బీట్ అధికా రులు బాలాజీ, ప్రసాద్ రాత్రి విధులు నిర్వహించాల్సి ఉండగా, రాత్రి సమయంలో రేంజ్ అధికారి శ్రీనివాస్ కు చెక్ పోస్ట్ వద్ద బీట్ అధికారులు ఎవరు లేరనే సమాచారంతో ఆయన బేస్ క్యాంప్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నట్లు సమాచారం. చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహించాల్సిన అధికా రులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించగా, వారు టీ తాగడానికి 11 గంటలకి కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మధువన్ హోటల్లో ఛాయ తాగడానికి బయటకు వెళ్లారని బేస్ క్యాంప్ సిబ్బంది సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది.వెం టనే రేంజ్ అధికారి సంబంధిత బీట్ అధికారులను విధులకు హాజరుకావా లని ఆదేశించడంతో పాటు, విధుల్లో చేరకపోతే పూర్తి వివరాలతో నివేదిక తయారు చేసి డీఎఫ్ఓ కార్యాలయానికి పంపుతామని హెచ్చరించినట్లు సమా చారం. ఈ హెచ్చరిక చేసిన సుమారు 30 నిమిషాల అనంతరం ఇద్దరు బీట్ అధికారులు చెక్‌పోస్ట్‌కు చేరుకున్నారని, కొంత సమయం మాత్రమే చెక్ పోస్ట్ వద్ద ఉండి మళ్లీ ఎవరూ రారు అని నిర్ధారిం చుకొని అనంతరం మళ్లీ వెళ్లిపోవడం అధికారుల ఆదేశాలకు ఎంత ప్రాధాన్య త ఇస్తున్నారన విషయం తెలుస్తుంది. అధికారుల ఆదేశాలను సైతం పట్టించు కోకుండా విధుల్లో నిర్లక్ష్యం తీవ్ర విమర్శ లకు దారితీస్తోంది. రాత్రి సమయంలో చెక్ పోస్ట్ వద్ద జరిగిన ఘటనపై రామవరం రేంజ్ డిఆర్ఓ మదన్ తో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపో వడం విస్మయం. రేంజ్ అధికారికి ఫోన్ చేయగానే స్పందించి ఘటనపై పూర్తి సమాచారాన్ని అందించారు.




**చెక్‌పోస్ట్‌ల వద్ద అప్రమత్తత కీలకం**

రాత్రి వేళల్లో అటవీశాఖ చెక్‌పోస్ట్‌లు కీలక బాధ్యతలు నిర్వహిస్తాయి. వాహ నాల తనిఖీలు, అక్రమంగా కలప తర లింపు, వన్యప్రాణుల వేట, ఇతర అక్రమ రవాణాలను అడ్డుకోవడంలో చెక్‌పోస్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో విధులు నిర్వహించాల్సిన సిబ్బంది చెక్‌పోస్ట్ వద్ద అందుబాటులో లేకపోతే అక్రమార్కులకు పరోక్షంగా అవకాశం లభించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వేటగాళ్లకు అవకాశం.. అటవీ సిబ్బందికే ప్రమాదం**

వేటగాళ్లకు అవకాశం.. అటవీ సిబ్బందికే ప్రమాదంవిధుల్లో సిబ్బంది అందుబాటులో లేకపోతే వేటగాళ్లు రాత్రి సమయాల్లో అడవుల్లోకి సులభంగా ప్రవేశించి వన్యప్రాణులను హతమార్చేందుకు విద్యుత్ తీగలు, ఉచ్చులు వంటి ప్రమాదకర పద్ధతులను ఉపయోగించే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇలాంటి అక్రమ వేటను అడ్డుకునే క్రమంలో నిజా యితీగా విధులు నిర్వహించే బీట్ అధి కారులు, అటవీశాఖ ఉన్నతాధికారులు ప్రమాదాలకు గురైన సంఘటన తాజాగా జిల్లాలో నెలకొన్న విషయం అందరికీ తెలిసిందే అని వారు గుర్తు చేస్తున్నారు. ఇలాంటి కొంతమంది అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే అటవీ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఎంతోమంది అధికారు లకు ముప్పుగా మారుతుందని ప్రజలు భావిస్తున్నారు.అడవుల్లో అక్రమ వేటగాళ్లు అమర్చే విద్యుత్ తీగలు, ఉచ్చులు అటవీశాఖ సిబ్బందికి సైతం ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని, అందువల్ల రాత్రి వేళల్లో చెక్‌పోస్ట్‌లు, బీట్ ప్రాంతాల్లో సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా పటిష్టమైన పర్యవేక్షణ అవసరమని స్థానికులు కోరుతున్నారు.

**గతంలోనూ ఇదే తరహా పత్రికా కథనం..**

రామవరం రేంజ్ పరిధిలో విధుల నిర్వ హణపై గతంలోనూ ఇలాంటి సంఘట నలు చోటు చేసుకున్నాయి . బీట్ అధికారి హతిరాం విధులకు హాజరు కాకుండానే బేస్ క్యాంప్ సిబ్బందిని చెక్పోస్ట్ దగ్గర పెట్టి తానే విధులు నిర్వ హించినట్లు చూపించి హాజరు వేసుకు న్నారన్న కథనం గతంలో వుదయం తెలుగు దినపత్రికలో ప్రచురితమైంది. తాజాగా మరోసారి రాత్రి విధుల విషయంలో బీట్ అధికారులు చెక్‌పోస్ట్ వద్ద అందుబాటులో లేకపోవడం, ఉన్న తాధికారులు తనిఖీ చేసిన సమయం లోనే విషయం వెలుగులోకి రావడం పలు ప్రశ్నలకు తావిస్తోంది.

**డీఎఫ్ఓకు నివేదిక.. చర్యలు తీసుకుంటాం.. రామవరం రేంజ్ అధికారి శ్రీనివాస్..**

రాత్రి సమయంలో తాను చెక్‌పోస్ట్‌ను సందర్శించినప్పుడు విధుల్లో ఉండాల్సిన సిబ్బంది అక్కడ కనిపించలేదని రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ వ్యవ హారంపై నివేదిక సిద్ధం చేసి డీఎఫ్ఓ కార్యాలయానికి పంపనున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. బీట్ అధికారులను విధుల్లో నిర్లక్ష్యం చేయవ ద్దని పలుమార్లు హెచ్చరించిన తమ ఆదే శాలను పట్టించుకోవట్లేదని వాపోతు న్నారు..

**ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి..**

విధి సమయాల్లో చెక్‌పోస్ట్‌ల వద్ద సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా అటవీశాఖ ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో సిబ్బంది హాజరును ఆకస్మికంగా తనిఖీ చేయడంతో పాటు, విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించిన బీట్ అధికారులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేస్తున్నారు.రామవరం రేంజ్ పరిధిలో ఇలాంటి ఘటనలు పున రావృతం కాకుండా జిల్లా అటవీశాఖ అధికారి ప్రత్యేకంగా దృష్టి సారించా లని, చెక్‌పోస్ట్‌ల భద్రతను బలోపేతం చేసి వన్యప్రాణుల రక్షణతో పాటు నిజా యితీగా విధులు నిర్వహించే అటవీశాఖ సిబ్బంది భద్రతకు కూడా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**సూర్యాపేట, ఆగస్టు 14 వుదయం ప్రతినిధి**

స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ లు సంయుక్తంగా పరిశీలించారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నూతన పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరుగుతున్న ఏర్పాట్ల ను అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జరిగే పోలీస్ కవాతు రిహార్సల్స్ ను అధి కారులు పరిశీలించారు. కవాతులో పాల్గొనే పోలీసు బలగాల సమన్వయం, క్రమశిక్షణను పరిశీలించి సూచనలు చేశారు. వేడుకలకు వచ్చే ప్రజలు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగ కుండా తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, వైద్య సౌకర్యాలు, పార్కింగ్ తదితర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రజలు, పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ భావాన్ని చాటాలని కలెక్టర్, ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## SIR ఫేజ్–1 రివ్యూ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి. 14/08/2026.**

SIR ఫేజ్–1 ప్రక్రియపై నిర్వహించిన జూమ్ (zoom)సమీక్ష సమావేశంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి శ్రీ మీనాక్షి నటరా జన్ గారు, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారు, ఏఐసీసీ కార్యదర్శి శ్రీ సచిన్ సావంత్ గారు పాల్గొని SIR ప్రక్రియపై పార్టీ నాయకు లకు, కార్యకర్తలకు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో అసెంబ్లీ కోఆర్డినేటర్, పార్లమెంట్ కోఆర్డినేటర్ లు కూడా పాల్గొన్నారు.

## సుశీలమ్మ ఫౌండేషన్ దాతృత్వం.. ప్రయాణికులకు ఇక తీరనున్న కష్టం



**చండూరు,ఆగస్టు14 (వుదయం):**

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నియోజక వర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొ న్నారు. చండూరు పట్టణంలోని నీళ్ల ట్యాంకు సెంటర్ వద్ద కోమటిరెడ్డి సుశీల మ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న ఆధునిక బస్ షెల్టర్ నిర్మాణ పనులకు ఆయన వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా భూమిపూజ నిర్వహించి, శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... చండూరు పట్టణంలో నిత్యం వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం నిరీక్షిస్తూ ఎండకు, వానకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకు న్నట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం సుశీలమ్మ ఫౌండేషన్ సొంత నిధులతో అన్ని వసతులతో కూడిన మోడల్ బస్ షెల్టర్‌ను అందుబాటు లోకి తీసుకువస్తున్నామని వెల్లడించారు.

## మధిర అభివృద్ధి పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలి... కలెక్టర్

**పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు ఆదేశం**

**మధిర పట్టణంలో చేపట్టిన యూజీడీ, వైరా చెరువు పై రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం వుదయం బ్యూరో మధిర, ఆగస్టు -14**

మధిర పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగ వంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబా టులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశిం చారు. శుక్రవారం మధిర పట్టణంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులు, వైరా చెరువుపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, నిర్మాణ పురోగతి, పనుల వేగం, ఉపయోగిస్తున్న నిర్మాణ సామగ్రి నాణ్యత తదితర అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంజూరు చేసిన పనులు లక్ష్యాలకు అనుగుణంగా కొనసాగాలని అధికారు లను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, మధిర పట్టణ అభి వృద్ధిలో భాగంగా యూజీడీ పనులు పూర్తయితే పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థి తులు మరింత మెరుగుపడటంతో పాటు, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా పనులను దశ లవారీగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టి



నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.యూజీడీ పనుల సందర్భంగా రహదారులు, ప్రజల రాక పోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, పనులు పూర్తయిన వెంటనే రోడ్ల పునరు ద్ధరణను చేపట్టాలని అధికారులను ఆదే శించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టి, ప్రజలకు ముందస్తు సమాచారం అందించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.అదేవి ధంగా మధిరలో వైరా చెరువుపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను పరి శీలించిన కలెక్టర్, నిర్మాణ పనుల పురో గతిని అధికారులను అడిగి తెలుసుకు న్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయితే చెరువు పరివాహక ప్రాంతంలో వరదలు, నీటి ప్రవాహం కారణంగా ఏర్పడే ముప్పును తగ్గించ డంతో పాటు ప్రజలు, ఆస్తులకు రక్షణ కల్పించేందుకు దోహదపడుతుందని తెలిపారు.రిటైనింగ్ వాల్ నిర్మాణంలో ఇంజినీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, నిర్మాణ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీప డరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మా ణానికి వినియోగించే సిమెంట్, ఇసుక, కంకర, ఇనుము తదితర సామగ్రి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించా లని, ప్రతి దశలో ఇంజినీరింగ్ అధికా రుల పర్యవేక్షణ ఉండాలని ఆదేశిం చారు.పనుల్లో ఎక్కడైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించి పనులకు ఆటంకం కలగకుండా చూడాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత సమ యంలోగా పూర్తి చేయాలని అధికారు లకు సూచించారు.మధిర పట్టణంలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వ యంతో పనిచేస్తూ, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదే శించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంతో పాటు, ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే ప్రధాన లక్ష్యంగా అధికా రులు పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట మధిర తహసీల్దారు రాంబాబు, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెన్నెల జ్యూయలరీ షాపును ప్రారంభించిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి



**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 14**

నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్ లో నూతనంగా ఏర్పాటు చేసిన వెన్నెల జ్యూయలరీ శారీస్ షాపును శుక్రవారం నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారుఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహి ళలకు జ్యుయలరీ వస్తువులతో పాటు పట్టు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్ ఒకే చోట ఏర్పాటు చేయడం అభినందనీయ మని అన్నారు. ఎలాంటి తరుగు, మేకిం గ్ చార్జెస్ లేకుండా వెండి బంగా రు ఆభ రణాలు అమ్మకాలు జరుపుతున్నారని, ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు కూడా ఏర్పాటు చేయడం అభి నందనీయమని, ప్రజలు ఇలాంటి అవ కాశాలను సద్వినియోగం చేసుకోవా లని తెలిపారు. ఈ సందర్భంగా విచ్చేసి న అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ, నల్ల గొండ మాజీజెడ్పిటిసి గుమ్ముల మోహ న్ రెడ్డి, ఏదుళ్ళ మధుసూదన్ రెడ్డి, కార్పొరేటర్లు రఫీ ఉద్దీన్ హాజీ, యమ కవితా దయాకర్, మాజీ కౌన్సిలర్లు ఖయ్యూం బేగ్, ఫసాహత్ అలీ బాబా, వెన్నెల సారీస్ అధినేత చొక్కారపు వెంకన్న,మాధవి, సాయి నిఖిల్, వెన్నెల, మిర్యాల దేవేందర్, వినోద్, భజరంగ్, నిర్మల, ప్రీతి, పద్మ గార్లు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలి– కలెక్టర్

**జనగామ, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి) :**

బ్యాంకింగ్ సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వ్యవసాయ, పంట రుణాల లక్ష్యా లను బ్యాంకులు తప్పనిసరిగా సాధించా లని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ (DCC) సమన్వయ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ.. రైతులకు సకాలంలో రుణాలు: పంట రుణాల పంపిణీలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, అర్హులైన ప్రతి రైతుకు కిసాన్ క్రెడిట్ కార్డ్ (KCC)



అందించి ఆర్థిక సహకారం అందించా లని స్పష్టం చేశారు. మహిళా సంఘా లకు ఆర్థిక ఊతం, స్వయం సహాయక సంఘాల (SHG) రుణ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమ యంలో బ్యాంకు లింకేజీ ద్వారా రుణా లు మంజూరు చేయాలన్నారు. సంక్షేమ పథకాల వేగవంతం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రత్యక్ష నగదు బదిలీ (DBT) సేవలు అర్హులకు వేగంగా అందేలా బ్యాంకులు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.నిరంతర పర్యవేక్షణ: బ్యాంకుల ప్రగతిని స్కోర్ కార్డు ఆధారంగా సమీక్షిస్తామని, లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకో వాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగా హన పెంచాలన్నారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ (LBM) ప్రతిభ, జిల్లా వ్యవసాయాధికారి (DAO) అంబికా సోనీ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (DRDO) భాస్కర్, ఏపీడీ నూరుద్దీన్, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ మాధవి లత, నాబార్డ్ ప్రతినిధులు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామీణ తపాల ఉద్యోగులను 8వ పే కమిషన్‌లో చేర్చాలి

**– తపాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు**

**హనుమకొండ, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి) :**

గ్రామీణ తపాల ఉద్యోగులకు న్యాయమైన వేతనాలు, ఉద్యోగ, సామాజిక భద్రత కల్పిస్తూ వారిని 8వ పే కమిషన్ పరిధిలోకి తీసుకురావాలని అఖిలభారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తమిళనాడులోని కృష్ణగి రిలో ఇటీవల జరిగిన జాతీయ మహాస భల్లో ఎన్నుకున్న నూతన కార్యవర్గాన్ని కేంద్ర ప్రభుత్వం, తపాల శాఖ జూలై 14న అధికారికంగా ఆమోదించినట్లు తెలిపారు. హనుమకొండ డివిజన్ గర్మి ళ్లపల్లి బిపిఎంగా పనిచేస్తున్న తను వరుసగా రెండోసారి జాతీయ అధ్యక్షు డిగా ఎన్నిక కావడం తెలంగాణకు గర్వ కారణమన్నారు. జనరల్ సెక్రటరీగా సి.కె. సుబ్రమణి (తమిళనాడు)తో




పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన నాయ కులతో నూతన కార్యవర్గం ఏర్పాటైందని వివరించారు.గ్రామీణ తపాల ఉద్యోగు లను 8వ పే కమిషన్‌లో చేర్చాలి.మెడి కల్ సౌకర్యం, గ్రూప్ ఇన్సూరెన్స్, రూ.10లక్షల గ్రాట్యుటీ కల్పించాలి.లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పదవీ విరమణ అనంతరం పెన్షన్ సదుపాయం అ ందించాలి. హ క్కుల పోరాటంలో అకారణంగా తొలగించబడిన మాజీ జనరల్ సెక్రటరీ ఎస్.ఎస్. మహాదేవయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి.కా ర్యవర్గాన్ని ఆమోదించిన కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్త పోరాటాన్ని బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావే శంలో సంఘం హన్మకొండ డివిజన్ అధ్యక్షుడు జె.బా పూజీ, కార్యదర్శి పి.తిరు పతి, కోశాధికారి ఆనందం, నాయకులు పి.శ్రీలత, జె.శ్రీ నివాస్, అజీజ్, బోగా స్వామి, అశోక్, రాజ్ కుమార్, యూసుఫ్ ఉద్దీన్, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో లోటుపాట్లకు తావివ్వొద్దు..

**అధికారులు అప్రమత్తంగా బాధ్యతలు నిర్వర్తించాలి**

**– జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి) :**

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా, అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమకు అప్పగించిన బాధ్యతలను సమ ర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. మేడారం వనదేవతల ప్రాంగణం, పరిసర ప్రాంతాలు, నూతన కలెక్టరేట్, పైలాన్, గట్టమ్మ ఆలయ ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మేడారంలో వనదేవతల దర్శనం, తులాబారం, పింఛన్ల పంపిణీ కార్యక్ర మాలతో పాటు నూతన కలెక్టరేట్



ఆదేశించారు. శుక్రవారం రోజున జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్ల పురోగతిపై కలెక్ట రేట్ సమావేశ మందిరంలో జిల్లా అధి కారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేప ట్టాలని, విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది డ్యూటీ పాసులు, గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రారంభోత్సవం, సభా ప్రాంగణంలో చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి అధికారికి అప్పగించిన బాధ్యతపై పూర్తి అవగాహన ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సమన్వయంతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్వో రవికు మార్, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం...

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**జగిత్యాల ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి)**

వృద్ధుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం ధర్మపురి లో మంత్రి క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ముద్రించిన వృద్ధుల రక్షణ చట్టం పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు అనంతరం మంత్రి మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రభుత్వ కమిటీ ప్రతినిధులు జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిరాధరణకు గురవుతున్న వృద్ధుల కేసుల పరిష్కారంలో చేస్తున్న కృషి ని అభినందించారు. అసోసియేషన్ కౌన్సిలింగ్ కేంద్రం విషయం లో ఆందోళన వద్దని అసోసియేషన్ విధుల కు వెంటనే తగు వసతి కల్పించాలని కలెక్టర్ కు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సీనియర్ న్యాయవాది హరి అశోక్కుమార్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిసి హన్మంత్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం విజయ్ కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు ఆర్గనైజింగ్ కార్యదర్శులు పూసాల అశోక్ రావు సంయుక్త కార్యదర్శి ఎండీ యాకూబ్ ధర్మపురి అధ్యక్షులు కండ్ల గంగాధర్ కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం మెట్ పల్లి అధ్యక్షులు వొజ్జెల బుచ్చిరెడ్డి జిల్లా డివిజన్ మండలాల సీనియర్ సిటిజన్స్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతి నెల సివిల్ రైట్స్ డే నిర్వహించాలి

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**కామారెడ్డి, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**

కామారెడ్డి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సకాలంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు, అట్రాసిటీస్ కేసుల నమోదు, దర్యాప్తు, బాధితులకు అందుతున్న పరిహారం తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి నెల సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించి, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం, ఇతర సహాయాలను ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, బాన్సువాడ డీఎస్పీ, ఎల్లారెడ్డి డీఎస్పీ, డీఎస్పీ డీసీఆర్బీ కామారెడ్డి, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి పి. వెంకటేష్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధికార, అనధికార సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రజా వాణిని సమర్థవంతంగా నిర్వహించి ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలి...

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశం...**

**మండల ప్రజావాణి నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి...**

**రైతులు అధిక నీటి అవసరమున్న వరి సాగును విస్తరించకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలి...**

**భూగర్భ జలమట్టాలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేయాలి...**

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**




**జగిత్యాల ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి)**

మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు శుక్రవారం హైదరాబాద్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సీజనల్ పరిస్థితులు వ్యవసాయం మండల ప్రజావాణి కార్యక్రమం నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం ఎల్‌నినో పరిస్థితులు క్రమంగా పెరిగే అవకాశం ఉన్నందున రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12 శాతం లోటు వర్షపాతం నమోదవుతోందని రానున్న రోజుల్లో ఈ లోటు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కోటి 16 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరిగిందని తెలిపారు గత ఏడాదితో పోలిస్తే వరి సాగు కేవలం 1.20 లక్షల ఎకరాలు మాత్రమే తగ్గిందన్నారు ప్రత్యామ్నాయ పంటలను 33 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని పేర్కొన్నారు ఇంకా 49 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగడం సరైన పరిస్థితి కాదని ఆగస్టు 7 తర్వాత కూడా మరో 10 లక్షల ఎకరాల్లో వరి సాగు విస్తరించిందని తెలిపారు. భూములను ఖాళీగా ఉంచకుండా రైతులను తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీటికి నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున తక్కువ నీటితో సాగు చేసే పంటలను రైతులు చేపట్టేలా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన నియంత్రణలు పంటల సాగుకు సంబంధించిన సూచనలు సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆగస్టు 31 వరకు మొక్కజొన్న సజ్జలు పొద్దుతిరుగుడు అలసంద ఉలవలు నువ్వులు స్వల్పకాలిక కూరగాయల పంటలను సాగు చేయవచ్చని తెలిపారు. సెప్టెంబర్ 15 వరకు మాగి జొన్న పెసలు మినుములు సెప్టెంబర్ 30 వరకు కంది వేరుశనగ ఆముదం పంటలను సాగు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. భూగర్భ జలమట్టాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో ఆగస్టు 17 నుంచి ప్రజావాణి మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఆగస్టు 17 నుంచి ప్రతి వారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలోనే మండల ప్రజావాణి నిర్వహించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల ప్రజావాణి నిర్వహణకు అవసరమైన సన్నాహక శిక్షణను డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఆగస్టు 16లోగా పూర్తి చేయాలని తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు లాగిన్ ఐడీలు యూజర్ గైడ్స్ అందజేయాలని సూచించారు. ప్రతి మండలానికి కనీసం ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రజావాణి నిర్వహణకు అవసరమైన సీటింగ్ కంప్యూటర్లు ప్రింటర్లు స్కానర్లు తదితర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని తెలిపారు. మండల ప్రజావాణి ప్రారంభంపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులందరూ ప్రజావాణికి హాజరయ్యేలా సమాచారం పంపాలని ఆదేశించారు ప్రజావాణి ద్వారా పరిష్కరించబడిన సమస్యలు విజయగాథలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సీజనల్ పరిస్థితులు పంటల సాగు మండల ప్రజావాణి నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మండల ప్రజావాణి విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని ప్రజలకు విస్తృతంగా సమాచారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బిరాజ గౌడ్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామం, వార్డులో తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలి: కలెక్టర్



**పెద్దపల్లి, ఆగస్టు-14 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరా, సమస్యలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, క్షేత్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి గ్రామం, ప్రతి వార్డులో తాగునీటికి సంబంధించిన సమస్యలను గుర్తించాలని సూచించారు. గ్రామాలు, వార్డుల వారీగా తాగునీటి సరఫరా పరిస్థితి, ఎదురవుతున్న సమస్యలు, అవసరమైన చర్యలకు సంబంధించిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి అందించాలని ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటి నాణ్యతలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలు, వార్డుల్లో తాగునీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను క్షేత్ర స్థాయిలోనే గుర్తించి, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.క్షేత్రస్థాయి పరిస్థితులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, తాగునీటికి సంబంధించిన సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ గంగాధర శ్రీనివాస్,మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ పూర్ణచందర్, ఏఈ లు,సంబంధిత అధికారులు తదితరులు ,పాల్గొన్నారు.

# జిల్లాలో ఎరువుల కొరత లేదు: కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల,ఆగస్ట్ 14 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని రకాల ఎరువులను జిల్లాలోనే నిల్వ ఉంచాలని అధికారులను ఆదేశించారు,జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, సహకార, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ అధికారులతో ఎరువుల సరఫరా, నిల్వలు, పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఎరువుల విక్రయ కేంద్రాలను వ్యవసాయ శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేసి, నిల్వలు, ధరలు, పంపిణీపై పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన కార్యక్రమం

**మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరు సహకారం అందించాలి**




**కరీంనగర్ ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**

కిమ్స్ కాలేజీలో పోలీస్ ఈగల్ టీం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ తరపున పాల్గొని నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి సహకారం అవసరమని కోరారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఈగల్ టీం డీఎస్పీ ఉపేందర్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, కిమ్స్ కాలేజ్ వైస్ చైర్మన్ సాకేత్ రామారావు, మిషన్ వాత్సల్య సిబ్బంది సాదినేని రమేష్, స్వప్న, త్రీ టౌన్ సీఐ తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 17 నుండి పాఠశాలల తనిఖీలు

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య**



**మంచిర్యాల జిల్లా**

ఈ నెల 17వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాఠశాలల తనిఖీ బృందాల సన్నాహక సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తనిఖీ బృంద సభ్యులు పాఠశాలలను సందర్శించి, అన్ని విద్యా సంబంధిత అంశాలను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు. బోధన–అభ్యసన ప్రక్రియ, విద్యార్థుల అభ్యసన ఫలితాలు, పాఠ్య ప్రణాళికలు, బోధనా పద్ధతులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. పాఠశాల సందర్శన సమయంలో గుర్తించిన లోపాలు, అంతరాలను అకడమిక్ గైడెన్స్ రిజిస్టర్‌లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. లోపాలు, అంతరాలను అధిగమించేందుకు అవసరమైన సూచనలు, సలహాలు అందించి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడాలని తెలిపారు. ప్రతి తనిఖీ బృంద సభ్యుడు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, పాఠశాలలకు సహాయక దృక్పథంతో అకడమిక్ మార్గదర్శకత్వం అందించాలని, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడమే తనిఖీల ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ ఎం. భరత్ కుమార్, జిల్లా జెండర్ & ఈక్విటీ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి , రూమ్ టు రీడ్ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ మధు, తనిఖీ బృంద సభ్యులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా రాష్ట్ర కేబినేట్ తీర్మానాలు: మంత్రి జూపల్లి కృష్ణారావు



**నిర్మల్ జిల్లా 14 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**

రేపు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. గతంలో రాష్ట్రంలో 2 కోట్ల 81 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులుంటే.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేసింది. కొత్తగా కుటుంబీకుల పేర్లను కూడా నమోదు చేసింది. 62 లక్షల మందికి కొత్తగా లబ్ధి చేకూర్చింది. రాష్ట్రంలో ఈరోజుకు మొత్తం 3 కోట్ల 42 లక్షల మంది రేషన్ లబ్ధిదారులున్నారు. వీరికి స్మార్ట్ కార్డుల జారీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. గత ఏడాది నిర్వహించినట్లే.. ఈ ఏడాది కూడా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో సదస్సు నిర్వహించాలని ప్రాథమికంగా తేదీలను నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకట స్వామి అధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్ను ఆవిష్కరించినట్లే.. ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్ తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించనుంది. ప్రధానంగా మన రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుంది. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్ లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.

వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, ఆ ఏడు రకాల సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని కేబినేట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని కేబినేట్ తీర్మానించింది. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందు లో 63.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యా న్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం సేకరిస్తుంది. మిగతా 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి.. ఈ వేలం (e-Auction) ద్వారా ధాన్యం అమ్మాలని కేబినేట్ నిర్ణయించింది.

రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూని వర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (YISU) పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు క్యాబినెట్ తీర్మానించింది. ఆదిలాబాద్, నిర్మల్,ముధోల్,బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది రాష్ట్రంలో తొలి విడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 యంగ్ ఇండియా రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూవీలైనంత తొందరగా స్థల సేకరణ చేసి, నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. నిర్మాణాలు పూర్తయిన చోట వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది.

# జీ.జీ.హెచ్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొని ఉండడం పట్ల అసంతృప్తి**

**తక్షణమే పారిశుధ్య సమస్యను చక్కదిద్దాలని ఆదేశం**



**నిజామాబాద్, ఆగస్టు 14 :**

నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రి (జీ.జీ.హెచ్)ను కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి చుట్టూ తిరుగుతూ పరిసరాలు, ఆవరణను ప్రతి అంగుళం పరిశీలించారు. అడుగడుగున నెలకొని ఉన్న అస్తవ్యస్థ పరిస్థితులను చూసి కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎనిమిది అంతస్తుల భవన సముదాయంతో కూడిన ఈ ఆసుపత్రిలో నిర్వహణ లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయని అన్నారు. అనేక చోట్ల డ్రైనేజీ పైప్ లైన్ల లీకేజీలు ఉండడం, ఆసుపత్రి ప్రాంగణంలో వ్యర్థ జలాలు నిలిచి ఉండడం, పరిసరాలు దుర్గంధం వెదజల్లుతూ ఉండడాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారుల పనితీరును ఆక్షేపించారు. ప్రత్యేకించి సానిటేషన్ విభాగం లోపాలను ఎత్తి చూపారు. పరిస్థితి ఇలా ఉంటే చికిత్స కోసం వచ్చే వారు, ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వారు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందని అన్నారు. ఆస్పత్రి లోపలి భాగంతో పాటు, బయట ప్రాంగణంలోనూ ఏ ఒక్క చోట కూడా నీరు నిల్వ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలోని ఆవరణలో ఉన్న ఓపెన్ డ్రైనేజీల మీద పైకప్పు నిర్మించాలని, మురుగు జలాలు నిలిచిపోకుండా వాటిని శుభ్రం చేయించాలన్నారు. పారిశుధ్య వ్యవస్థను చక్కదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర పరిశీలన జరపాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ కు సూచించారు. ఎక్కడ కూడా చెత్తాచెదారం పేరుకుపోకుండా రోజువారీగా వెంటదివెంట తొలగిస్తూ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని జీ.జీ.హెచ్ అధికారులను ఆదేశించారు. ఎక్కడబడితే అక్కడ వృధా నిర్మాణ సామాగ్రి పేరుకుపోయి ఉండడంతో తక్షణమే తొలగింపజేయాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణం రహదారి అంతా గుంతలమయంగా మారినందున, తక్షణమే మరమ్మతులు చేయించాలని అన్నారు. కుక్కలు, పశువులు ఆసుపత్రి ఆవరణలోకి రాకుండా కట్టడి చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య పనుల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అనునిత్యం పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, ఇతర అధికారులు ఉన్నారు.

# సమగ్ర శిక్షలో వివిధ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం.....జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద

**పెద్దపల్లి, ఆగస్టు-14 (వుదయం ప్రతినిధి)**

డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, తెలంగాణ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న నిర్దేశిత అర్హతలు, విద్యార్హతలు, ఇతర నిబంధనలు, షరతులు కలిగిన ఆసక్తి గల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి వివిధ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లావిద్యాశాఖాధికారి శ్రీమతి జి. శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.సమగ్ర శిక్ష, తెలంగాణ, హైదరాబాద్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలోని కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ల పోస్టులకు, అలాగే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, ఎక్స్–ఆఫీషియో జిల్లా ప్రాజెక్ట్ అధికారి, సమగ్ర శిక్ష కార్యాలయంలో ఫారిన్ సర్వీస్ నిబంధనలు, షరతుల ప్రకారం నిర్దేశిత కాలానికి డిప్యూటేషన్‌పై నియామకం కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమగ్ర శిక్ష, హైదరాబాద్ కార్యాలయంతో పాటు జిల్లా విద్యాశాఖాధికారుల కార్యాలయాలు, ఎక్స్–ఆఫీషియో జిల్లా ప్రాజెక్ట్ అధికారులు, సమగ్ర శిక్ష కార్యాలయాల్లో అసిస్టెంట్ కోఆర్డినేటర్ల పోస్టులకు ఓ.డి. ప్రాతిపదికన నియామకం కోసం కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.అదే విధంగా జిల్లా విద్యాశాఖాధికారుల కార్యాలయాల్లో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ల పోస్టులకు ఓ.డి. ప్రాతిపదికన నియామకం కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

అర్హత ప్రమాణాలు, విద్యార్హతలు, మార్గదర్శకాలు, నిబంధనలు, ఇతర పూర్తి వివరాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ www.schooledu.telangana.gov.in , http://www.schooledu.telangana.gov.in లో పరిశీలించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణ ప్రక్రియ ★08.08.2026★ నుంచి ప్రారంభమైందని, దరఖాస్తుల సమర్పణకు ★17.08.2026★ చివరి తేదీ అని జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద తెలిపారు. అర్హత కలిగిన ఆసక్తి గల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని ఆమె సూచించారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## సాగర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ రూరల్, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**
అనారోగ్యానికి గురైన సీనియర్ జర్నలిస్ట్ సాయిలు సాగర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గురువారం పరామర్శించారు.జిల్లా కేంద్రానికి చెందినసీనియర్ జర్నలిస్ట్‌సాయిలు సాగర్ తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జక్క రాజ్ కుమార్ రెడ్డి, పొదుగు శ్రీనివాసులు, కొత్త శ్రీనివాసులు, హరీష్ గౌడ్, తిరుమల్ యాదవ్, కొత్త ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి సమస్యలు పరిష్కారం కాకే మండల స్థాయికి విస్తరణా?

- **జిల్లా ప్రజావాణిలోనే పరిష్కారం కాని సమస్యలకు మండల ప్రజావాణితో ఎంతమేర న్యాయం?**

**గద్వాల ఆగస్టు 14 (వుదయం బ్యూరో)**



ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఇప్పటికే జిల్లా, డివిజన్ స్థాయిలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ, అనేక సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లోనే ఉంటున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా మండల స్థాయిలో కూడా ప్రజావాణి నిర్వహించేందుకు చర్యలు చేపట్టడంపై ప్రజల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలనే ఆశతో జిల్లా కేంద్రానికి వచ్చి అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. అయితే వినతులు స్వీకరించిన అనంతరం వాటి పరిష్కారంలో జాప్యం జరుగుతోందని, కొన్నిసార్లు సంబంధిత శాఖల మధ్య ఫైళ్లు తిరుగుతూ సమస్యలు అలాగే మిగిలిపోతున్నాయని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముందుగా జిల్లా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన అవసరం లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సమస్యను పరిష్కరించకుండా కేవలం ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత శాఖకు పంపడం మాత్రమే జరిగితే, ప్రజావాణి కార్యక్రమం ఉద్దేశ్యం ఏమిటని నిలదీస్తున్నారు. ఇప్పటికే జిల్లా, డివిజన్ స్థాయిలో ప్రజావాణి కొనసాగుతున్న తరుణంలో తాజాగా మండల స్థాయిలో కూడా ప్రజావాణిని ప్రారంభించడం వల్ల ఫిర్యాదుల సంఖ్య మాత్రమే పెరుగుతుందా? లేక సమస్యల పరిష్కారం కూడా వేగవంతమవుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించడం వల్ల ప్రజలకు ప్రయాణ భారం, సమయం, ఖర్చు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, ఫిర్యాదుల స్వీకరణతో పాటు వాటి పరిష్కారానికి స్పష్టమైన గడువు, బాధ్యత వహించే అధికారి, నిరంతర పర్యవేక్షణ ఉంటేనే ఈ వ్యవస్థకు సార్థకత చేకూరుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం అందించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని కోరుతున్నారు."ప్రజావాణి ఎక్కడ నిర్వహించారన్నది కాదు.. ప్రజల సమస్యలు ఎప్పుడు పరిష్కరించారన్నదే ముఖ్యం" అని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు.

## వందేమాతరం 150 వసంతాల వేడుకలు



**సంగారెడ్డి, ఆగస్టు 14,(వు దయం):**
భారత స్వాతంత్ర్య సమరంలో దేశభక్తిని రగిలించిన జాతీయ గేయం 'వందేమాతరం' 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని సెయింట్ ఆంటోనీ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.
కళాశాల డైరెక్టర్ ఇ. విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపకులు కలిసి జాతీయ గీతం 'జనగణమన', జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించారు. దీంతో కళాశాల ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మారుమోగింది.
ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. భారత సంస్కృతి, సమైక్యతకు జాతీయ గీతం, జాతీయ గేయాలు ప్రతీకలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో 'వందేమాతరం' కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. నేటి యువత, ముఖ్యంగా విద్యార్థినులు దేశ రక్షణ, ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
కళాశాల ప్రిన్సిపల్ జవహర్ మాట్లాడుతూ.. జాతీయ గీతం, జాతీయ గేయాల ప్రాధాన్యత, అంతరార్థాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన పౌరులుగా ఎదగడమే విద్యకు సార్థకత అన్నారు.
అకాడమిక్ కౌన్సిలర్ డాక్టర్ కృష్ణకుమారి మాట్లాడుతూ.. 'వందేమాతరం' కేవలం గేయం కాదని, భారతమాతకు అర్పించిన అక్షర నీరాజనమని అన్నారు. ఆనాటి త్యాగాలను స్మరించుకుంటూ మహిళా విద్యార్థినులు విద్యా, సామాజిక రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## వారం రోజుల్లో చల్మెడ రోడ్డు పనులు ప్రారంభించాలి

- **లేదంటే మహాధర్నా, పాదయాత్ర చేపడతాం:**
- **మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి**

**మెదక్ జిల్లా వుదయం**



నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ కమాన్ నుంచి నందగోకుల్ గ్రామం వరకు డాంబర్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నస్కల్, నందగోకుల్, చల్మెడ గ్రామాల మీదుగా కమాన్ వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.13 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయని, అనంతరం తాము ఎన్నికల్లో ఓడిపోవడంతో పనులు ముందుకు సాగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ గెలిచి ఏడాది పూర్తవుతున్నా రోడ్డు పనులపై దృష్టి సారించకపోవడంతో నస్కల్ గ్రామస్తులు నిరాహార దీక్ష చేపట్టారని తెలిపారు. దీంతో నాలుగు కిలోమీటర్ల మేర మాత్రమే పనులు చేపట్టి మిగతా పనులను అర్ధంతరంగా వదిలేశారని పేర్కొన్నారు.మిగిలిన రోడ్డు పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని, స్థానిక నాయకులు కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తున్నారని పద్మా దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.
వారం రోజుల్లోగా డాంబర్ రోడ్డు పనులు ప్రారంభించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నాతో పాటు నందగోకుల్ నుంచి చల్మెడ కమాన్ వరకు పాదయాత్ర చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కల్వకుంట సర్పంచ్ అందె కొండారెడ్డి, సొసైటీ చైర్మన్ బాపురెడ్డి, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బజార్ రంజిత్‌గౌడ్, మాజీ సర్పంచ్ గోపరి నర్సింలు, మాజీ ఎంపీపీ బిజ్జా సంపత్, మాజీ కోఆప్షన్ సభ్యులు గౌస్, అబ్దుల్ అజీజ్, భాస్కరరావు, వెల్దుర్తి శ్రీకాంత్‌గౌడ్, నాయిని లక్ష్మణ్, శివ, రాగుల బాబు, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వ్యాసరచన పోటీలు



**నారాయణపేట ఆగస్టు14 (వుదయం ప్రతినిధి)**
ఉపన్యాసం క్విజ్ వ్యాసరచన పాటల పోటీలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో విద్యార్థులకు ఉపన్యాసము వ్యాసరచన పాటలు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు.
ఉపన్యాస పోటీలలో జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి సందీప్ ఆరో తరగతి ,ద్వితీయ బహుమతి కృష్ణ ఏడో తరగతి ,కన్సోలేషన్ రాఘవేందర్ ఏడో తరగతి ,సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి నందిని పదవ తరగతి, ద్వితీయ బహుమతి నవ పల్లవి 9వ తరగతి, కన్సోలేషన్ బహుమతి రతీష్ 8వ తరగతి, పాటలు పోటీలో జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతిఅశ్విని ఏడో తరగతి, ద్వితీయ బహుమతి కృష్ణ ఏడో తరగతి, సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి జాకీర్ హుస్సేన్ 8వ తరగతి ,ద్వితీయ బహుమతి అర్చన 9వ తరగతి, వ్యాసరచన పోటీలు సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి నందిని పదవ తరగతి, ద్వితీయ బహుమతి సతీష్ 8వ తరగతి ,క్విజ్ పోటీలలో సీనియర్ భాగంలో ప్రథమ బహుమతి కస్తూరి అండ్ టీం, ద్వితీయ బహుమతి సింధుజ అండ్ టీం ఈ పోటీలలో పాల్గొని విజేతలుగా ఎన్నికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రతాప్ ,విజయ ,మధుసూదన్ ,భాను ప్రకాష్, మంగళ, శిరీష, నిర్మల ,శశిరేఖ ,శ్రీదేవి ,లక్ష్మణ్ ,నరసింహ ,రఘురాం రెడ్డి పాల్గొన్నారు.

## పేటలో బీజేపీ భారీ ర్యాలీ యాత్ర



- **పాల్గొన్న రాష్ట్ర నేతలు**

**నారాయణపేట ఆగస్టు14 (వుదయం ప్రతినిధి)**
ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు నారాయణ పేట జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ జిల్లా ప్రధాన కార్య దర్శి లక్ష్మీ శ్యామ్ సుందర్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీలక తీతంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు భారీ తీరంగా ర్యాలీ నిర్వహిం చారు.ర్యాలీ స్థానిక బసవేశ్వర మందిరం నుంచి చౌక్ బజార్,సెంటర్ చౌక్, విరసావర్కర్ చౌరస్తా గుండా సత్యనారాయణ స్వామి చౌరస్తా వరకు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరా జు, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురా వు నామాజి,రాష్ట్ర కార్యవ ర్గ సభ్యుడు రతంగ్ పాండు రెడ్డి,సంగారెడ్డి ఇంఛార్జ్ పగడకుల శ్రీనివాసులు సీనియర్ నాయకులు కొండయ్య మాట్లాడుతూ ధర్మ రక్షణ దేశ పటిష్టత కోసం ప్రతి ఒక్కరు జాతీయ జెండా ఆవిష్కరించి ఐక్యత ప్రదర్శించి ప్రధాని నరేంద్ర మోదీ,కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షు దురఘురామయ్యా గౌడ్,మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్, వైస్ చైర్మన్ మంజుల జి ఆర్ రెడ్డి,కౌన్సిలర్ల,జిల్లా మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కళాశాలలో అవయవదానంపై అవగాహన సదస్సు



**మహబూబ్ నగర్ ఆగస్టు14 (వుదయం ప్రతినిధి)**
మహబూబ్‌నగర్‌లోని స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ ,పీజీ కళాశాల (అటానమస్)లో అఖిల భారత అవయవదాతల సంఘం సమన్వయంతో, జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సును విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా పాల్గొన్న అఖిల భారత అవయవదాతల సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ వి. నటరాజ్ మాట్లాడుతూ మరణం తర్వాత శరీరం మట్టిలో కలిసిపోతుంది కానీ అవయవాలను దానం చేస్తే అవి మరొకరి శరీరంలో జీవిస్తాయి అని గుర్తు చేశారు. ఒక కుటుంబం తీసుకునే ధైర్యమైన నిర్ణయం మరో కుటుంబానికి కొత్త ఆశను, సరికొత్త జీవితాన్ని అందిస్తుంది అన్నారు. అందుకే ఇది సాధారణ దానం కాదు, జీవితాన్ని అందించే మహాదానం అని అన్నారు.తమ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ,ఎస్.వి.ఎస్. మెడికల్ కాలేజీకి 273 కళ్లను, 18 డెడ్ బాడీలను దానం చేయడం జరిగిందని ఆయన తెలిపారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ మన జీవితం ఒకరోజు ముగుస్తుంది కానీ మన మానవత్వానికి ముగింపు ఉండకూడదు అన్నారు. మన హృదయం ఆగిపోయినా, మన మంచి నిర్ణయం మరొకరి జీవితంలో కొనసాగవచ్చు,మన కళ్ళు ఈ ప్రపంచాన్ని చూడకపోయినా, మరొకరు ఈ అందమైన ప్రపంచాన్ని చూడగలరు అందుకే అవయవదానం చేయండి జీవితాన్ని పంచండి ఆశను పంచండి అని అన్నారు.కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ సమాజంలో అవయవదానంపై ఎన్నో అపోహలు ఉన్నాయి. విద్యావంతులుగా, సైన్స్ విద్యార్థులుగా ఆ అపోహలను తొలగించాల్సిన బాధ్యత మనపై ఉంది అన్నారు.బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ముందుకు వచ్చి అవయవదానం చేస్తే ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండుతాయి అన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా మనం తెలుసుకున్న విషయాలను మన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, సమాజానికి చేరవేద్దాం అన్నారు. అవయవదానంపై అవగాహన పెంచుదాం, మానవత్వాన్ని చాటుకుందాం అని అన్నారు.
ఈ కార్యక్రమంలో సంఘం కన్వీనర్ వేణుగోపాల్, బాబులేరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ అనురాధ, డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, రఘువీర్ గుప్త, అదిబాతాజ్, నసీంభాను, వెంకటరమణ మూర్తి, డాక్టర్ సీ.హెచ్. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుడననా ఆ వివక్ష?



- **హెచ్చరించిన డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి**
- **మోడీ సర్కార్‌ను గద్దె దించక తప్పదు: కాంగ్రెస్ నిప్పులు**

**సిద్దిపేట, ఆగస్టు 14 (వుదయం బ్యూరో)**
దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకుల నియంతృత్వ వైఖరి, దళిత వ్యతిరేక పోకడలు పరాకాష్ఠకు చేరాయని, ఈ అహంకార పూరిత విధానాలకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడటం ఖాయమని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏఐసీసీ అధ్యక్షుడు, సీనియర్ దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గే పట్ల ఉత్తరాఖండ్ పర్యటనలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూకలు ప్రవర్తించిన తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ ఒక దళిత నాయకుడు, జాతీయ పార్టీ అధ్యక్షుడు అయిన ఖర్గే ని దళితుడనే నెపంతో అవమానించడం బీజేపీ అహంకారానికి నిదర్శనం. ఈ దారుణాన్ని పార్లమెంట్‌లో నిలదీస్తే... 'ఆ ఘటనకు మాకూ సంబంధం లేదు, వారు మా వారు కారు' అని బీజేపీ నాయకులు తప్పించుకోవడమేంటో అర్థం కావడం లేదు.

**రాముడి పేరుతో ఓట్లు... వెనుక కోట్లు!**
శ్రీరాముడి పవిత్ర నామాన్ని రాజకీయం చేస్తూ బీజేపీ నేతలు ఒకవైపు ఓట్లు, మరోవైపు కోట్లు దోచుకుంటున్నారని ఆంక్ష రెడ్డి ఘాటుగా విమర్శించారు. దళితులు, పేదల హక్కులను కాలరాస్తూ భజన రాజకీయం చేస్తున్న మోడీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని ఆమె హెచ్చరించారు. ఖర్గే ని అవమానించడం అంటే దేశంలోని ప్రతి దళితుడిని, ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని తేల్చి చెప్పారు.కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు.. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసన తెలపడంతో సిద్దిపేట వీధులు హోరెత్తాయి. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్పల్లి చంద్రం, జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఆగం రెడ్డి, ప్రధాన కార్యదర్శులు ప్రణీత్ రెడ్డి, ఇమ్మడి శివలక్ష్మి, దాసరి కళావతి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, సంయుక్త, వివిధ మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు మరియు భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వుదయం దినపత్రికలో ప్రచురించిన కథనానికి స్పందన


వుదయం
General 12 Aug 2026 Page 3
https://epaper.voodayam.com/clip/139481

### బొమ్మనపల్లి పంచాయతీ కార్యదర్శి ఇష్ట రాజ్యం

**అచ్చంపేట,ఆగస్టు11: (వుదయం ప్రతినిధి)**
ఎవరైన ఒకేసారి మరణిస్తారు. వారికి ప్రభుత్వం ఒకే ఒకే సారి మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. కానీ నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి దానికి విరుద్ధంగా వ్యవహరించారు. ఒకే వ్యక్తి వేర్వేరు తేదీల్లో మరణించినట్లు చూపించి.. వారికి వేర్వేరు సర్టిఫికెట్లు జారీ చేశారు. అలా గ్రామంలోని చాలా మందికి తప్పుడు డెత్ సర్టిఫికెట్లు జారీ చేశారు. అలాగే ఎవరైన పుట్టి ఏడాది దాటితే తప్పనిసరిగా ఆర్డీవో ప్రొసిడింగ్ ఆధారంగా సర్టిఫికెట్లు ఇవ్వాలి. కానీ ఇక్కడ మాత్రం అవేమీ పాటించకుండా దానే ఇష్టారీతిగా వ్యవహరించారు బర్త్ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఒక్కో సర్టిఫికెటుకు భారీగా చేతులు మారినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేస్తే ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయి.
ఉదాహరణ:
జల్లెల గోపయ్య 10 డిసెంబర్ 2023న మరణించినట్లు 15 డిసెంబర్ 2023న రిజిస్ట్రేషన్ (నెం. 90) చేసి డెత్ సర్టిఫికెట్ (సీడీఎంఏ022615403517) ఇచ్చారు. కానీ అతనే 15 నవంబర్ 2023న మరణించినట్లు 03 మార్చి 2025న రిజిస్ట్రేషన్ (నెం. 07) చేసి డెత్ సర్టిఫికెట్ (సీడీఎంఏ022615403488) జారీ చేశారు.
రాగుల బక్కమ్మ 16 జనవరి 2021న మరణించినట్లు 17 జనవరి 2021న రిజిస్ట్రేషన్ (నెం. 2) చేసి డెత్ సర్టిఫికెట్ (సీడీఎంఏ022615413627) ఇచ్చారు. కానీ ఆమె 27 అక్టోబర్ 2024న మరణించినట్లు 24 డిసెంబర్ 2024న రిజిస్ట్రేషన్ (నెం. 18) చేసి డెత్ సర్టిఫికెట్ (సీడీఎంఏ022615403578) జారీ చేశారు. :కొంగర చెన్నయ్య 23 ఫిబ్రవరి 2025న మరణించినట్లు 28 ఫిబ్రవరి 2025న రిజిస్ట్రేషన్ (నెం. 4) చేసి డెత్ సర్టిఫికెట్ (సీడీఎంఏ022615433582) జారీ చేశారు. కానీ అతను 12 మార్చి 2025న మరణించినట్లు 17 మార్చి 2025న రిజిస్ట్రేషన్ (నెం.8) చేసి డెత్ సర్టిఫికెట్ (సీడీఎంఏ022615433538) జారీ చేశారు.
మేడమోని బాలయ్య 15 మార్చి 2022 మరణించినట్లు 28 మార్చి 2022న ఒకసారి 24 ఫిబ్రవరి 2023న, 10 జూన్ 2026న మరోసారి వేర్వేరు తేదీల్లో నమోదు చేసి వేర్వేరు డెత్ సర్టిఫికెట్లు జారీ చేశారు.అదే విధంగా కొట్రాజు తండ్రి పుల్లయ్య 05122023 మొదటి సారి మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయగా అదే వ్యక్తి కి రెండవ సారి 1312223 లో జారీ చేశారు. మూడవ సారి 1705225,నాల్గవ సారి 12o6 2025 జారీ చేశారు. అదే విధంగా కాట్రాజు పెంటయ్యకు 08022012లో రెండవ సారి 15042025,మూడవ సారి 1822012,నల్గొవ సారి 2802 2025 లో జారీ చేశారు

- **'ఇష్ట రాజ్యం' కథనానికి స్పందన**
- **బొమ్మనపల్లి పంచాయతీలో విచారణ చేపట్టిన డీఎల్పీవో**

**అచ్చంపేట, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**
మండల పరిధిలోని బొమ్మనపల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు ఇష్ట రాజ్యం అనే శీర్షికతో ఈ నెల 12న 'వుదయం' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.
డెత్ సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు జరిగాయన్న కథనం నేపథ్యంలో అచ్చంపేట డీఎల్పీవో వెంకట ప్రసాద్ శుక్రవారం బొమ్మనపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబుతో కలిసి అన్ని రకాల రికార్డులను పరిశీలించి విచారణ చేపట్టారు.విచారణలో జనన, మరణ రికార్డుల్లో కాట్ర మడేలు, జల్లెల గోపయ్య, రాగుల బక్కమ్మ, కొంగర చెన్నయ్య, మేడమోని బాలయ్య, కాట్రాజు పెంటయ్యలకు ఒకే వ్యక్తి పేరుపై రెండు, మూడు డెత్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తేలిందని డీఎల్పీవో తెలిపారు.
ఇందుకు సంబంధించిన విచారణ నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించి తదుపరి చర్యల కోసం సిఫారసు చేస్తామని పేర్కొన్నారు. బొమ్మనపల్లి పంచాయతీ కార్యాలయంలో ఉన్న జనన, మరణ రికార్డులను సీజ్ చేసినట్లు వెల్లడించారు.
కార్యదర్శి రమేష్ బాబును వివరణ కోరగా డెత్ సర్టిఫికెట్ల విషయం తనకు తెలియదని, ఎంపీడీఓ కార్యాలయ ఆపరేటర్ చేసి ఉంటాడని చెప్పారని డీఎల్పీవో తెలిపారు. అయితే ఇందులో ఎటువంటి వాస్తవం లేదని, పూర్తి బాధ్యత పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు దేనని స్పష్టం చేశారు.



## గీతం 'సెలెస్టియా 2026'తో ఫ్రెషర్స్ కు స్వాగతం

- **స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో స్నేహభావంతో నిండిన ఉత్సాహభరితమైన వేడుక**

**పటాన్చెరు (వుదయం):**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'సెలెస్టియా 2026' ఫ్రెషర్స్ పార్టీని ఆగస్టు 14న నిర్వహించింది. సంగీతం, నృత్యం, వినోదం, స్నేహభావంతో నిండిన ఉత్సాహభరితమైన వేడుకతో 202627 బ్యాచ్ ఇంజనీరింగ్ విద్యార్థులను ఈ వేడుకతో స్వాగతం పలికింది. ఈ కార్యక్రమం ఫ్రెషర్స్ కు తమ సీనియర్లు, సహచరులతో కలిసి మాట్లాడటానికి, కొత్త స్నేహాలను పెంచుకోవడానికి, గీతం కమ్యూనిటీలో భాగం కావడానికి ఒక ఉత్సాహభరితమైన వేదికను అందించింది. ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు, ఆసక్తికరమైన ఆటలు, సంగీతం, అనేక సరదా కార్యకలాపాలతో ప్రాంగణం కళకళలాడుతూ, పండుగ వాతావరణాన్ని సృష్టించింది.ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణ గ్లామరస్ ర్యాంప్ వాక్. ఇక్కడ ఫ్రెషర్స్ తమ ఆత్మవిశ్వాసం, హుందాతనం, వ్యక్తిత్వం, శైలిని ప్రదర్శించారు. వారి ఉత్సాహభరితమైన భాగస్వామ్యం, ఉత్తేజకరమైన ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. గీతం నాయకుల చేతుల మీదుగా మిస్టర్ ఫ్రెషర్, మిస్ ఫ్రెషర్లకు సత్కారం చేయడంతో, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ వేడుకలు ఘనంగా ముగిశాయి.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ నాయకత్వం మాట్లాడుతూ, కొత్త విద్యార్థుల కోసం ఆసక్తికరమైన, స్వాగత పూర్వకమైన వేదికను ఏర్పాటు చేసినందుకు విద్యార్థి నిర్వాహకుల కృషిని అభినందించారు. 'సెలెస్టియా 2026' ఫ్రెషర్లకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని కల్పించడమే కాకుండా, వారిలో జట్టు స్ఫూర్తిని, స్నేహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, గీతం సమాజం పట్ల బలమైన అనుబంధ భావాన్ని పెంపొందించిందని వారు పేర్కొన్నారు.గీతంలో తమ విద్యా ప్రయాణానికి ఒక చిరస్మరణీయమైన ఆరంభాన్ని అందించినందుకు ఫ్రెషర్లు తమ సీనియర్లకు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేయడంతో ఈ వేడుకలు ఆనందంగా ముగిశాయి.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీ

**వికారాబాద్, ఆగష్టు 14; (వుదయం జిల్లా ప్రతినిధి):**



జిల్లాలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంభందిత అధికారులను ఆదేశించారు. శుక్రవారము జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంభందించి చేపట్టిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మరియు జిల్లా అదనపు కలెక్టర్ల తో కల్సి జిల్లా కలెక్టర్ పరిశీలించారు.
వేదిక, సీటింగ్, డెకరేషన్,పరేడ్, బందోబస్తు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ప్రజలకు అవసరమైన సౌకర్యాల పై సంభందిత అధికారులకు వారు పలు సూచనలు చేశారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల లోతొలి సారిగా 1. వందే మాతరం 2,జనగణ మన 3 జయ జయహే తెలంగాణా, మూడు గీతాలాపనలు ఉంటాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత ఆయా శాఖల అధికారులు పాల్గొని తమ తమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు.
ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, డి ఆర్ ఓ స్వర్ణ లత, మహమ్మద్ సత్తార్, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, ఏ ఓ పర్వీన బేగం, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహా రెడ్డి, తహసిల్దార్ లక్ష్మీనారాయణ , పోలీస్ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## రేషన్ కార్డుల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

**వనపర్తి ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి)**



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.శనివారం ఐ.డి.ఒ.సి ప్రాంగణంలో నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొని ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకావిష్కరణ చేస్తారని, ఇట్టి కార్యక్రమానికి శాసన సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొంటారని కాబట్టి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు సజావుగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమ వేడుకల వేదిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు, సరిపడ మంచి నీరు, మీడియా, అధికారులకు కుర్చీలు తదితర ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు.

**మధ్యాహ్నం 2.00 గంటలకు ఐ.డి.ఓ.సి సమావేశ మందిరములో లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ**

రాష్ట్ర ప్రభుత్వం ( 9) భద్రత ఏర్పాట్లతో రూపొందించిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఆగస్టు 15న మధ్యాహ్నం 2.00 గంటలకు ఐ.డి. ఒ.సి సమావేశ మందిరంలో ముఖ్య అతిథి పట్నం మహేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతుందని, ఇట్టి కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో మధ్యాహ్నం 2.00 గంటలకు పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన వెంటనే వనపర్తి జిల్లాలో సైతం లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని తెలియజేశారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ టి. వినోద్ కుమార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, పరిపాలన అధికారి భాను ప్రకాష్, ఇతర సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

# సర్వే నంబర్ 117 ప్రభుత్వ భూమి.. ఆక్రమిస్తే కఠిన చర్యలు



**చర్ల, ఆగస్టు 14: (వుదయం ప్రతినిధి)**

చర్ల మండల పరిధిలోని సర్వే నంబర్ 117లో ఉన్న భూమి ప్రభుత్వ భూమి అని అధికారులు స్పష్టం చేశారు. ఈ భూమిని ఎవరైనా వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నించినా, అనధికారంగా వినియోగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రభుత్వ భూములపై ఆక్రమణ హక్కులు కల్పించుకోవడం, నిర్మాణాలు చేపట్టడం లేదా ఇతర విధాలుగా ఆక్రమణకు పాల్పడటం చట్టవిరుద్ధమని అధికారులు తెలిపారు.సర్వే నంబర్ 117కు సంబంధించిన ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు చర్ల మండల తహసీల్దార్ శ్రీనివాస్ , ఎంపీడీవో ఈదయ్య ,సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి రాంబాబు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించినా, ప్రజలు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ప్రభుత్వ భూమి రక్షణలో భాగంగా ఈ హెచ్చరికను ప్రజలు గమనించాలని అధికారులు కోరారు.

# డీపీఆర్వో సతీమణి మృతికి సంతాపం



**సూర్యాపేట, ఆగస్టు 14: వుదయం ప్రతినిధి**

సూర్యాపేట జిల్లా డీపీఆర్వో వల్లోజు శ్రీనివాస్ సతీమణి వల్లోజు విజయలక్ష్మి * అకాల మరణం చెందారు. ఈ విషాద వార్త తెలుసుకున్న *టియూడబ్ల్యూజే ఐజేయు సూర్యాపేట జిల్లా నాయకులు శ్రీనివాస్ నివాసానికి చేరుకుని పార్థివదేహానికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డీపీఆర్వో శ్రీనివాస్ ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విజయలక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని, శోకతప్త కుటుంబానికి ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ఇవ్వాలని ప్రార్థించారు.

పాల్గొన్న నాయకులుఈ కార్యక్రమంలో టియూడబ్ల్యూజే ఐజేయు సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి డా. కృష్ణ బంటు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు బత్తుల మల్లికార్జున్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి రెబ్బ విజయ్ కుమార్, సూర్యాపేట పట్టణ ప్రెస్ క్లబ్ సంయుక్త కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ రషీద్ షేక్, యూనియన్ నాయకులు కందుకూరి యాదగిరి, దుస్స చంద్రశేఖర్, సందీప్, రాము తదితరులు పాల్గొన్నారు.విజయలక్ష్మి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ డీపీఆర్వో శ్రీనివాస్ కి, కుటుంబ సభ్యులకు సంఘం తరపున సానుభూతి తెలిపారు.

# సర్వే 117లో కమ్యూనిటీ హాల్



**- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన తుడుందెబ్బ నాయకులు**

**చర్ల, ఆగస్టు 14: (వుదయం ప్రతినిధి)**

చర్ల మండల కేంద్రంలోని సర్వే నంబర్ 117లో కొమురం భీమ్ ఆదివాసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 2.10 సెంట్ల భూమిని మంజూరు చేయాలని కోరుతూ తుడుందెబ్బ నాయకులు శుక్రవారం చర్ల మండల తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆదివాసీ విద్యార్థి రాష్ట్ర జేఏసీ నాయకుడు ఇర్ప ప్రకాష్ దొర మాట్లాడుతూ.. చర్ల మండల కేంద్రంలో ఆదివాసీలకు ఉపయోగపడే విధంగా కొమురం భీమ్ ఆదివాసీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో 2013-14 సంవత్సరాల్లో అప్పటి ఐటీడీఏ పీవో దివ్య దేవరాజన్ ఆధ్వర్యంలో చర్ల, పాల్వంచ మండలాల్లో భూమి సేకరణకు అనుమతులు మంజూరైనప్పటికీ, అనంతరం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రక్రియ ముందుకు సాగలేదని తెలిపారు.ప్రస్తుతం సర్వే నంబర్ 117లోని భూమిని అధికారులు పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పునర్విభజన సమయంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన నిధులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులను ఐటీడీఏ పీవో ద్వారా మంజూరు చేయించి, చర్ల మండల కేంద్రంలో శ్రీ కొమురం భీమ్ ఆదివాసీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, మండల నాయకులు పూనెం రవికిరణ్, కలం శ్రీనివాస్, యాక నర్సింహారావు, దబ్బా అనిల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సోమ్లా నాయక్‌కు ఘన నివాళులు



**- జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు**

**పర్వతగిరి, ఆగస్టు 14 ( వుదయం ప్రతినిధి ):**

పర్వతగిరి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రెడ్యా నాయక్ తండ్రి సోమ్లా నాయక్ గురువారం రాత్రి మృతి చెందగ శుక్రవారం వారి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి బౌతిక ధేహానికి నివాళులు అర్పించి, కుటుంబన్ని పరామర్శించి బాధిత కుటుంబన్ని అన్ని విధాలా అండగ ఉంటామని బరోసా ఇచ్చి సంఘీభావం తెలిపినారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాంప నాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు నాయక్, కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటలకే తేలిన జంట హత్యలు

**- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ విలేకరుల సమావేశంలో వెల్లడి**

**సూర్యాపేట, ఆగస్టు 14: వుదయం ప్రతినిధి**



మోతే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భార్యాభర్తల జంట హత్య కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఈ కేసులో కానిస్టేబుల్ సహా ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ బీఎస్ తెలిపారు.గురువారం మోతే మండల కేంద్రం, జాతీయ రహదారి 365 బి బి పక్క ఓవర్ వద్ద వ్యవసాయ భూమిలో పాక్షికంగా పూడ్చిపెట్టిన రెండు మృత దేహాలు కనిపించాయి. సమాచారం అందుకున్న వెంటనే కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ అచ్చిరెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. మృతులు: మోతే మండలం బిక్య తండాకు చెందిన హలవత్ నాగులు 41, అతని భార్య హలవత్ బూబా. వీరు మోతేలో కౌలు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు.దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. శుక్రవారం ఉదయం సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద ఏ1.ఎం.డి.షరీఫ్ 23, మోతే పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ మరియు ఏ 2. జిల్లెపల్లి సుందర్, మోతే గ్రామం ను అరెస్ట్ చేశారు.విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించారు. షరీఫ్, బూబానాగులు దంపతులకు రూ.3 లక్షలు అప్పు ఇచ్చాడు. తిరిగి డబ్బు అడగగా వారు ఎట్రాసిటీ కేసు పెడతామని బెదిరించారు. దీంతో వారిని అడ్డు తొలగించాలని షరీఫ్, సుందర్ కలిసి పథకం పన్నారు. ఆగస్టు 11 రాత్రి గొర్రెల లోన్ ఇప్పిస్తానని నమ్మించి నాగులును, ఆ తర్వాత బూబాను మోతే శివారులోని పొలంలోకి తీసుకెళ్లారు. అక్కడ గుడిబండతో కొట్టి హత్య చేసి గుంతలో పాతిపెట్టారు. మహిళ ఒంటిపై ఉన్న ఆభరణాలను కూడా తీసుకున్నారు.నిందితుల వద్ద నుండి హత్యకు ఉపయోగించిన గుడిబండ,బైక్, 2 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తును డీఎస్పీ ప్రసన్న కుమార్ కు అప్పగించారు. నిందితులను రిమాండ్ కు తరలించారు.కేసు ఛేదనలో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ప్రసన్న కుమార్, సీఐ రామకృష్ణారెడ్డి, శివకుమార్, ఎస్‌ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై స్టే వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర

**- సెప్టెంబర్ 9లోగా కౌంటర్ దాఖలు చేసి స్టే ఎత్తివేయాలి**
**- చర్ల బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్**

**చర్ల, ఆగస్టు 14: (వుదయం ప్రతినిధి)**



పేదింటి ఆడపిల్లలకు అండగా నిలిచిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే విధించే పరిస్థితి రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని చర్ల బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆరోపించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టు విచారణలో ప్రభుత్వం తరపున కౌంటర్ దాఖలు చేస్తామని అడ్వకేట్ జనరల్ హామీ ఇచ్చినప్పటికీ, న్యాయస్థానం పలుమార్లు అవకాశం ఇచ్చినా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. పేద వర్గాలకు పథకాల ప్రయోజనాలు అందకుండా చేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కోర్టు వ్యవహారాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకపోగా గత ప్రభుత్వంలో ప్రజాదరణ పొందిన పథకాల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని తాతారావు విమర్శించారు.2014 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో పేద కుటుంబాల ఆడపిల్లల వివాహ ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన లక్షలాది కుటుంబాలకు ఈ పథకాలు ఆర్థికంగా అండగా నిలిచాయని పేర్కొన్నారు.సెప్టెంబర్ 9న జరగనున్న తదుపరి విచారణలోపు ప్రభుత్వం వెంటనే బలమైన కౌంటర్ దాఖలు చేసి స్టే ఎత్తివేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే చట్టసభల ద్వారా పథకాలకు ప్రత్యేక చట్టబద్ధత కల్పించి, కోర్టు స్టే తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారులందరికీ వెంటనే ఆర్థిక సహాయం విడుదల చేయాలని దొడ్డి తాతారావు కోరారు.

# మండలంలో ప్రజావాణి సమస్యలకు తక్షణపరిష్కారం!




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి)**

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు, జిల్లా ప్రజావాణి సూపరింటెండెంట్ రంగు రమేష్‌తో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి ఆపరేటర్లకు ప్రజావాణి నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి అన్ని మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో మండల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల కేంద్రాల్లోనే ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని పేర్కొన్నారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, వెంటనే సంబంధిత శాఖలకు పంపించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.జిల్లా ప్రజావాణి సూపరింటెండెంట్ రంగు రమేష్ మాట్లాడుతూ మండల ప్రజావాణికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి వినతిని సక్రమంగా నమోదు చేసి సంబంధిత అధికారులకు వెంటనే చేరవేయాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అనంతరం మండల స్థాయి ఆపరేటర్లకు ఫిర్యాదుల నమోదు, సంబంధిత శాఖలకు పంపించడం, పరిష్కార ప్రక్రియ, ఆన్‌లైన్‌లో పరిష్కార పురోగతి నమోదు తదితర అంశాలపై శిక్షణ అందించారు.

# పిఆర్టీయు సంఘంతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం

**- పిఆర్టీయు మండల అధ్యక్షుడుగా అల్వాల బిక్షపతి.**
**- సెప్టెంబర్ 1 న జరిగే ధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలి.**
**- పిఆర్టీయు జిల్లా అధ్యక్షుడు ఇదునూరి రవీందర్ రెడ్డి.**

**ఖానాపురం, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**





ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్టీయు సంఘమే ముందుంటుందని పిఆర్టీయు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇందునూరి రవీందర్ రెడ్డి ఉపాధ్యాయులకు తెలిపారు. మండల శాఖ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశమును ఏర్పాటుచేసి ముఖ్య అతిధిగా పిఆర్టీయు సంఘం జిల్లా అధ్యక్షుడు పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్టీయు సంఘం ముందు ఉంటుందని ఉపాధ్యాయులకు తెలుపుతూ సెప్టెంబర్ 1న హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై మహాధర్నాను విజయవంతం చేయాలని పిఆర్టీయు సంఘాల బాధ్యులకు ఉపాధ్యాయులకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మండల పిఆర్టీయు సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. పిఆర్టీయు సంఘం మండల అధ్యక్షుడిగా అల్వాల బిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా జాటోత్ జేతురామ్,
కార్యవర్గ సభ్యులు సమంత, సారంగపాణి, రజిత, చంద్రమౌళి, భాస్కర్, వీరన్న, గౌరవ అధ్యక్షులుగా మేనక, సునీతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేట్ అధ్యక్షుడు డి వీరన్న, ఎల్ రాజునాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెండెం భాస్కర్, నెల్లూరి ప్రసాద్ రావు. జె ఆశోక్. వివిధ మండలాల అధ్యక్షులు. ప్రధానకార్యదర్శులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రాథమిక సభ్యులు, ఎంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సత్తయ్య కుటుంబానికి ఆర్థిక చేయూత

**- కెవిఎస్ ఫౌండేషన్ చైర్మన్: కర్నాటి విద్యాసాగర్**

**చండూరు, ఆగస్టు 14(వుదయం):**

చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డుకు చెందిన నిరుపేద చేనేత కార్మికుడు కర్నాటి సత్తయ్య గురువారం కనగల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషాద ఘటనను గంజి దుర్గా వెంకటేశం ద్వారా తెలుసుకున్న కెవిఎస్ ఫౌండేషన్ కర్నాటి విద్యాసాగర్ వెంటనే స్పందించి, మృతుని కుటుంబానికి రూ. 10,000 ఆర్థిక సాయాన్ని గంజి దుర్గా వెంకటేశం చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం చైర్మన్ పున్నధర్మేందర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుర్రం బిక్షమయ్య, ప్రసన్న, రావిరాల నగేష్, రాపోలు ప్రభాకర్ , చెరుపల్లి కృష్ణ , గుర్రం రాము, గంజి అశోక్ తదితరులు పాల్గొన్నారు



# వీరాపురం వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**- గోదావరి వరదల్లో కొట్టుకొచ్చి ఉండొచ్చని అనుమానం**

**చర్ల, ఆగస్టు 14: (వుదయం ప్రతినిధి)**



చర్ల మండలం వీరాపురం గ్రామ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు.ఇటీవల గోదావరి నదికి వచ్చిన వరదల నేపథ్యంలో ఈ మృతదేహం వరద నీటిలో కొట్టుకొచ్చి వీరాపురం ప్రాంతానికి చేరి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే మృతదేహం ఎవరిదనే విషయం ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు, మృతికి గల కారణాలపై విచారణ చేపట్టారు.పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గల్లంతైన వ్యక్తుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

# మద్యం మత్తుతోనే జీవితాలు చిత్తు - ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**మునుగోడు, ఆగస్టు14(వుదయం):**




గ్రామీణ ప్రాంతాల్లో చిన్న వయసులోనే భర్తలను కోల్పోయి మహిళలు వితంతువులుగా మారుతుండటానికి ప్రధాన కారణం తాగుడు మహమ్మారేనని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మునుగోడు మండల పరిషత్ కార్యాలయంలో నూతన సర్పంచుల ఎంపిక తర్వాత తొలిసారిగా నిర్వహించిన అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపడం వల్ల తాగుడు ప్రభావం కొంతమేర తగ్గినప్పటికీ, అక్కడక్కడా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై మరింత కఠినంగా వ్యవహరించి మద్యాన్ని పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు.గ్రామాలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలంటే వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సబ్ సెంటర్ల నిర్మాణాలను ప్రజలందరికీ అందుబాటులో ఉండే ప్రాంతాల్లోనే చేపట్టాలని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన నిధులు వెచ్చించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు ముందుకు తీసుకెళ్లాలన్నారు తాగునీరు కాలుష్యం కారణంగానే గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 90 శాతం అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాగునీరు, బోరు నీటి కోసం విడివిడిగా వేర్వేరు ట్యాంకులను నిర్వహించాలని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర అని, సెక్రటరీలు కచ్చితంగా సమయపాలన పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే మునుగోడులో పనిచేయడానికి వీలులేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో రూపుదిద్దుకుంటున్న 400 రోడ్ల పనులు సహా మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేశామని తెలిపారు. రాబోయే రెండున్నర ఏళ్లలో గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నిలిపేందుకు రాజకీయాలకు అతీతంగా సర్పంచులు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దొటి నారాయణ, మండల ప్రత్యేక అధికారి (డీపీఓ) తరుణ్ చక్రవర్తి, తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

# ఘనంగా గోదాదేవి జన్మదిన వేడుకలు

**సూర్యాపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో దివ్య ప్రబంధ పారాయణం**

**సూర్యాపేట, ఆగస్టు 14: వుదయం ప్రతినిధి**



జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోదాదేవి జన్మదిన వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.భగవంతుని అనుగ్రహానికి భక్తియే మూలమని చాటి చెప్పిన శ్రీ గోదాదేవి అవతార దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, సంకర్షణ్ ఆచార్యులు, శ్రీహరి ఆచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి నవకలశములతో తిరుమంజన స్నపనం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలతో విశేష అలంకరణ చేసి కుంకుమార్చనలు, విశేష అర్చనలు చేశారు. ఆండాళ్ గోష్ఠి భక్తబృందం అమ్మవారి సన్నిధిలో దివ్య ప్రబంధ పా శురాలను భక్తిపారవశ్యంతో పఠించారు.సాయంత్రం అమ్మవారిని పల్లకిలో అలంకరించి ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు సేవ నిర్వహించారు. భక్తులు "గోదమ్మ" నామస్మరణతో ఆలయం మారుమోగించారు.

పాల్గొన్నవారుఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి లక్ష్మణరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, వికాస తరంగిణి ఆండాళ్ గోష్ఠి సభ్యులు తదితర భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేయూత పింఛన్లు: ఆఖరి తేదీ

**పర్వతగిరి, ఆగస్టు 14:**



తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సూచనల మేరకు 'చేయూత' సామాజిక భద్రతా పింఛన్ల మంజూరుకు కొత్త లబ్ధిదారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పర్వతగిరి ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ తెలిపారు. గురువారం పర్వతగిరి ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్య విషయాలు: అర్హులు: ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, సికిల్ సెల్, హిమోఫిలియా బాధితులు దరఖాస్తు చేసుకోవచ్చు.చివరి తేదీ: అర్హులైన వారు తగిన ధ్రువీకరణ పత్రాలతో ఆగస్టు 31 లోగా ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించి, తప్పనిసరిగా రసీదు పొందాలి.గమనిక: ఇదివరకే 'ప్రజాపాలన', 'ప్రగతి ప్రణాళిక 99 రోజుల గ్రామసభలు', 'ప్రజావాణి' కార్యక్రమాల్లో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు.ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి శేషు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ కొరడా

**నల్లబెల్లి, ఆగస్టు 14 (వుదయం):**



మండల పరిధిలోని నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్, పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. వరంగల్ డిప్యూటీ కమిషనర్ దత్తరాజు గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ నవీన్ కుమార్‌ల ఆదేశాల మేరకు నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా శుక్రవారం ముమ్మర దాడులు నిర్వహించారు.నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నల్లబెల్లి మండలం నందిగామ, రేలకుంట గ్రామాల్లో. నర్సంపేట, పరకాల ఎక్సైజ్ పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏకకాలంలో సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,900 లీటర్ల చక్కెర పానకాన్ని గుర్తించిన అధికారులు.. దాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అలాగే 55 లీటర్ల నాటుసారాతో పాటు సారా తయారీకి ఉపయోగించే 60 కిలోల బెల్లం, 10 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. చట్టవ్యతిరేకంగా నాటుసారా తయారీకి పాల్పడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి తెలిపారు.ఈ దాడుల్లో ట్రైనీ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు లక్ష్మణ్ ఆనంద్, నీలోఫర్, సుచిత, టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్ చందర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు నాగయ్య, నాగేశ్వరరావు, ఎస్సైలు చంద్రశేఖర్, సులోచన, షరీఫ్, సురేష్ రెడ్డిలతో పాటు ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## జిమ్‌కు వెళ్తే ప్రయోజనాలెన్నో..

ఈరోజుల్లో జిమ్‌కు వెళ్లే మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. బరువులెత్తడం వల్ల ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవడమే కాదు.. మానసికంగా చురుగ్గానూ మారిపోవచ్చంటున్నారు నిపుణులు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల మహిళలకు పలు ప్రయోజనాలు చేకూరుతున్నట్లు మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, నిద్రలేమి, మానసిక ఒత్తిడి, బరువు పెరగడం.. వంటి సమస్యలతో పాటు ఎముకలు బలహీనపడడం కూడా చాలామందిలో కనిపిస్తుంటుంది. అయితే వ్యాయామం చేయడం వల్ల ఈ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుందా? అనే ప్రశ్న 'యూనివర్సిటీ ఆఫ్ ఎక్సెటర్' పరిశోధకులకు వచ్చిందట. అసలు విషయం తెలుసుకునేందుకు 'హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ' తీసుకోని 72 మంది మహిళలను ఎంచుకున్నారట. వీరిలో కొందరు సాధారణ వ్యాయామం చేయగా.. మరి కొంతమందితో మాత్రం జిమ్‌లో కసరత్తులు చేయించారట. సాధారణ వ్యాయామం చేసిన వారితో పోల్చితే... బరువులెత్తిన వారిలో ఎముకల సాంద్రత పెరిగి.. తుంటి, దిగువ శరీర భాగాలు దృఢంగా మారినట్లు, ఫ్లెక్సిబిలిటీ కూడా పెరిగినట్లు పరిశోధకులు వెల్లడించారు. అంతేకాదు.. వ్యాయామంతో మెనోపాజ్ దుష్ప్రభావాల్ని సైతం చాలా వరకు దూరం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. జిమ్‌లో బరువులెత్తడం వల్ల ఆయుర్దాయం పెరుగుతుందని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఇందులో భాగంగా అమెరికాలో నాలుగు లక్షల మందికి సంబంధించిన 20 ఏళ్ల ఆరోగ్య సమాచారాన్ని సేకరించి పరిశీలించారట! ఇందుకు సంబంధించిన వివరాల్ని 2024లో వెల్లడించారు పరిశోధకులు. వీరిలో వారానికి రెండు నుంచి మూడు రోజుల పాటు స్ట్రెంథ్ ట్రైనింగ్ చేసిన వారి ఆయుష్షు గణనీయంగా పెరిగినట్లు తెలిపారు. అంతేకాదు.. వ్యాయామం చేయని వారితో పోలిస్తే.. చేసిన వారిలో గుండె సమస్యలతో మరణించిన వారి సంఖ్య కూడా తగ్గిందట. అలాగే ఒకే తరహా వ్యాయామాలు చేసినప్పటికీ పురుషుల కంటే మహిళలకు వయసు పెరిగే కొద్దీ ఎముకలు బలహీనంగా మారతాయంటున్నారు నిపుణులు. ముఖ్యంగా పురుషులతో పోలిస్తే ఈ సమస్య మహిళల్లో ఎక్కువగా ఉంటుందంటున్నారు. సమస్య తీవ్రమైతే ఎముక గుల్లబారడం (ఆస్టియోపోరోసిస్) సమస్య తలెత్తుతుంది. ఇలాంటప్పుడు చిన్న ప్రమాదం జరిగినా ఎముకలు విరిగే అవకాశం ఉంటుంది. అయితే జిమ్‌లో కసరత్తులు చేసే మహిళల్లో ఈ ప్రమాదం చాలా తక్కువగా ఉంటుందని ఓ అధ్యయనం చెబుతోంది. అంతేకాదు క్రమం తప్పకుండా బరువులెత్తడం వల్ల ఎముకల సాంద్రత పెరిగినట్లూ పరిశోధకులు వెల్లడించారు. కేవలం పురుషులు మాత్రమే కాకుండా మహిళలు కూడా కండ పుష్టి కోరుకుంటారు. కానీ వయసు పెరిగే కొద్దీ ఇది తగ్గుతుంటుంది. 60 ఏళ్లు పైబడిన వారిలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. కానీ, ఈ ప్రక్రియ 35 ఏళ్ల నుంచే ప్రారంభమవుతుందంటున్నారు నిపుణులు. అయితే బరువులెత్తే వారిలో ఈ ముప్పు చాలా తక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ముఖ్యంగా క్రమం తప్పకుండా జిమ్‌కు వెళ్లే మహిళల్లో కండర మోతాదు పెరుగుతుందంటున్నారు. చైనాలోని కొంతమంది పరిశోధకులు చేసిన మెటా అనాలిసిస్‌లోనూ ఇదే విషయం నిరూపితమైంది. జిమ్‌లో కసరత్తులు చేసే కొద్దీ శరీరంలో స్పష్టమైన మార్పులు కనిపిస్తుంటాయని చెబుతున్నారు నిపుణులు. కండర మోతాదు పెరగడం, జీర్ణక్రియ మెరుగవడం, చురుగ్గా పనులు చేయడం.. వంటివి ఇందులో భాగమేనంటున్నారు.



## రోజూ ఇంట్లో వాడే ప్లాస్టిక్ వస్తువులతో ఊబకాయం..

ఊబకాయం అంటే ఎక్కువగా తినడం, తక్కువగా కదలడం వల్లే వస్తుందని చాలా కాలంగా భావిస్తున్నారు. అయితే తాజాగా వెలువడుతున్న పరిశోధనలు మరో కీలక విషయాన్ని వెలుగులోకి తెస్తున్నాయి. మనం రోజూ ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులు, ఆహార ప్యాకేజింగ్, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల్లో ఉండే కొన్ని రసాయనాలు శరీరంలోని హార్మోన్ల పనితీరును దెబ్బతీసి ఇన్సులిన్ నిరోధకత (ఇన్సులిన్ రెసిస్టెన్స్)ను పెంచడంతోపాటు కొవ్వు నిల్వలను అధికం చేస్తున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ రసాయనాలను ఒబిసోజెన్స్ అని పిలుస్తారు.



ఒబిసోజెన్స్ అంటే శరీరంలో కొవ్వు జీవక్రియను ప్రభావితం చేసే రసాయనాలు. సాధారణంగా ఆహారం ద్వారా లభించే శక్తిని శరీరం వినియోగించాల్సి ఉండగా, ఈ రసాయనాల ప్రభావంతో అదే శక్తి కొవ్వుగా నిల్వ అయ్యే అవకాశాలు పెరుగుతాయి. ఇవి ఈస్ట్రోజెన్, థైరాయిడ్, గ్లూకోకార్టికాయిడ్ వంటి హార్మోన్ల పనితీరును అనుకరించడం లేదా వాటి పనిని అడ్డుకోవడం ద్వారా జీవక్రియలలో మార్పులు తీసుకొస్తాయి. ఈ రసాయనాలకు ప్రధాన వనరు ప్లాస్టిక్ ఉత్పత్తులే. పాలీకార్బొనేట్ ప్లాస్టిక్‌లు, ఆహార డబ్బాల లోపలి పూతల్లో ఉపయోగించే బిస్ఫెనాల్-ఎ (BPA), ప్లాస్టిక్‌ను మృదువుగా ఉంచేందుకు ఉపయోగించే థాలేట్స్ (Phthalates) ను అత్యంత ఎక్కువగా అధ్యయనం చేసిన ఒబిసోజెన్స్‌గా గుర్తించారు. ప్లాస్టిక్ డబ్బాలను వేడి చేసినప్పుడు, ఎక్కువకాలం ఉపయోగించినప్పుడు లేదా ఆమ్లత్వం ఎక్కువగా ఉన్న ఆహారాన్ని నిల్వ చేసినప్పుడు ఈ రసాయనాలు ఆహారంలోకి కలిసిపోయి శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది.

## ఇక వైరస్‌లు అన్నింటికీ ఒకే టీకా..

ప్రపంచాన్ని వణికించిన కోవిడ్-19, సార్స్, ఎబోలా వంటి వైరస్‌లకు ఒక్కో వైరస్‌కు ఒక్కో టీకా అభివృద్ధి చేయాల్సిన పరిస్థితి ఉంది. అయితే భవిష్యత్తులో ఒకే టీకాతో ఒకే వైరస్ కుటుంబానికి చెందిన అనేక వైరస్‌ల నుంచి రక్షణ కల్పించే సాంకేతికత అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు కృత్రిమ మేధస్సు (AI) సాయంతో రూపొందించిన కొత్త తరహా వ్యాక్సిన్ సాంకేతికత వైరస్‌ల మొత్తం కుటుంబంపైనే రోగనిరోధక శక్తిని పెంపొందించే సామర్థ్యం కలిగి ఉండే అవకాశాలు ఉన్నాయని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. భవిష్యత్తులో మరో మహమ్మారిని అడ్డుకునే దిశగా ఇది కీలక ముందడుగు అవుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చాలా టీకాలు ఇప్పటికే వ్యాపించిన వైరస్ రకాలను లక్ష్యంగా చేసుకుని తయారవుతాయి. కానీ వైరస్‌లు వేగంగా రూపాంతరం చెందుతుండటంతో, కొన్ని నెలల తర్వాత వ్యాప్తి చెందే కొత్త వేరియంట్‌పై అవి తక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందువల్ల వైరస్‌ను వెంబడిస్తూ కొత్త టీకాలు తయారు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా శాస్త్రవేత్తలు AI సాయంతో ఒకే వైరస్ కుటుంబంలోని అన్ని రకాల వైరస్‌లలో సాధారణంగా ఉండే కీలక భాగాలను గుర్తించారు. రోగనిరోధక వ్యవస్థ గుర్తించే ఆ సాధారణ లక్షణాలనే లక్ష్యంగా చేసుకుని కొత్త టీకాను రూపొందించారు. దీంతో ఒక్క వేరియంట్‌కే కాకుండా అదే కుటుంబానికి చెందిన అనేక వైరస్‌లపై రోగనిరోధక శక్తిని పెంచే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. ఈ పరిశోధనకు ప్రేరణ 2013 నుంచి 2016 వరకు పశ్చిమ ఆఫ్రికాలో సంభవించిన ఎబోలా వ్యాప్తి సమయంలో వచ్చింది. ప్రారంభంలో ఆ వ్యాధిని లాసా జ్వరం, కలరా లేదా గ్యాస్ట్రోఎంటరైటిస్‌గా తప్పుగా గుర్తించడంతో అసలు వైరస్‌ను నిర్ధారించడానికే మూడు నుంచి నాలుగు నెలలు పట్టింది. అప్పటికే వైరస్ గినియా నుంచి సియెర్రా లియోన్, లైబీరియా వంటి దేశాలకు వేగంగా వ్యాపించి వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) అంచనాల ప్రకారం ఆ వ్యాప్తిలో సుమారు 11,300 మంది మృతి చెందారు. ఈ అనుభవం తర్వాత వైరస్‌లను గుర్తించడం, వాటికి టీకాలు అభివృద్ధి చేసే విధానాన్ని పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందని పరిశోధకులు నిర్ణయించారు. అందుకోసం వివిధ వైరస్‌లకు సంబంధించిన అందుబాటులో ఉన్న సమాచారాన్ని AIతో విశ్లేషించి, వాటిలోని పోలికలు, తేడాలను గుర్తించారు.



## హోమియోపతి మందులు తీసుకుంటున్నారా?

చాలా మంది నెలల తరబడి హోమియోపతి మందులు వాడినా ఫలితం లేదని భావిస్తుంటారు. అయితే, హోమియోపతి నిపుణుల ప్రకారం.. ఇందుకు కారణం చాలా సందర్భాల్లో మందులు కాదు.. వాటిని సరిగ్గా వాడకపోవడం, వైద్యుల సూచనలు పాటించకపోవడం, ఆహారపు అలవాట్లు, జీవనశైలిలోని పొరపాట్లే. సరైన నియమాలు పాటిస్తేనే హోమియోపతి చికిత్స మెరుగైన ఫలితాలను ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. హోమియోపతి నిపుణుల ప్రకారం.. ప్రతి మందును ఒకే విధంగా తీసుకోరు. కొన్ని మందులను ఖాళీ కడుపుతో, మరికొన్నింటిని భోజనానికి 20 నిమిషాల ముందు లేదా తర్వాత తీసుకోవాలి. అలాగే మందు వేసుకున్న వెంటనే టీ, కాఫీ లేదా నీళ్లు తాగడం వల్ల మందు ప్రభావం తగ్గే అవకాశం ఉందని వారు సూచిస్తున్నారు. హోమియోపతి మందులను ఎండ, వేడి, ఘాటైన వాసనలు ఉన్న ప్రదేశాలకు దూరంగా భద్రపరచాలి. మందు సీసా మూతను ఎప్పుడూ మంచిగా మూసి ఉంచాలి. అలాగే మాత్రలను చేతితో కాకుండా సీసా మూత లేదా శుభ్రమైన చెంచాతో తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని హోమియోపతి మందులు తీసుకునే సమయంలో ఉల్లిపాయ, వెల్లుల్లి, యాలకులు, ఇంగువ, అల్లం వంటి ఘాటైన వాసన ఉన్న పదార్థాలను తగ్గించాలని వైద్యులు సూచిస్తారు. అలాగే వేయించిన పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం కూడా చికిత్సపై ప్రభావం చూపవచ్చు. పిల్లలు, పెద్దలు రాత్రిళ్లు ఎక్కువసేపు మొబైల్ వాడటం, సరైన నిద్ర లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం వంటి అలవాట్లు కూడా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని నిపుణులు అంటున్నారు. రోజూ ఉదయం యోగా లేదా తేలికపాటి వ్యాయామం చేయడం శరీరానికి మేలు చేస్తుందని సూచిస్తున్నారు. ఇటీవల చాలా మంది ఇంటర్నెట్‌లో చూసి స్వయంగా హోమియోపతి మందులు వాడుతున్నారు.

కానీ నిపుణుల సలహా లేకుండా మందులు తీసుకోవడం వల్ల సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హోమియోపతి అనేది వెంటనే ఫలితం ఇచ్చే చికిత్స కాదు.



## హార్ట్ బర్న్ లేదా యాసిడ్ రిఫ్లక్స్ అంటే ఏమిటి..

మనం ఇష్టమైన ఆహారం తిన్న తర్వాత ఛాతీలో మంట, గొంతు వరకు మంటగా అనిపించడం వంటి సమస్యలను చాలామంది తరచూ ఎదుర్కొంటుంటారు. దీనినే సాధారణంగా హార్ట్‌బర్న్ లేదా యాసిడ్ రిఫ్లక్స్ అంటారు. రోజువారీ ఆహారపు అలవాట్లే ఈ సమస్యను తగ్గించడంలోనూ, పెంచడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. కొన్ని ఆహారాలు కడుపులోని ఆమ్ల ప్రభావాన్ని తగ్గించి ఉపశమనం కలిగిస్తే, మరికొన్ని ఆహారాలు లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తాయి. అల్లం టీలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జీర్ణాశయానికి ఉపశమనం కలిగించడంలో సహాయపడతాయి. ఇది జీర్ణ వ్యవస్థలోని వాపులను తగ్గించి యాసిడ్ రిఫ్లక్స్ వచ్చే అవకాశాన్ని తగ్గిస్తుంది. అరటి పండు తక్కువ ఆమ్లత్వం కలిగిన పండు. ఇది అన్నవాహిక లోపలి పొరను రక్షిస్తూ మంటను తగ్గించడం లో సహాయపడుతుంది. ఇందులోని పెక్టిన్ అనే పీచు పదార్థం ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా చేస్తుంది. ఓట్‌మీల్ సంపూర్ణ ధాన్యాహారం. ఇది కడుపులోని అదనపు ఆమ్లాన్ని శోషించడంలో సహాయపడి హార్ట్‌బర్న్ లక్షణాలను తగ్గిస్తుంది. సోంపును తక్కువ ఆమ్లత్వం కలిగిన పదార్థంగా పరిగణిస్తారు. ఇది కడుపులోని అధిక ఆమ్ల ప్రభావాన్ని సమతుల్యం చేయడంలో ఉపయోగపడుతుంది. పుచ్చకాయ, తర్బూజా, హనీడ్యూ వంటి మెలన్ పండ్లలో క్షార స్వభావం ఎక్కువగా ఉంటుంది. ఇవి కడుపులోని పీహెచ్ స్థాయిలని సమతుల్యం చేయడంలో సహాయపడతాయి.



## వర్షాకాలంలో పాదాలకు ఫంగల్ ఇన్ఫెక్షన్ వస్తోందా?



వర్షాకాలంలో మురికి నీటిలో నడవడం వల్ల పాదాల్లో దురద, ఎర్రబడటం, ఫంగల్ ఇన్ఫెక్షన్లు వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. పాదాలు ఎక్కువసేపు తడిగా ఉండటం, చెమట పట్టడం వల్ల ఫంగస్, బ్యాక్టీరియా త్వరగా పెరుగుతాయి. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందేందుకు మందులతో పాటు కొన్ని ఇంటి చిట్కాలు కూడా ఉపయోగపడతాయని నిపుణులు సూచిస్తున్నారు. వర్షంలో బయటకు వెళ్లి ఇంటికి వచ్చిన వెంటనే పాదాలను శుభ్రమైన నీటితో బాగా కడుక్కోవాలి. తర్వాత గోరువెచ్చని నీటిలో కొద్దిగా రాతి ఉప్పు వేసి 10 నుంచి 15 నిమిషాలు పాదాలను అందులో నానబెట్టాలి. ఇది దురద, ఇన్ఫెక్షన్ తగ్గేందుకు సహాయపడుతుంది. వేపలో సహజసిద్ధమైన యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. వేప ఆకులను మరిగించిన నీటితో పాదాలను కడుక్కోవచ్చు. లేదా వేప నూనెను కొబ్బరి నూనెలో కలిపి ఇన్ఫెక్షన్ ఉన్న చోట రాయవచ్చు. టీ ట్రీ ఆయిల్ కూడా ఫంగల్ ఇన్ఫెక్షన్ తగ్గించడంలో ఉపయోగపడుతుంది. 2-3 చుక్కల టీ ట్రీ ఆయిల్‌ను కొబ్బరి నూనె లేదా బాదం నూనెలో కలిపి ప్రభావిత ప్రాంతంలో రాయాలి. సమాన మోతాదులో నీరు, ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపి అందులో పాదాలను 15 నిమిషాలు నానబెట్టాలి. ఇది ఫంగస్ పెరగకుండా సహాయపడుతుంది.

## డయాబెటిస్, గుండె జబ్బులు రాకుండా ఉండాలంటే మెటబాలిక్ ఆరోగ్యం ముఖ్యం..

ఊబకాయం, టైప్-2 డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధులు వంటి మెటబాలిక్ సమస్యలు ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్నాయి. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, ఒత్తిడి వంటి జీవనశైలి కారణాలే దీనికి ప్రధాన కారణాలుగా వైద్యులు చెబుతున్నారు. అందుకే మెటబాలిక్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం నేటి కాలంలో అత్యంత ముఖ్యమైన అంశంగా మారింది. మెటబాలిక్ ఆరోగ్యం బాగోలేకపోతే గుండెజబ్బులు, పక్షవాతం, కొన్ని రకాల క్యాన్సర్లు వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. అందువల్ల రక్తంలో చక్కెర స్థాయిలు, ట్రైగ్లిజరైడ్లు, హెచ్‌డీఎల్ (మంచి) కొలెస్ట్రాల్, రక్తపోటు, నడుము చుట్టుకొలత వంటి సూచికలు సాధారణ స్థాయిలో ఉండేలా చూసుకోవడం అవసరం. మెటబాలిక్ ఆరోగ్యం మెరుగ్గా ఉంటే వ్యాధుల ప్రమాదం తగ్గడమే కాకుండా శరీరానికి తగిన శక్తి లభిస్తుంది. అలాగే మానసిక ఆరోగ్యం మెరుగుపడి రోజువారీ పనులు ఉత్సాహంగా చేయగలుగుతారు. మొత్తం జీవన నాణ్యత కూడా మెరుగుపడుతుంది. వయసు పెరిగే కొద్దీ కండరాల బలం, మెదడు పనితీరు, శారీరక సామర్థ్యాన్ని కాపాడుకోవడంలో కూడా మెటబాలిక్ ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుంది. ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి ఇది బలమైన పునాది అని నిపుణులు చెబుతున్నారు. మెటబాలిక్ ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి ఐదు ప్రధాన జీవసూచికలను పరిశీలిస్తారు. అవి రక్తంలో చక్కెర స్థాయిలు, రక్తపోటు, ట్రైగ్లిజరైడ్లు, హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్, నడుము చుట్టుకొలత. ఇవి సాధారణ పరిధిలో ఉంటే మెటబాలిక్ ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు భావిస్తారు. మెటబాలిక్ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడం పూర్తిగా జీవనశైలిపై ఆధారపడి ఉంటుంది. పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, తక్కువ కొవ్వు ఉన్న ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే సమతుల ఆహారం తీసుకోవాలి. అలాగే ప్రాసెస్డ్ ఫుడ్స్, అధిక చక్కెర, ట్రాన్స్ ఫ్యాట్స్ ఉన్న ఆహారాన్ని తగ్గించడం మంచిది. వారానికి కనీసం 150 నిమిషాల మోస్తరు స్థాయి వ్యాయామం చేయడం ప్రయోజనకరం. నడక, పరుగెత్తడం, సైక్లింగ్ వంటి ఏరోబిక్ వ్యాయామాలతో పాటు కండరాల బలాన్ని పెంచే వ్యాయామాలు కూడా చేయడం వల్ల ఇన్సులిన్ స్పందన మెరుగుపడి మెటబాలిక్ పనితీరు బాగుంటుంది. ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం కూడా చాలా ముఖ్యం. అధిక బరువు ఉన్నవారు కొద్దిపాటి బరువు తగ్గినా మెటబాలిక్ ఆరోగ్యంలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తుంది. రోజుకు 7 నుంచి 9 గంటల నాణ్యమైన నిద్ర శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను కాపాడుతుంది. నిద్రలేమి వల్ల ఆకలి పెరగడం, జీవక్రియలో మార్పులు రావడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలిక ఒత్తిడి కూడా మెటబాలిక్ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ధ్యానం, యోగా, లోతైన శ్వాసాభ్యాసాలు వంటి రిలాక్సేషన్ పద్ధతులు ఒత్తిడిని తగ్గించడంలో ఉపయోగపడతాయి. అలాగే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి సూచికలను పర్యవేక్షించవచ్చు. ఏవైనా మార్పులు ఉంటే ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



## రోజంతా కూర్చుని పనిచేసేవారు గంటకోసారి 5 నిమిషాల పాటు వాకింగ్ చేయాలి..

రోజంతా ఎక్కువసేపు ఒకేచోట కూర్చుని పనిచేయడం ఆధునిక జీవనశైలిలో సాధారణమైపోయింది. అయితే ఈ అలవాటు ఊబకాయం, మధుమేహం, గుండెజబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని ఇప్పటికే అనేక అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. తాజాగా నిర్వహించిన పరిశోధన ప్రకారం, ప్రతి గంటకు ఐదు నిమిషాల పాటు నడవడం ద్వారా ఈ ప్రమాదాలను కొంతవరకు తగ్గించడంతోపాటు అలసటను తగ్గించి మానసిక ఉల్లాసాన్ని పెంచుకోవచ్చని తేలింది. ఈ అధ్యయన ఫలితాలను బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో ప్రచురించారు. ఇందులో గంటకోసారి ఐదు నిమిషాల నడక విరామం తీసుకోవడం ఆచరణలో సాధ్యమే కాకుండా, ఆరోగ్యపరంగా కూడా అత్యంత ప్రయోజనకరమైన పద్ధతిగా గుర్తించారు. అంతేకాకుండా, ఈ చిన్న విరామాలు ఉద్యోగుల పనితీరును ఏమాత్రం దెబ్బతీయలేదని పరిశోధకులు వెల్లడించారు. ఎక్కువసేపు కదలకుండా కూర్చోవడం ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారిందని పరిశోధకులు పేర్కొన్నారు. దీనివల్ల ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు మాత్రమే కాకుండా అకాల మరణ ప్రమాదం కూడా పెరిగే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో తరచూ లేచి కదలడం వల్ల కలిగే ప్రయోజనాలను వాస్తవ పరిస్థితుల్లో అంచనా వేయడానికి ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ పరిశోధనలో భాగంగా 19,300 మందికి పైగా ఉద్యోగుల వివరాలను విశ్లేషించారు. వారిలో సుమారు 11,484 మంది వరుసగా 14 రోజుల పాటు ప్రతి 30 నిమిషాలకు, 60 నిమిషాలకు లేదా 120 నిమిషాలకు ఒకసారి ఐదు నిమిషాల నడక విరామాన్ని స్వచ్ఛందంగా ఎంచుకుని పాటించారు. దీనికి ముందు ఏడు రోజుల పాటు వారు తమ సాధారణ దినచర్యనే కొనసాగించారు. 21 రోజుల పరిశోధన కాలంలో ప్రతిరోజూ నిర్వహించిన సర్వే ద్వారా పాల్గొన్నవారిలో అలసట, మానసిక స్థితి, పనితీరులో వచ్చిన మార్పులను పరిశీలించారు. మూడు రకాల విరామాలూ ఆచరణలో సాధ్యమేనని, ప్రజలు సులభంగా అంగీకరించగలరని ఫలితాలు వెల్లడించాయి. అయితే ప్రతి రెండు గంటలకు ఒకసారి విరామం తీసుకోవడం అమలు పరంగా సులభమైనప్పటికీ, ఆరోగ్య ప్రయోజనాల పరంగా తక్కువ ప్రభావాన్ని చూపింది. ప్రతి 30 నిమిషాలకు ఒకసారి విరామం తీసుకున్నవారిలో అలసట తగ్గడం, మానసిక ఉల్లాసం పెరగడం అత్యధికంగా కనిపించినప్పటికీ, దానిని క్రమం తప్పకుండా పాటించడం చాలామందికి కష్టంగా అనిపించింది. ఈ నేపథ్యంలో ప్రతి గంటకు ఒకసారి ఐదు నిమిషాల నడక విరామం తీసుకోవడం ఉత్తమ ఎంపికగా పరిశోధకులు పేర్కొన్నారు. ఇది అమలు చేయడానికి సులభంగా ఉండటంతో పాటు అలసటను తగ్గించడం, మంచి మానసిక స్థితిని పెంపొందించడం వంటి ప్రయోజనాలను సమతుల్యంగా అందించిందని వెల్లడించారు. అంతేకాకుండా, ఈ చిన్న నడక విరామాలు ఉద్యోగుల పనితీరుపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపలేదని అధ్యయనం స్పష్టం చేసింది.



## ఈ సీజన్‌లో చర్మానికి అంటుకుని ఉండే ఈ పరాన్న జీవులతో జాగ్రత్త..



వసంతకాలంలో వాతావరణం వెచ్చగా మారడంతో చాలా మంది బయట ఎక్కువ సమయం గడుపుతుంటారు. అయితే ఇదే సమయంలో లైమ్ వ్యాధిని వ్యాప్తి చేసే టిక్స్ (Ticks) అనే చిన్న పరాన్నజీవుల సంఖ్య కూడా పెరుగుతుంది. ఇవి కుట్టిన విషయం చాలామందికి తెలియకపోవచ్చు. కానీ సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ఈ ఇన్ఫెక్షన్ కీళ్లు, గుండె, నాడీ వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. లైమ్ వ్యాధికి బొరేలియా (Borrelia) నే కారణం. ముఖ్యంగా బొరేలియా బర్గ్‌డార్ఫెరి అనే జాతి ఈ వ్యాధిని కలిగిస్తుంది. ఈ బ్యాక్టీరియా జింకలు, ఎలుకలు, పక్షులు వంటి జంతువులపై జీవించే బ్లాక్-లెగ్డ్ టిక్స్ లేదా డీర్ టిక్స్ ద్వారా మనుషులకు వ్యాపిస్తుంది. బ్యాక్టీరియా సోకిన జంతువును కుట్టిన టిక్, తర్వాత మనిషిని కుట్టినప్పుడు ఈ బ్యాక్టీరియా రక్తంలోకి ప్రవేశిస్తుంది. సాధారణంగా టిక్ కనీసం 24 నుంచి 48 గంటల పాటు చర్మానికి అంటుకుని ఉంటేనే వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. టిక్స్ ఎక్కువగా వసంతకాలం చివరి నుంచి వేసవి, శరదృతువుల వరకు చురుకుగా ఉంటాయి. సాధారణంగా ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు వీటి చురుకుదనం ఎక్కువగా కనిపిస్తుంది. చలికాలం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో లేదా ఉష్ణోగ్రతలు గడ్డకట్టే స్థాయికి దిగని ప్రాంతాల్లో ఇవి దాదాపు ఏడాది పొడవునా కనిపించే అవకాశం ఉంటుంది. వాతావరణ మార్పులు, వర్షపాతం తీరులో మార్పులు, అడవుల్లో మానవ జోక్యం పెరగడం వల్ల టిక్స్ కొత్త ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. లైమ్ వ్యాధి ప్రారంభ లక్షణాలు సాధారణంగా టిక్ కుట్టిన మూడు నుంచి 30 రోజులలోపు కనిపిస్తాయి. జ్వరం, కండరాల నొప్పులు, తీవ్ర అలసట మొదటి లక్షణాలుగా ఉంటాయి. అలాగే టిక్ కుట్టిన చోట లక్ష్యాన్ని పోలి ఉండే గుండ్రని ఎర్రని దద్దుర్లు (బుల్స్-ఐ ర్యాష్) కనిపించడం ఈ వ్యాధికి ప్రధాన లక్షణంగా పరిగణిస్తారు. అయితే ప్రతి ఒక్కరిలో ఈ దద్దుర్లు కనిపించవు. కొన్నిసార్లు టిక్ కాటు వల్ల సాధారణ చర్మ చికాకు కూడా వస్తుంది. టిక్ కుట్టినట్లు తెలిసి ఫ్లూ లాంటి లక్షణాలు కనిపించినా, లేదా బుల్స్-ఐ దద్దుర్లు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.




## 78%తగ్గిన టాటా మోటార్స్ పీవీ లాభం




టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (పీవీ), ఏప్రిల్–జూన్‌లో రూ.859 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2025–26 ఇదే కాల లాభం రూ.4,003 కోట్లతో పోలిస్తే ఇది 78.54% తక్కువ. ఇదేసమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.87,677 కోట్ల నుంచి 9% పెరిగి రూ.95,799 కోట్లకు చేరింది. టాటా మోటార్స్ పీవీ విక్రయాలు 46%, ఈవీ విక్రయాలు 112% వృద్ధి నమోదు చేయడం గమనార్హం. దేశీయ పీవీ విపణిలో 14.3% వాటాతో రెండో స్థానాన్ని సంస్థ నిలబెట్టుకుంది. ఈవీ (విద్యుత్తు వాహన) విపణి వాటా స్థిరంగా 39% వద్ద ఉండగా, ఈ విభాగం లో అగ్రస్థానాన్ని కొనసాగించింది.

# 2028 కల్లా భారత్‌లో ఎగిరే కార్లు

మన దేశంలోనూ ఎగిరే కార్లు త్వరలో రానున్నాయ్. 2028 కల్లా భారత్‌లో తమ ఈవీటీఓఎల్ (ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్ ఆఫ్ అండ్ ల్యాండింగ్) వాహనాలు ప్రవేశ పెట్టాలని భావిస్తున్నట్లు జపాన్‌కు చెందిన 'ఫ్లైయింగ్ కార్' తయారీ సంస్థ స్కైడ్రైవ్ ఇంక్ అంటోంది. తొలుత మెడికల్ లాజిస్టిక్స్ విభాగంలో సేవలందించాలని భావిస్తున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ తొమొహిరో పేర్కొన్నారు. అవయవ మార్పిడి సమయంలో, అవయవాల రవాణాకు సమయమే అత్యంత కీలకమని.. ఈవి షయంలో భారత్‌లో తమ ఈవీటీఓఎల్ వాహనాలను ఉప యోగించడానికి ఎయిరిండియా, సుజుకీతో ఇటీవలే ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈవీటీఓఎల్ ఎయిర్‌క్రాఫ్ట్‌లనేవి రన్‌వే అవసరం లేకుండా నిలువుగా ల్యాండింగ్, టేకాఫ్ చేయగల చిన్నపాటి విద్యుత్ విమానాలు. ఇప్పటికే వీటిపై పరీక్షలు పూర్తయ్యాయని, గంటకు 100




కి.మీ. వేగంతో, 300కు పైగా పర్యాయాలు విజయవంతంగా ప్రయాణించాయని, ఇపుడు సర్టిఫికేషన్ దశలో ఉన్నాయని తొమిహిరో పేర్కొన్నారు. రెండేళ్లలో జపాన్‌తో పాటు భారత్‌లోనూ వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభిస్తామని అన్నారు. ఎక్కడ తయారీ: జపాన్‌లో ఈ ఫ్లైయింగ్ కార్ల తయారీకి సుజుకీతో స్కైడ్రైవ్ ఒప్పందం కుదుర్చుకుంది. భవిష్యత్‌లో భారత్‌లోనూ తయారీ చేపట్టి, పశ్చిమాసియా, ఆఫ్రికాకు ఇక్కడి నుంచే ఎగుమతులు చేస్తామని తెలిపింది. ఇప్పటికే 450 ప్రీఆర్డర్లు లభించగా, అందులో 50 భారత్ నుంచే ఉన్నాయని తొమిహిరో వెల్లడించారు. తొలుత వైద్యపరమైన అవసరాలకు, తర్వాత ప్రయాణికులను తీసుకెళ్లే ఎయిర్ ట్యాక్సీ వైపునకు అడుగులు వేస్తామని వివరించారు.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. హర్మూజ్ జలసంధి వద్ద నౌకల దిగ్బంధనం చేపడతామంటూ అమెరికా బెదిరించడం, చమురు ధరలు మళ్లీ పెరగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈ క్రమంలోనే సూచీలు రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొని ఈ వారాంతాన్ని నష్టాలతో ముగించాయి. సెన్సెక్స్ ఉదయం 77,903.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,079.96) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 77,684.37 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 71 పాయింట్లు నష్టపోయి 78,009.25 వద్ద ముగిసింది. నిఫ్టీ 29.85 పాయింట్ల నష్టంతో 24,366 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.43గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, ఇండిగో, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎస్‌బీఐ షేర్లు నష్టపోయాయి. భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్,



మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 87 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్స 4355 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# వ్యక్తులకు రూ.5 కోట్లు.. సంస్థలు, ట్రస్టులకు రూ.20 కోట్లు




అక్రిడేటేట్ ఇన్వెస్టర్ (అర్హత కలిగిన మదుపర్ల) హోదా పొందేందుకు 'సెక్యూరిటీస్– మార్కెట్– అసెట్స్' అర్హతా ప్రమాణాలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదించింది. దీని ద్వారా ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులు (ఏఐఎఫ్) వంటి వాటిల్లో మదుపర్ల ప్రాతినిధ్యాన్ని మరింత విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రతిపాదన ప్రకారం.. అక్రిడేటేడ్ ఇన్వెస్టర్ హోదా పొందేందుకు వ్యక్తులైతే ప్రస్తుత ఆదాయం లేదా నికర విలువ (నెట్‌వర్త్) నిబంధనలతో సంబంధం లేకుండా కనీసం రూ.5 కోట్ల సెక్యూరిటీస్– మార్కెట్ ఆస్తులు కలిగి ఉండాలి. కార్పొరేట్ సంస్థలు, ట్రస్టులకు (కుటుంబ ట్రస్టులు కాకుండా) ఈ పరిమితి రూ.20 కోట్లుగా ఉండనుంది. ప్రస్తుతం వ్యక్తులు, హిందు అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఏక యాజమాన్య వ్యాపార సంస్థలు (సోల్ ప్రొప్రయిటరీషిప్స్) నిర్దేశిత ఆదాయం (కనీసం రూ.2 కోట్లు) లేదా నికర సంపద (రూ.7.5 కోట్లు)లో ఏది తృప్తిపర్చినా అక్రిడేటేడ్ ఇన్వెస్టర్‌గా అర్హత పొందే వీలుంది. 2026 ఏప్రిల్ 30 నాటికి సెబీ నిర్వహించిన విశ్లేషణ ప్రకారం.. సెబీ తాజా ప్రతిపాదన వల్ల దాదాపు 3.7 లక్షల మంది మదుపర్లు అర్హత సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతమున్న 96,000 మందితో పోలిస్తే ఈ సంఖ్య దాదాపు 4 రెట్లు ఎక్కువ. ఈక్విటీ, డెట్ ఇన్వెస్ట్‌మెంట్‌లు, రీట్స్, ఇన్విట్స్, ఏఐఎఫ్ యూనిట్‌లు, డీమ్యాట్ రూపంలో ఉన్న మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు, అన్‌లిస్టెడ్ సెక్యూరిటీలు, విదేశీ సెక్యూరిటీ మార్కెట్ పెట్టుబడులు.. వీటన్నింటినీ అర్హత కలిగిన సెక్యూరిటీస్– మార్కెట్ ఆస్తులుగా పరిగణిస్తామని సెబీ తెలిపింది. మదుపర్లు పెట్టుబడుల పథకాల్లోకి అడుగుపెట్టే సమయంలోనే వారి అక్రిడేటేడ్ హోదాను నిర్ధారించడానికి ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్లకు అనుమతి ఇవ్వాలని సెబీ ప్రతిపాదించింది. ఆదాయ అర్హతల పరిశీలన కోసం తాజా ఆదాయపు పన్ను రిటర్న్‌ల వివరాలను మదుపర్లు తెలియజేయాల్సి ఉంటుంది. నికర సంపద విలువ కోసం ఆరు నెలల కంటే పాతది కాని చార్టర్డ్ అకౌంటెంట్ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించొచ్చు. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లతో సహా భారత వెలుపల నివసిస్తున్న వ్యక్తులందరినీ డీమ్డ్ అక్రిడేటేడ్ ఇన్వెస్టర్లుగా పరిగణించవచ్చనీ సెబీ ప్రతిపాదించింది.

ఈ ప్రతిపాదనలపై సెప్టెంబరు 3వరకు ప్రజల నుంచి సలహాలు, సూచనలను సెబీ కోరింది.

## కార్పొరేట్ ఆదాయాల్లో 22%వృద్ధి: ఇక్రా

'చమురు రంగంలో ఇబ్బందులున్నా, ఏప్రిల్ – జూన్ త్రైమాసికంలో దేశంలోని 838 నమోదిత కంపెనీల ఆదాయాలు సరాసరిన 22% పెరిగాయి. 2025–26 జనవరి – మార్చిలో నమోదైన 13% వృద్ధి కంటే ఇది ఎక్కువ. అయితే నిర్వహణ లాభాల మార్జిన్లు (ఓపీఎం) సగటున 200 బేసిస్ పాయింట్లు తగ్గాయని, నికర లాభాల్లో పెరుగుదల స్తబ్ధుగా ఉంద'ని దేశీయ రేటింగ్ సంస్థ ఇక్రా తెలిపింది. ముడి చమురు ధరలు అంతర్జాతీయంగా గణనీయంగా పెరిగినా.. దేశీయంగా ఎల్‌పీజీ, పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను సవరించకపోవడంతో.. చమురు మార్కెటింగ్ సంస్థల లాభదాయకతపై



ప్రతికూల ప్రభావం చూపాయని వివరించింది. అందువల్ల చమురు– గ్యాస్ రంగాన్ని మినహాయిస్తే, ఇతర రంగాల్లోని నమోదిత కంపెనీల సగటు ఓపీయం 19% వద్ద స్థిరంగా ఉందని, నికర లాభాలు వార్షికంగా 20 శాతానికి పైగా పెరిగాయని విశ్లేషించింది. ఇప్పటివరకు ఆయా కంపెనీలు ప్రకటించిన జూన్ త్రైమాసిక ఫలితాల ఆధారంగా చేసిన విశ్లేషణ ప్రకారం.. ఊహించిన దాని కంటే మరింత బలంగా 2026–27ను భారత కార్పొరేట్ రంగం ప్రారంభించినట్లు కనిపిస్తోందని ఇక్రా అభిప్రాయపడింది.

# విలీనానికి ఉబర్-రాపిడో చర్చలు..

అమెరికా రైడ్ హెయిలింగ్ సంస్థ ఉబర్, భారత్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ రాపిడో కలిసి విలీనం దిశగా అడుగులు వేశాయా? దేశీయంగా తమ కార్యకలాపాలను కలిసి నిర్వహించేందుకు చర్చలు జరిపాయా? అంటే అవుననే అంటున్నాయి సంబంధిత వర్గాలు. కానీ, యాజమాన్యం విషయంలో ఇరు సంస్థల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ డీల్‌కు బ్రేక్ పడినట్లు తెలిసింది. తాజాగా ఈ అంశం వెలుగులోకి వచ్చింది.

ఉబర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి ఈ ఏడాది మే నెలలో ఐదు రోజుల పాటు భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. దేశంలో పెట్టుబడులు, వ్యాపార విస్తరణ ప్రణాళికలపై ఆయన వరుస సమీక్షలు జరిపారు.

ఈ క్రమంలోనే రాపిడోతో విలీనం అంశం చర్చకు వచ్చినట్లు ఎకనమిక్ టైమ్స్ తెలిపింది. క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలందిస్తున్న ఇరు సంస్థలు కలిసి పని చేయాలని ఉబర్ తొలుత ప్రతిపాదించింది.

దేశీయంగా తమ కార్యకలాపాలను రాపిడో బృందమే నిర్వహించాలని తన ప్రతిపాదనలో పేర్కొంది. అయితే, రాపిడో మాత్రం అందుకు పూర్తి భిన్నమైన ప్రతిపాదనతో ముందుకొచ్చింది. ఉబర్ భారత వ్యాపారాన్ని పూర్తిగా తమకు క్యాష్– స్టాక్ లావాదేవీ రూపంలో విక్రయించాలని పేర్కొంది. రాపిడోలో ఉబర్ మైనారిటీ వాటాదారుగా ఉండేలా ప్రతిపాదన తీసుకొచ్చింది. కానీ, భారత్‌లో తమ వ్యాపారాన్ని పూర్తిగా విక్రయించడం ఇష్టంలేని ఉబర్ ఇందుకు నో చెప్పింది. దీంతో డీల్‌కు బ్రేక్ పడినట్లు




తెలిసింది. ప్రస్తుతం రెండు కంపెనీలు వేర్వేరుగా తమ కార్యకలాపాలను నిర్వహించుకుంటున్నాయి. అంతేకాదు రాపిడోకు పోటీగా ఉబర్ తన బైక్ ట్యాక్సీ సేవలను మరో 100 నగరాల్లో ప్రారంభించింది. మొత్తంగా 220 నగరాలకు ఈ సేవలను విస్తరించింది.




## మెస్సి ఆడాడు.. కోహ్లి, రోహిత్ ఆడలేరా?



ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సి 39 ఏళ్ల వయసులో ఫిఫా ప్రపంచకప్ ఆడగలిగినప్పుడు.. దాదాపు అంతే వయసున్న విరాట్ కోహ్లి, రోహిత శర్మ ఎందుకు క్రికెట్ ఆడలేరని భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అన్నాడు. కోహ్లి, రోహిత్‌లకు 2027 వన్డే ప్రపంచకప్ ఆడగలిగే సామర్థ్యం ఉందని అతడు అభిప్రాయపడ్డాడు. రో–కో వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు ఆటలో కొనసాగుతారా లేదా అనే సందిగ్ధత నెలకొన్న నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూ వేదికగా హర్భజన్ దీని గురించి స్పందించాడు. ''ఆటగాడు ఎవరైనా వారి ప్రదర్శనే కొలమానం. వారి వయసు కాదు. 39 ఏళ్ల వయసులో మెస్సి మైదానంలో దిగాడు. కోహ్లి, రోహిత్‌లకూ ఆ సామర్థ్యం ఉంది. వచ్చే ఏడాదికి విరాట్‌కు 39, రోహిత్‌కు 40 ఏళ్లు వస్తాయి. అయినా మైదానంలో కోహ్లి 20 ఏళ్ల కుర్రాళ్లను అధిగమిస్తున్నప్పుడు అతడి వయసు ప్రస్తావన అనవసరం. టెస్టుల్లో టీమ్‌ఇండియా రికార్డు ప్రదర్శనకు అతడి ఆలోచనా విధానమే కారణం. విరాట్ ఫిట్‌నెస్‌పై శ్రద్ధతో.. జట్టులో ఇతర ఆటగాళ్లలో స్ఫూర్తిని నింపాడు. నేనే కోచ్ అయితే వారికి అవకాశాలిస్తా. వైభవ్ సూర్యవంశీ వచ్చీ రాగానే బౌలర్లపై విరుచుకుపడగలడు. కానీ రోహిత్, కోహ్లిలకు దాదాపు 300 మ్యాచ్‌లు ఆడిన అనుభవముంది.

# రొనాల్డో–జార్జినా వివాహం.. ఆస్తి పంపకాలపై ముందే ఒప్పందం!



దాదాపు పదేళ్లపాటు రిలేషన్‌షిప్‌లో ఉన్న స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో – మోడల్ జార్జినా రోడ్రిగ్స్ ఇటీవల వివాహ బంధంలోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. అతికొద్దిమంది అతిథుల మధ్య ఘనంగా వీరి పెళ్లి వేడుక జరిగింది. తాజాగా ఈ వివాహానికి సంబంధించి పలు ఆసక్తికర విషయాలను బయటకొస్తున్నాయి. మ్యారేజీ సర్టిఫికేట్ వివరాల ప్రకారం ఇరువురి ఆస్తుల విషయంలో స్పష్టమైన విభజన చేసుకున్నట్లు తెలుస్తోంది.

పెళ్లి తర్వాత కూడా రొనాల్డో, జార్జినా ఎవరి ఆస్తులు వారి నియంత్రణలోనే ఉండేట్లు ఒప్పందం చేసుకున్నారని ఓ నివేదిక పేర్కొంది. ఒకరికొకరు తమ ఆస్తుల విషయంలో కలగజేసుకోకూడదనే నిబంధన పెట్టుకున్నట్లు సమాచారం. భవిష్యత్తులో అనివార్య కారణాల వల్ల విడిపోయినా ఎలాంటి సమస్య రాదని ఈ నిర్ణయం తీసుకున్నారట. ఈ ఒప్పందం ప్రకారం కాంట్రాక్ట్‌లు, ప్రకటనలు, బిజినెస్ వెంచర్స్, సీఆర్7 హోటల్ చెయిన్ నుంచి వచ్చే ఆదాయంతో పాటు ఆయా లీగులు ఆడటం ద్వారా అందుకొనే వేతనంపై సర్వహక్కులూ రొనాల్డోకే ఉంటాయి. ఒకవేళ భవిష్యత్తులో విడాకుల కోసం దరఖాస్తు చేసుకుంటే అమల్లోకి వచ్చే నిబంధనలూ వివాహ నమోదు పత్రంలో ఉన్నట్లు పోర్చుగీస్ పత్రిక 'టీవీ గియా' నివేదిక తెలిపింది. విడిపోతే నెలవారీగా రొనాల్డో నుంచి జార్జినాకు రూ. 1.10 కోట్లు భరణం ఇవ్వాలనేది అందులోని తొలి క్లాజ్. మాడ్రిడ్‌లోని లగ్జరీ మాన్షన్ 'లా ఫిన్కా' భవనంపైనా జార్జినాకు యాజమాన్య హక్కులు ఉండేలా రెండో క్లాజ్‌ను పొందుపర్చారు. ఆ భవనం ఖరీదు ప్రస్తుతం రూ.53.50 కోట్లుగా ఉన్నట్లు సమాచారం. రొనాల్డోకు చెందిన మిగతా ఆస్తుల్లో ఎలాంటి వాటా కూడా జార్జినాకు రాదని సదరు రిపోర్ట్ పేర్కొంది. అతి తక్కువ మంది సమక్షంలో వివాహం చేసుకున్న రోనాల్డో – జార్జినా భారీ ఎత్తున విందు కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. వేలాది మంది అభిమానులు, మీడియా ప్రతినిధుల కోసం మాడైరా ప్రాంతంలో రిసెప్షన్ పెట్టాలనేది వారిద్దరి యోచన. అయితే, దీనిపై అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు.

## 600వ టెస్టుకు నాయకత్వం గర్వంగా ఉంది.. ఆ బెర్తే మా లక్ష్యం: గిల్



శనివారం నుంచి శ్రీలంకతో టీమ్‌ఇండియా తొలి టెస్టు మ్యాచ్‌లో తలపడనుంది. మరోవైపు టెస్టు సారథిగా శుభ్‌మన్ గిల్ సంవత్సర కాలం పూర్తి చేసుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత్‌కిది 600వ మ్యాచ్. ఇలాంటి మైలురాయి టెస్టుకు నాయకత్వం వహించనుండటం గర్వంగా ఉందని కెప్టెన్ గిల్ వ్యాఖ్యానించాడు. భారత స్వాతంత్ర్య దినోత్సవం రోజున మ్యాచ్ ప్రారంభం కావడం మరింత ప్రత్యేక తను సంతరించుకుంటుందని తెలిపాడు. ''కెప్టెన్ పాత్రలో నేను చాలా సౌకర్యంగానే ఉన్నా. ఇప్పుడు శ్రీలంకతో టెస్టు సిరీస్‌లోనూ విజయం సాధించి వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తు ఆశలు సజీవంగా ఉంచుకోవడమే మా లక్ష్యం. కనీసం మేం ఏడు టెస్టుల్లో గెలవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి నుంచి మొదలుపెడతాం. అంతేకాకుండా స్వాతంత్ర్య దినోత్సవం రోజునే భారత్ 600వ టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఇలాంటి పోరుకు నాయకత్వం వహించడం గొప్ప గౌరవం'' అని గిల్ తెలిపాడు. ''మెరుగ్గా మారేందుకు ఆటగాళ్లకు తగినంత సమయం ఇవ్వాలి. కొందరికి కాస్త ఎక్కువ టైమ్ పడుతుంది. అయినా సరే వారికి మద్దతుగా నిలుస్తాం. మూడో స్థానంలో సాయి సుదర్శన్ బాగా ఆడాడు. అతడు గాయం కారణంగా దూరం కావాల్సి వచ్చింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ – మేనేజ్‌మెంట్ మధ్య సంబంధాలు సరిగా లేవని వస్తోన్న ఆరోపణలన్నీ అవాస్తవం. మేం అనుకొన్నంత వేగంగా సాయి సుదర్శన్ ఇంప్రూవ్ కాలేదు. అయితే, మా స్క్వాడ్‌లోని 15 మందిపై నమ్మకం ఉంది. తుది జట్టు ఎలా ఉంటుందనేది ఇప్పుడే చెప్పలేను. పేసర్ల విషయంలోనూ ఎంపిక కష్టంగా మారింది. గుర్నూర్ బ్రార్ పాత బంతితోనూ అద్భుతంగా బౌలింగ్ చేస్తాడు. బౌన్స్‌ను రాబడతాడు. అయితే, ప్రసిద్ధ్ వార్మప్ మ్యాచ్‌లో చాలా చక్కగా బంతులేశాడు. సిరాజ్‌తో పాటు (Siraj) మరొక పేసర్ ఎవరనేది తేల్చడం కాస్త క్లిష్టమైన నిర్ణయమే. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఫైనల్ XIను ప్రకటిస్తాం'' అని శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు.

## పెద్ద బాధ్యతల్లోకి వీవీఎస్ లక్ష్మణ్.. అజిత్ అగార్కర్‌కూ గుడ్‌న్యూస్!



టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రస్తుతం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు అధిపతిగా ఉన్నారు. అయితే, ఆయనకు ఇంకాస్త పెద్ద బాధ్యతలను అప్పగించేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. మరోవైపు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ కూడా తన పదవిని పొడిగించుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. సెప్టెంబర్‌లో భారత క్రికెట్ బోర్డు సర్వసభ్య సమావేశం జరగనుంది. ఇందులోనే కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తొలుత లక్ష్మణ్‌కు ప్రధాన కోచ్ లేదా చీఫ్ సెలక్టర్ పదవిని ఇస్తారనే ప్రచారం సాగింది. బీసీసీఐకి తదుపరి అధ్యక్షుడిని చేస్తారనే ఊహాగానాలు కూడా వచ్చాయి. కానీ, లక్ష్మణ్‌ను బీసీసీఐ (BCCI) డైరక్టర్ ఆఫ్ క్రికెట్‌గా నియమిస్తారని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. దేశవ్యాప్తంగా క్రికెట్ నిర్వహణకు సంబంధించి కీలక బాధ్యతలను డైరక్టర్ ఆఫ్ క్రికెట్‌గా నియమితులైన వారు పర్యవేక్షించాలి. సీనియర్ జట్టు, సెలక్టర్లు, కోచ్‌లు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, వివిధ దశల్లోని క్రికెటర్లతో నిరంతరం సంప్రదింపులు జరపాలి. ప్రతిభను గుర్తించడం, క్రీడాకారుల వృద్ధికి సహకరించడం, వారి నుంచి అత్యుత్తమ ప్రదర్శన వచ్చేలా ప్రోత్సహించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయడం వంటి కార్యకలాపాలను నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, సీవోఈలో ఇప్పటికే ఇలాంటి బాధ్యతల్లోనే లక్ష్మణ్ ఉన్నారు. ప్రస్తుత చీఫ్ సెలక్టర్‌గా ఉన్న అజిత్ అగార్కర్ పదవీ కాలం సెప్టెంబర్‌లోనే ముగియనుంది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ జరగనుంది. ఇలాంటి సమయంలో సెలక్షన్ కమిటీలో మార్పులు చేయడం కంటే కొనసాగించడమే మేలనే ఉద్దేశంలో బీసీసీఐ ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే, వార్షిక సమావేశంలో అగార్కర్ పదవీకాలాన్ని వచ్చే ఏడాది జూన్ వరకూ పొడిగించాలని భావిస్తోంది. అలాగే లక్ష్మణ్‌ను డైరక్టర్‌గా తీసుకుంటే.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ బాధ్యతలను మరొకరికి అప్పగించాల్సి ఉంటుంది.

# టోకెన్ అమౌంట్ రూ.100కే జంషెడ్‌పుర్ ఎఫ్‌సీ షేర్లు బదిలీ!

జంషెడ్‌పుర్ ఫుట్‌బాల్ క్లబ్ కొత్త యాజమాన్యం చేతుల్లోకి వెళ్లింది. టాటాల ఆధ్వర్యంలో నడిచిన ఈ క్లబ్‌ను చర్చిల్ బ్రదర్స్ సొంతమైంది. తాజాగా జంషెడ్‌పుర్ ఎఫ్‌సీలోని షేర్లను రూ.100 టోకెట్ అమౌంట్‌కే ట్రాన్స్‌ఫర్ చేయడం గమనార్హం. అయితే, ఇది మొత్తం డీల్ విలువ అయి ఉండకపోవచ్చని సమాచారం. ఇండియన్ సూపర్ లీగ్‌లో గోవాకు చెందిన చర్చిల్ బ్రదర్స్ సంస్థ యాజమాన్యంలో జంషెడ్‌పుర్ ఫుట్‌బాల్ క్లబ్ ఆడే అవకాశం ఉంది. టాటా స్టీల్ డైరక్టర్స్ కమిటీ 4.08 కోట్ల ఈక్విటీ షేర్లను బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపింది. కొనుగోలు ఒప్పందం మీద సంతకాలు కూడా




జరిగాయి. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ అప్రూవల్‌తోపాటు ఇతర ఫార్మాలిటీలు పూర్తయ్యేందుకు దాదాపు 15 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. టాటా స్టీల్ – చర్చిల్ బ్రదర్స్ సంస్థ డీల్‌లో జంషెడ్‌పుర్ ఎఫ్‌సీ స్పోర్టింగ్ లైసెన్స్, 12 మంది ప్లేయర్లు, ఇద్దరు కోచ్‌ల కాంట్రాక్ట్‌లు ఉంటాయి. తాము లైసెన్స్‌ను తీసుకుంటున్నట్లు ఇప్పటికే ఏఐఎఫ్‌ఎఫ్ దృష్టికి చర్చిల్ బ్రదర్స్ సంస్థ తెలియజేసింది. ఫెడరేషన్ ఆమోదం లభించిన వెంటనే జంషెడ్‌పుర్ ఎఫ్‌సీ చర్చిల్ బ్రదర్స్ చేతికి వెళ్తుంది. భారత్‌లో ఫుట్‌బాల్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దశాబ్దం కిందట జంషెడ్‌పుర్ క్లబ్ ను టాటా స్టీల్ ప్రారంభించింది. అయితే, ఇటీవల ఇండియన్ సూపర్ లీగ్‌లో ఆడేందుకు ఎంట్రీ ఫీజును యాజమాన్యం చెల్లించలేదు. ఈ డీల్‌కు కొద్ది రోజుల ముందు నుంచే క్లబ్ నుంచి వైదొలగాలని నిర్ణయం తీసుకుంది. టాటా ఫుట్‌బాల్ అకాడమీని మరింత విస్తృతపరిచి క్షేత్రస్థాయిలో గేమ్‌కు సహకారం అందించాలనేది లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడు చర్చిల్ బ్రదర్స్‌కు షేర్స్‌ను బదిలీ నేపథ్యంలో టాటా స్టీల్‌కు జంషెడ్‌పుర్ ఎఫ్‌సీతో బంధం ముగిసినట్లయింది.

# VenkyAnil5 #NkrAR2 నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్



**వుదయం సినిమా:** విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న #VenkyAnil5 #NKRAR2 భారీ వినోదాత్మక చిత్రంగా రూపుదిద్దుకుంటూ శరవేగంగా ముందుకు సాగుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. కళ్యాణ్ రామ్ పుట్టినరోజున విడుదల చేసిన ఆయన ఫస్ట్–లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది.ఇండస్ట్రీలో వెంకటేష్ 40 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో వెంకటేష్ ఇండియన్ ఆర్మీ క్యామోఫ్లేజ్ యూనిఫామ్‌లో, సన్‌గ్లాసెస్, స్కార్ఫ్ ధరించి పవర్ ఫుల్ గా కనిపించారు. ఓ రగ్గడ్ SUV పక్కన నిల్చున్న ఆయన లుక్‌లో ఇంటెన్సిటీ అదిరిపోయింది. ఈ లుక్‌తో వెంకటేష్ ఓ రగ్గడ్ మిలటరీ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారనే విషయం అర్థమవుతోంది.పోస్టర్‌లో వెంకటేష్ పాత్రను లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డిగా పరిచయం చేశారు. ఇండియన్ ఆర్మీలో పనిచేసే ఆయన కౌంటర్ టెర్రరిజం, హోస్టేజ్ నెగోషియేషన్‌లో నిపుణుడిగా కనిపించనున్నారు. బ్యాక్‌డ్రాప్‌లో కనిపించే ఆర్మీ ఇన్‌సిగ్నియా, క్రాస్‌డ్ స్వోర్డ్స్ ఎంబ్లమ్ సినిమా మిలటరీ నేపథ్యాన్ని మరింత ఎఫెక్టివ్ గా వున్నాయి. మ్యూటెడ్ బ్లూ–గ్రీన్ స్కై, రాకీ టెర్రైన్, భారీ SUVతో పోస్టర్‌కు అడ్వెంచరస్, దేశభక్తి టచ్ వచ్చింది. ఎర్తీ క్యామోఫ్లేజ్ టోన్స్ కూడా ఈ రగ్గడ్ లుక్‌కు చక్కగా సరిపోయాయి. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కాంబినేషన్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. వారి మధ్య ఉండే కెమిస్ట్రీ, కామెడీ.. అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు మరింత బలాన్ని చేకూర్చనున్నాయి.వెంకటేష్ సరసన కీర్తి సురేష్ నటిస్తుండగా, కళ్యాణ్ రామ్‌కు జోడీగా కృతి శెట్టి కనిపించనున్నారు. జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్‌గా, ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.హ్యూమర్, ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామాతో పాటు పండగ వాతావరణానికి తగ్గ కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ చిత్రం సంక్రాంతి 2027 కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.నటీనటులు: విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టి.




# 'జార్జ్ క్రిష్' - సినిమా గ్రాండ్ లాంచ్



**వుదయం సినిమా:** 'నారి నారి నడుమ మురారి', 'బైకర్' వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకున్న 'చార్మింగ్ స్టార్' శర్వా, తొలిసారిగా దర్శకుడు శ్రీను వైట్లతో జతకట్టారు. ATV సమర్పణలో, అనిల్ సుంకర AK ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అజయ్ సుంకర సహ–నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. పూర్తి స్థాయి కుటుంబ కథా చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమాకు 'జార్జ్ క్రిష్' అనే ఆసక్తికరమైన టైటిల్ పెట్టారు.ప్రత్యేకమైన డిజైన్‌తో వెంటనే దృష్టిని ఆకర్షించేలా ఉన్న కలర్ ఫుల్ పోస్టర్ ద్వారా చిత్ర బృందం టైటిల్, విడుదల తేదీని ప్రకటించింది. 'శతమానం భవతి', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'నారి నారి నడుమ మురారి' వంటి చిత్రాలతో పండుగ సీజన్‌లో గుర్తుండిపోయే విజయాలను అందుకున్న శర్వాకు సంక్రాంతి సెంటిమెంట్ చాలా ప్రత్యేకమైనది. ఆ సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ, 'జార్జ్ క్రిష్' చిత్రం 2027 జనవరి 14న పండుగ సీజన్‌లో విడుదల కానుంది.ఈ టైటిల్ పోస్టర్ పసుపు–నారింజ రంగుల నేపథ్యంతో, పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించే సాంప్రదాయ అలంకరణలతో అలరారుతోంది. టైటిల్ బోల్డ్, స్టైలిష్‌గా చేతిరాతలో ఒక 'అవర్ గ్లాస్' డిజైన్‌లో, నల్లని బ్రష్–స్ట్రోక్ అవుట్‌లైన్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టైటిల్ డిజైన్‌లో శర్వా హీరోయిన్‌ను చేతుల్లోకి ఎత్తుకున్న చిన్న సిల్హౌట్ ను కూడా పొందుపరిచారు.

# 'శనార్తి' - సినిమా షురూ

**వుదయం సినిమా:** బ్లాక్‌బస్టర్ దర్శకుడు సంపత్ నంది విజయవంతమైన నిర్మాణ సంస్థ సంపత్ నంది టీమ్‌వర్క్స్, శ్రీ ధనలక్ష్మి ప్రొడక్షన్స్ అధినేత, అభిరుచి గల నిర్మాత కె.వి. శ్రీధర్ రెడ్డితో కలిసి తన రెండవ చిత్రాన్ని నిర్మించడానికి సిద్ధమవుతోంది. ప్రతిష్టాత్మక ఆదిత్య మూవీస్ బ్యానర్ సమర్పిస్తోంది.'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న అఖిల్ రాజ్, యంగ్ ట్యాలెంటెడ్ నాగ దుర్గ ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రముఖ తెలంగాణ జానపద గీతాలలో తన ఉత్సాహభరితమైన నటనతో పేరుపొందిన నాగ దుర్గకు ఇది తెలుగులో తొలి సినిమా. సంపత్ నంది శిష్యుడైన రాజ్ గణేష్ ఉప్పునూతి ఈ ప్రాజెక్ట్‌తో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.ఈ చిత్రానికి 'శనార్తి' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. ఇది తెలంగాణలో సాంప్రదాయకంగా పలకరించడానికి ఉపయోగించే పదం. టైటిల్ పోస్టర్‌లో ఒక చేయి పసుపు పచ్చ రంగులో, మరొక చేయి ఎరుపు రంగులో ఒకదానికొకటి పట్టుకున్న రెండు చేతులు.. విభిన్న రంగులు, అనుబంధం, సంప్రదాయం, ఐక్యతను అందంగా సూచిస్తాయి.రెండు చేతుల మణికట్టు చుట్టూ పవిత్రమైన జంధ్యాలు కట్టి ఉండగా, ఎరుపు రంగు వేసిన చేతికి సాంప్రదాయ ఎర్ర గాజుల దండ అలంకరించబడి ఉంది. పసుపు, కుంకుమ రంగులతో పాటు, ఈ అంశాలు తెలంగాణ ఆచారాలు, వేడుకలు, సంప్రదాయాల వాతావరణాన్ని గుర్తుకు తెస్తున్నాయి.టైటిల్ కింద "A Tale of Culture" అనే ట్యాగ్‌లైన్ సినిమా బ్యాక్ డ్రాప్ ని స్పష్టంగా సూచిస్తుంది. సాంస్కృతిక చిహ్నాలను ఆసక్తికరమైన విజువల్ మేళవించి టైటిల్ పోస్టర్ బలమైన ముద్ర వేస్తుంది.రచయితగా, కథకుడిగా, షోరన్నర్‌గా తనకున్న ప్రతిభతో పేరుగాంచిన దర్శకుడు సంపత్ నంది 'ఓదెల' ఫ్రాంచైజీతో సహా విజయవంతమైన కథలు, ఫ్రాంచైజీలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. 'శనార్తి'తో ఆయన అనుబంధం ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను పెంచుతోంది.తన విలక్షణమైన సంగీతంతో శంసలు పొందిన సురేష్ బొబ్బిలి ఈ చిత్రానికి సంగీతపరంగా మరింత బలాన్ని చేకూరుస్తున్నారు. ఆయన అందించే సంగీతం సినిమాలోని గ్రామీణ నేపథ్యానికి సరిగ్గా సరిపోవడమే కాకుండా చిత్రంలోని భావోద్వేగాలను పెంచుతోంది. హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో ప్రముఖ సినీ ప్రముఖులు, చిత్ర బృందం సమక్షంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది.



# 'బా బా బ్లాక్ షీప్' నుంచి ఫస్ట్ లిరికల్ సాంగ్

**వుదయం సినిమా:** అనుకోకుండా జరిగే ఓ ఘటన కొన్ని సందర్భాల్లో మనతో పాటు మన చుట్టూ ఉన్న వారి జీవితాల్లోనూ అనుకోని పరిణామాలు చోటు చేసుకోవటానికి కారణమవుతాయి. అలాంటి ఓ వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతోన్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ 'బా బా బ్లాక్ షీప్'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోనేపూడి నిర్మిస్తున్న ఈ మూవీకి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ , విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళవి, కశ్యప్, రాజారవీంద్ర తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మేఘాలయా రాష్ట్రంలో పూర్తిగా చిత్రీకరణను జరుపుకున్న తొలి దక్షిణాది సినిమా ఇదే కావటం విశేషం. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. టీజర్‌ను గమనిస్తే సినిమాలో పాత్రలను పరిచయం చేస్తూ అవెలా ప్రవర్తిస్తాయనే విషయాన్ని రివీల్ చేశారు. సినిమా కథనంలో ఓ వేగం కనిపిస్తూనే ఎంటర్‌టైనింగ్‌గానూ సినిమా ఉంటుందనేది స్పష్టమవుతుంది. ఈ నేపథ్యంలో ..తాజాగా మేకర్స్ ఈ సినిమాను దసరా సందర్భంగా అక్టోబర్ 9న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. అలాగే ఈ సినిమా నుంచి ఫస్ట్ లిరికల్ సాంగ్ 'ఆజా మేరీ జాని' సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్‌ను రాక్‌స్టార్ దేవిశ్రీప్రసాద్ రిలీజ్ చేయటం విశేషం. సాంగ్ యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉందని, డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని దేవిశ్రీప్రసాద్ చిత్ర యూనిట్‌ను అభినందించారు.



# స్వాతంత్ర్య గానం !!

స్వాతంత్ర్యం స్ఫూర్తితో దేశ భక్తి సుగంధం వెదజల్లేలా తెలుగు చిత్రాలకు రచయితలు చాలా పాటలు రాయడం సంగీత దర్శకులు వాటికి చక్కని స్వరం కూరుస్తే గాయనీ గాయకులు ఆలపించగా దర్శకుల ఆయా నటీనటులతో చక్కగా చిత్రీకరించి ప్రేక్షకులను అలరించారు. మాలపిల్ల రైతు బిడ్డ, పదండి ముందుకు, ఎమ్ ఎల్ ఎ.., పెద్ద మనుషులు, అల్లూరి సీతారామరాజు, సర్దార్ పాపారాయుడు, మేజర్ చంద్రకాంత్, భారతీయుడు వంటి చిత్రాలు దేశ భక్తి , రాజకీయ నాయకుల కుతంత్రాలు వెల్లడయ్యేలా రూపొందించారు. కొన్ని సినిమాల్లో సందర్భోచితంగా పెట్టిన పాటలు సన్నివేశాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.శ్రీ శ్రీ,, ఆరుద్ర, ఆత్రేయ, సి. నారాయణ రెడ్డి , జాలాది, మోదుకూరి జాన్సన్, అందెశ్రీ, చక్కని గీతాలు రాసారు. వీటిలో శ్రీ శ్రీ,, ఆరుద్ర, సినారె పాటలు ఇచ్చే స్ఫూర్తి అంతా ఇంతా కాదు. 'అల్లూరి సీతా రామరాజు ' లోని తెలుగు వీర లేవరా దీక్ష బూని సాగరా, దేశమాత స్వేచ్ఛ కోరి తిరుగుబాటు చేయరా, దారుణ మారణకాండకు తల్లడిల్లవద్దురా, నీతిలేని శాసనాలు నేటి నుండి రద్దురా... ఎప్పటికీ ఉత్తేజపరిచి ఉద్రేకపరిచేదే ! జాతీయ స్థాయి లో తొలిసారి అవార్డు అందుకున్న తెలుగు చిత్రంకి తెలుగు రచయిత గీతం ఇది. 'వెలుగు నీడలు ' లో పాడవోయి భారతీయుడా ఆడి పాడవోయి విజయ గీతికా, నేడే స్వాతంత్ర్య దినం వీరుల త్యాగఫలం, నేడే నవోదయం.. గీతంలో భవిష్యత్ కూడా దృష్టిలో పెట్టుకుని ధరలు పెరుగుదల, నిరుద్యోగ సమస్య, చీకటి బజారు, అవినీతి, బంధు ప్రీతి, కుల మత బేధాలు, పదవీ వ్యామోహాలు అన్నీ కళ్లకు కట్టేటట్టు ఉంటుంది. 'రాముడు భీముడు ' లో ఉందిలే మంచి కాలం ముందు ముందునా...,'విప్లవ శంఖం 'లో మూయించిన ఒక వీరుని కంఠం వేయి గొంతుల విప్లవ శంఖం...' ఈనాడు ' లో నేడేఈనాడే ప్రజా యుద్ధ సంరంభం నేడే ఈ నాడే ప్రళయ శక్తి సంచలనం... 'యమ గోల' లో సమరానికి నేడే ప్రారంభం..'కాలచక్రం ' లో పదండి ముందుకు పదండి తోసుకు పదండి పోదాం పై పైకి... ' భూమి కోసం ' లో ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా.. అంటూ పైన పేర్కొన్న శ్రీ శ్రీ రాసిన గీతాలు నిరంతరం స్ఫూర్తి నిచ్చేవే ! ఎన్.టి.అర్ టైటిల్ పాత్ర పోషించిన' బడి పంతులు ' లో హెడ్ మాస్టర్ గా విద్యార్థి బృందంతో పాడినట్టు చిత్రీకరించిన భారత మాతకు జేజేలు బంగరు భూమికి జేజేలు, ఆసేతు హిమాచల సస్య శ్యామల జీవధాత్రికీ జేజేలు, త్రివేణి సంగమ పవిత్ర భూమి నాల్గు వేదములు పుట్టిన భూమి.. ఉత్సాహభరితులను చేస్తుంది.' రామ రాజ్యం 'సినిమాలో దేశ వర్ణన పల్లె ప్రజల తీరుతో సాగే ఇదే రామ రాజ్యము మా గ్రామ రాజ్యము సమతతో మమతతో సాగి పోవు రాజ్యము, మాకు లేనిదొక్కటే స్వార్ధము మాకు రానిదొక్కటే వైరము చేతకాని దొక్కటే వైరము అలరిస్తుంది. ఇవి ఆత్రేయ పాటలు. దేశంలోని నాటి నేటి పరిస్థితులు వెల్లడయ్యేలా 'పవిత్ర బంధం'లో గాంధీ పుట్టిన దేశమా ఇది నెహ్రూ కోరిన సంఘ మా ఇది, రామ రాజ్యం సామ్య వాదం సంభవించే కాలమా ఇది... అని ఆవేదనతోసాగుతుంది. 'అల్లూరిసీతారామ రాజు' లో రగిలింది విప్లవాగ్ని ఈ రోజు ఆ అగ్ని పేరు అల్లూరి సీతారామరాజు..., అని విప్లవం మరణించదు వీరుడు మరణించడు అని సాగే గీతాలు రక్తం ఉరకలు వేసేలా చేస్తాయి. 'సిపాయి చిన్నయ్య ' లో నా జన్మభూమి ఎంతో అందమైన దేశము... అనే గీతమూ ఆరుద్ర రాసిన వాటిలోని దేశ భక్తి గీతాలు. 'బంగారు మనిషి 'లో ఎక్కడికెళుతోంది దేశం ఏమైపోతోంది హిమ శైల శిఖరం పైకా, పాతాళ కుహరంలోకా... అనే దాంట్లో 'వందేమాతరం ' లో తరం మారుతున్నది ఆ స్వరం మారుతున్నది, వందేమాతర గీతం వరస మారుతున్నది... అంటూ ఆవేదనా భరితంగా సి. నారాయణ రెడ్డి రాసినవి గుండెలు పిండేస్తాయి.













–వి.ఎస్.అర్. కేశవరావు

# "తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు" మూవీ ప్రారంభం




**వుదయం సినిమా:** కన్నడ చిత్ర పరిశ్రమలో 'సుప్రీమ్ స్టార్' గా పేరు తెచ్చుకున్న భార్గవ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా "తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు". ఈ చిత్రంలో మీనాక్షి జైస్వాల్, ఆరియా మీనన్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు కన్నడ భాషల్లో కొసల క్రియేటివ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై ప్రొడ్యూసర్ బండి నాగరాజు నిర్మిస్తున్నారు. మద్దినేని రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. భార్గవ్ బి. వి. దర్శకత్వం వహిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే ఎమోషనల్ థ్రిల్లర్ గా ఈ సినిమా రూపొందనుంది. శుక్రవారం హైదరాబాద్ లో పూజా కార్యక్రమాలతో ఈ చిత్ర ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు క్లాప్ ఇవ్వగా, ఫిలించాంబర్ సెక్రటరీ కె. అశోక్ కుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు దశరథ్ తొలి షాట్ కు గౌరవ దర్శకత్వం వహించారు. డైరెక్టర్ వీరశంకర్ స్క్రిప్ట్ అందజేశారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.